**జర్నలిస్టులు కావలెను**

క్రైం కౌంటర్ తెలుగు దినపత్రిక
గత 15 సంవత్సరాలుగా పత్రికా
రంగంలో ప్రత్యేక గుర్తింపు
కలిగిన క్రైం కౌంటర్ తెలుగు దిన
పత్రికలో పనిచేసేందుకు
ఆసక్తి, అనుభవం కలిగిన జర్నలిస్టులు
కావలెను.



APTEL /25/A2478

# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

గుంటూరు | సంపుటి : 02 | సంచిక : 257 | శుక్రవారం 29- 05 - 2026 | పేజీలు : 4 | వెల. 2/-



**రిపోర్టర్లు కావలెను**

క్రైం కౌంటర్


తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో
- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349





## ఎన్టీఆర్ ఆశయాల సాధనకు

### ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉంది: ప్రధాని మోదీ

**ఢిల్లీ, మే 28 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** మాజీ సీఎం, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు 103వ జయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఘన నివాళులు అర్పించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రధాని ఓ పోస్టు పెట్టారు. మహనీయులు ఎన్టీఆర్ గారి జయంతి సందర్భంగా వారికి ఘన నివాళులు. పేదలకు, అణగారిన వర్గాలకు గౌరవాన్ని కల్పించే దిశగా ప్రజా సంక్షేమం, సుపరిపాలన పట్ల ఆయనకున్న అంకితభావం నేటికీ ప్రజల మదిలో చిరస్థాయిగా నిలిచి ఉంది. చలనచిత్ర రంగానికి ఆయన అందించిన సేవలు తరతరాలను అలరిస్తూనే ఉన్నాయి. ఆయన జీవితం, ఆశయాలు ఎంతోమందికి అపారమైన స్ఫూర్తిని అందిస్తూనే ఉంటాయి. నా మిత్రుడు చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్డీఏ ప్రభుత్వం, ప్రజల కోసం ఆయన కలలుగన్న ఆశయాలను సాకారం చేయడానికి కట్టుబడి ఉంది’ అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు.

## క్రైమ్ కౌంటర్’ పత్రిక పేరుతో నకిలీ రిపోర్టర్ల హల్చల్..

## ఎడిటర్ కె.వి. ప్రసాద్ హెచ్చరిక







విజయవాడ,మే 27: “క్రైమ్ కౌంటర్” తెలుగు దినపత్రిక పేరును వాడుకుంటూ కొందరు వ్యక్తులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు పత్రికా యాజమాన్యం వెల్లడించింది. సంస్థకు ఎలాంటి సంబంధం లేని కొందరు కేటుగాళ్లు, సొంతంగా నకిలీ గుర్తింపు కార్డులు (Fake ID Cards) తయారు చేయించుకుని క్షేత్రస్థాయిలో తిరుగుతున్నట్లు సమాచారం అందింది.వీరు తాము జర్నలిస్టులమంటూ ప్రభుత్వ అధికారులు, కాంట్రాక్టర్లను బెదిరిస్తూ, పెద్ద మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. పత్రికా రంగానికి కలంకం తెచ్చే విధంగా ప్రవర్తిస్తున్న ఇటువంటి నకిలీ రిపోర్టర్ల పట్ల అధికార యంత్రాంగం, కాంట్రాక్టర్లు మరియు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ‘క్రైమ్ కౌంటర్’ పత్రిక ఎడిటర్ కె.వి. ప్రసాద్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. కార్డులపై ఉన్న సమాచారాన్ని, క్యూఆర్ కోడ్‌లను క్షుణ్ణంగా పరిశీలించాలని, ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే రూపాయి కూడా ఇవ్వవద్దని ఆయన స్పష్టం చేశారు. ఎవరికైనా ఇటువంటి నకిలీ ఐడీ కార్డులు కలిగిన వ్యక్తులు కనిపిస్తే లేదా ‘క్రైమ్ కౌంటర్’ పేరుతో బెదిరింపులకు పాల్పడితే, వెంటనే ఎడిటర్ కె.వి. ప్రసాద్ (మొబైల్: 9849707349) గారిని సంప్రదించి సమాచారం అందించాలని, లేదా స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు. మోసగాళ్లపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

## మరణంలేని మహా మనిషి

## ఎన్టీఆర్‌కు జోహార్లు:



**అమరావతి, మే 28 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు 103వ జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఘన నివాళులు అర్పించారు. ఈ మేరకు గురువారం తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. ‘ప్రపంచానికి తెలుగుజాతి ఖ్యాతిని చాటి చెప్పిన విశ్వ విఖ్యాత నటసార్వభౌముడు నందమూరి తారకరామారావు జయంతి సందర్భంగా ఆ మహనీయుని సేవలు స్మరిస్తూ నివాళులు అర్పిస్తున్నాను. తెలుగు జాతి ఆత్మ గౌరవంగా తెలుగుదేశం పార్టీ పతాకాన్ని ఎగురవేశారు’..అణగారిన వర్గాలకు అండగా పసుపు జెండాని నిలబెట్టారు. మహిళా సాధికారతకు బాటలు వేశారు. ప్రజల కోసం.. ప్రగతి కోసం తెలుగుదేశం పార్టీని అంకితం చేశారు. సంక్షేమానికి చిరునామా అయ్యారు. అన్నా అంటే నేనున్నానంటూ ఆదుకున్నారు. కోట్లాది హృదయాల్లో కొలువైన మరణంలేని మహా మనిషి ఎన్టీఆర్‌కు జోహార్లు. తాతా.. మీరే తెలుగు ప్రజల కీర్తి.. మీరే మాకు నిత్య నూతన స్ఫూర్తి’ అని రాసుకొచ్చారు.

## మహానాడు వేదికగా

## సీఎం చంద్రబాబు

## సంచలన నిర్ణయం



**అమరావతి, మే 28 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** మహానాడు ముగింపు సభలో టీడీపీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహిళా సాధికారతపై సంచలన ప్రకటనలు చేశారు. ఈ ఏడాది మహానాడును పూర్తిగా ఆడబిడ్డలకు అంకితం చేస్తున్నట్లు ప్రకటిస్తూ, దీనిని ‘మహిళా మహానాడు’గా ఆయన అభివర్ణించారు. హైబ్రిడ్ విధానంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కేవలం ఒక్కరోజే రికార్డు స్థాయిలో 17.50 లక్షల మంది హాజరుకావడం విశేషం. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. మహిళలకు గతంలో ఆస్తి హక్కు కల్పించిన ఘనత టీడీపీదేనని, ఇప్పుడు వారికి రాజకీయ స్వేచ్ఛను కూడా తమ పార్టీయే అందిస్తుందని స్పష్టం చేశారు. చట్టసభల్లో

2 లో

## హంద్రీనీవాను

### పూర్తి చేసిన ఘనత చంద్రబాబుదే: నిమ్మల

**అమరావతి, మే 28 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** సాగునీటి ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు దూరదృష్టి అమోఘమని మంత్రి నిమ్మల రామానాయుడు వ్యాఖ్యానించారు. నీటిపారుదల అభివృద్ధికి టీడీపీ ప్రభుత్వాలే పునాది వేశాయని పేర్కొన్నారు. జలం ఉన్న చోటే నాగరికత అభివృద్ధి చెందిందని తెలిపారు. మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన మహానాడులో ‘నీటిపారుదల అభివృద్ధి – నదుల అనుసంధానం’పై మంత్రి నిమ్మల మాట్లాడారు. పల్లెల నుంచి పట్టణాల నుంచి.. మహానగరాలుగా అభివృద్ధి చెందిన పరిస్థితి ఉందని చెప్పుకొచ్చారు. ఈ సత్యాన్ని గ్రహించే.. అనాడు




మాజీ సీఎం ఎన్టీఆర్ దగ్గర నుంచి.. నేటి చంద్రబాబు వరకు సాగునీటి ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యం

2 లో



## ఆ విషయాన్ని నమ్మిన నాయకుడు

## సీఎం చంద్రబాబు:

**అమరావతి, మే 28 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందాలంటే కేంద్రం సహకారం తప్పనిసరి అని నమ్మిన నాయకుడు, ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు అని కేంద్ర కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు. గురువారం రాజధాని అమరావతిలో టీడీపీ నిర్వహించిన మహానాడులో రాష్ట్రానికి

2 లో


గుంటూరు, ప్రకాశం, విజయవాడ, కాకినాడ, అనంతపూర్, కడప ఎడిషన్లతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యాప్తంగా వెలువడుతున్న క్రైం కౌంటర్ దినపత్రికలో వ్యాపార ప్రకటనలకు సంప్రదించండి. 9849707349

## రాయలసీమ జీవనాడి హంద్రీనీవాను పూర్తి చేసిన ఘనత చంద్రబాబుదే: నిమ్మల

ఇస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ఇరిగేషన్ శాఖ గురించి మాట్లాడాల్సి వస్తే.. తెలుగుదేశం పార్టీకి ముందు.. ఆ తర్వాత అనే విధంగా ఉందని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. జగన్ హయాంలో ఇరిగేషన్ శాఖను నిర్వీర్యం చేశారని ధ్వజమెత్తారు. రూ.18 వేల కోట్ల అప్పులు మిగిల్చారని మండిపడ్డారు. హంద్రీనీవా రాయలసీమ జీవనాడి అని.. అలాంటి హంద్రీనీవా గత ఐదేళ్లలో ఒక్క అడుగు కూడా ముందుకు సాగలేదని అన్నారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫేజ్--1ను పూర్తి చేసి.. 727 కిలోమీటర్లకు సీఎం చంద్రబాబు కృష్ణ జలాలను తీసుకువెళ్లారని ప్రస్తావించారు.

తుంగభద్ర ప్రాజెక్టు గేట్లను పట్టించుకోలేదు.. తుంగభద్ర ప్రాజెక్టు గేట్లు ప్రమాదభరితంగా ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తే.. గొడ్డలిపార్టీ కనీసం పట్టించుకోలేదని మంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజమెత్తారు. 2024లో తుంగభద్ర ప్రాజెక్టులోని 19వ గేటు కొట్టుకుపోతే కర్ణాటక ప్రభుత్వం కూడా ఏం చేయలేకపోయిందని చెప్పారు. సీఎం చంద్రబాబు అప్పటికప్పుడు జలాశయాల ఇంజినీరింగ్ నిపుణుడు కన్నయ్యనాయుడుకి ఫోన్ చేశారని వివరించారు. వరద కొనసాగుతుండగానే గేటు పునర్నిర్మాణం చేసి 80 టీసీఎంల నీటిని సముద్రం పాలు కాకుండా చూశారని అన్నారు. రాయలసీమ బిడ్డనని చెప్పుకుంటున్న వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అదే రాయలసీమకు ఎందుకు గొడ్డలి పోటు వేశారో సమాధానం చెప్పాలని మంత్రి నిమ్మల రామానాయుడు ప్రశ్నించారు.

## మహానాడు వేదికగా చంద్రబాబు సంచలన నిర్ణయం..

మహిళలకు 33 శాతం సీట్లు కేటాయిస్తామని ఆయన ప్రకటించారు. కేంద్రం పరిధిలో అన్ని పార్టీలు దీనికి అంగీకరించకపోయినా, తమ పార్టీ పరంగా ఈ రిజర్వేషన్లను కచ్చితంగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. కేంద్రం తీసుకొచ్చే మహిళా బిల్లుకు టీడీపీ పూర్తి సహకారం అందిస్తుందన్నారు. ఒకప్పుడు వరకట్నం ఇవ్వడం భారంగా ఉండేదని, కానీ నేడు ఆడపిల్లలకు 'రివర్స్ డౌరీ' ఇచ్చే పరిస్థితి వచ్చిందని వ్యాఖ్యానించారు. మహిళలు రాజకీయంగా ముందుండాలని, వారిని నడిపించడానికి తాను సిద్ధంగా ఉన్నానని సీఎం చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. 'ఆడబిడ్డల జోలికి వస్తే అదే మీకు చివరి రోజు' అని ఇదే వేదికగా ప్రతిపక్షాలకు చంద్రబాబు హెచ్చరికలు జారీ చేశారు.

## ఆ విషయాన్ని నమ్మిన నాయకుడు సీఎం చంద్రబాబు: కేంద్ర మంత్రి పెమ్మసాని

కేంద్ర సహాయం అనే తీర్మానంపై కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రజల కలల రాజధాని అమరావతి కోసం రూ.15,000 కోట్లు కేంద్ర బడ్జెట్‌లో కేటాయించిందని వివరించారు. చరిత్రలో ఎవరూ కదిలించలేని విధంగా రాజధాని అమరావతికి చట్టబద్ధత తీసుకొచ్చామని గుర్తు చేశారు. సంకెళ్లతో అమరావతిని గొడ్డలి పార్టీ బంధిస్తే.. సంకల్పంతో అమరావతిని సాధించామని స్పష్టం చేశారు.గోదావరి నీళ్లు సముద్రంలో కాకుండా రైతు జీవితాల్లో కలవాలనే లక్ష్యంతో పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తున్నామని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. 2014-19లోనే పోలవరం పనులు 70 శాతం పూర్తి చేశామని.. కానీ గత వైసీపీ ప్రభుత్వం 5 శాతం పనులు మాత్రమే చేసిందని సోదాహరణంగా ఆయన వివరించారు. 2027 నాటికి పోలవరం పూర్తి చేసి 30 లక్షల ఎకరాలను సస్యశ్యామలం చేస్తామని ప్రకటించారు. ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కు కోసం కేంద్రం రూ.11,400 కోట్లు సాయం చేసిందని వివరించారు. ఉక్కును కరిగించవచ్చు కానీ.. ఆంధ్రుల సంకల్పాన్ని వైఎస్ జగన్ కరిగించలేడన్నారు. నాడు పంచాయతీ రాజ్ శాఖమంత్రిగా నారా లోకేశ్.. గ్రామాల్లో సీసీ రోడ్లు వేయడానికి ఎంతో కృషి చేశారని పెమ్మసాని చంద్రశేఖర్ గుర్తు చేశారు. గత వైసీపీ ప్రభుత్వం కేంద్రం పథకాలు సద్వినియోగ పరుచుకోవడంలో విఫలమయిందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ హయాంలో రూ.12,000 కోట్లు చెల్లించి సుమారు 82 కేంద్ర పథకాలను పునరుద్ధరించామని వివరించారు. అమృత్ స్కీమ్ కింద కొత్తగా 2 లక్షల కొత్త కుళాయి కనెక్షన్లు ఇచ్చామన్నారు. నీళ్లు అందించడం సంక్షేమం కాదని.. ప్రభుత్వాల బాధ్యత అని వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి గుర్తించలేక పోయారని పేర్కొన్నారు. ఈ రెండేళ్లలో రూ.20,000 కోట్ల రైల్వే ప్రాజెక్టులు రాష్ట్రానికి తీసుకొచ్చామని పెమ్మసాని చంద్రశేఖర్ వివరించారు. 316 ఆర్వోబీ పాంట్లు,16 వందే భారత్ రైళ్లు, 73 అమృత్ భారత్ స్టేషన్లు అభివృద్ధి చేస్తున్నామన్నారు. రూ.2,500 కోట్లతో అమరావతిలో రైల్వే ప్రాజెక్టు, సౌత్ కోస్ట్ రైల్వే జోన్ సాధించామని చెప్పారు. జగన్ ప్రభుత్వ హయాంలో ఆ ఐదేళ్లలో భోగాపురం ఎయిర్ పోర్టు కోసం కేవలం రూ.600 కోట్లు ఖర్చు చేస్తే... కూటమి ప్రభుత్వం రూ.4,000 కోట్లు ఖర్చు చేసి ప్రారంభానికి సిద్ధం చేసిందని వివరించారు. పూర్వోదయ పథకం కింద రాయలసీమలో రూ.40 వేల కోట్లతో హార్టికల్చర్ హబ్ అభివృద్ధి చేస్తున్నామన్నారు. గూగుల్ నుంచి గ్రీన్ హైడ్రోజన్ వరకు ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక ముద్ర వేసిందని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వివరించారు.

## ఐటీ హబ్‌గా ఏపీని మార్చిన విజనరీ లీడర్ సీఎం చంద్రబాబు: హోంమంత్రి అనిత

నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణంలో, ఐటీ రంగాభివృద్ధిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు పాత్ర ఎంతో గొప్పదని, ఆయన విజనరీ లీడర్ అని రాష్ట్ర హోంమంత్రి అనిత కొనియాడారు. చంద్రబాబు నాయుడుకు ఉన్న దార్శనికత వల్లే నాడు ఉమ్మడి రాష్ట్రంలోనే కాకుండా.. విభజన తర్వాత కూడా ఏపీ ఐటీ హబ్‌గా ఎదగడానికి బలమైన పునాదులు పడ్డాయని ఆమె స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర హోంమంత్రి అనిత మాట్లాడుతూ.. 'రాష్ట్ర విభజన జరిగిన సమయంలో దాదాపు రూ.16 వేల కోట్ల లోటు బడ్జెట్‌తో నవ్యాంధ్ర ప్రస్థానం అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ప్రారంభమైంది. చంద్రబాబు తన సుదీర్ఘ అనుభవంతో, అపారమైన దార్శనికతతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించారు. 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు ఎన్నో విప్లవాత్మక పరిపాలనా సంస్కరణలు తీసుకువచ్చారు. 2019-24 ఐదేళ్ల కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో పూర్తిగా విధ్వంస పాలన కొనసాగింది. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి రాగానే, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్మించిన 'ప్రజావేదిక' భవనాన్ని కూల్చివేశారు.

## బాపట్ల డా ఎన్.టి.ఆర్. కాలేజ్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ప్రాంగణం లో ఘనంగా నిర్వహించిన డా. ఎన్.టి. రామారావు జయంతి వేడుకలు

**ది 28 మే 2026. (బాపట్ల క్రైమ్ కౌంటర్ బ్యూరో చీఫ్ రెడ్డి వర ప్రసాద్)** ప్రముఖ నటుడు, మాజీ ముఖ్యమంత్రి, తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీక అయిన డా. నందమూరి తారక రామారావు (ఎన్.టి.ఆర్) జయంతి వేడుకలను డా. ఎన్.టి.ఆర్. కాలేజ్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొని అయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన జీవిత విశేషాలు, ప్రజాసేవ, తెలుగు సంస్కృతి అభివృద్ధికి చేసిన కృషి, నాయకత్వ లక్షణాల గురించి అధ్యాపకులు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డా. ఎన్. వినోద, ఇన్‌చార్జ్ అసోసియేట్ డీన్, శ్రీమతి పద్మ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, సిహెచ్. సోమేశ్వరరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్, డా. కె. నివేదిత, అసిస్టెంట్ ప్రొఫెసర్ మరియు విద్యార్థి కార్యకలాపాల ఇన్‌చార్జ్ అధికారి, శ్రీమతి వై. అరుణ కుమారి, అసిస్టెంట్ ప్రొఫెసర్, డా. ఎస్. బ్లెస్సీ సాగర్,



అసిస్టెంట్ ప్రొఫెసర్, డా. ఈ. గౌతమి, అసిస్టెంట్ ప్రొఫెసర్, పద్మ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, డా. ఎస్. వినోద్ బాబు, టీచింగ్ అసోసియేట్, డా. కె. వినయ్ ప్రమోద్ కుమార్, టీచింగ్ అసోసియేట్, వై. దిలీప్ సీన్, టీచింగ్ అసోసియేట్ పాల్గొన్నారు.

## మహానాడు వేదికగా బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నూతన మహిళా కమిటీ సభ్యుల పేర్లను అధికారికంగా ప్రకటించిన శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు



**ది 28 మే 2026. (బాపట్ల క్రైమ్ కౌంటర్ బ్యూరో చీఫ్ రెడ్డి వర ప్రసాద్)** బాపట్లలో జరిగిన మహానాడు వేదికగా బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీలో నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా... గౌరవ బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు ఈ రోజు నూతన మహిళా కమిటీ సభ్యుల పేర్లను అధికారికంగా ప్రకటించారు. నూతనంగా ఎన్నికైనవారు అధికారిక ప్రమాణస్వీకార మహోత్సవాన్ని త్వరలోనే నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. నూతన కమిటీ సభ్యుల పేర్లు :

బాపట్ల నియోజకవర్గ ప్రెసిడెంట్ చెన్నుపాటి హైమావతి
బాపట్ల నియోజకవర్గ మహిళా జనరల్ సెక్రటరీ కట్టా సుజాత
బాపట్ల పట్టణ మహిళా ప్రెసిడెంట్ సబ్బినేని శ్రీదేవి
బాపట్ల పట్టణ మహిళా జనరల్ సెక్రటరీ షేక్ నజ్మా
బాపట్ల రూరల్ మహిళా ప్రెసిడెంట్ కాగిత నాగబూషణమ్మ
బాపట్ల మండలం మహిళా జనరల్ సెక్రటరీ మోపర్తి నిర్మల
కర్లపాలెం మండలం మహిళా ప్రెసిడెంట్ ఇనగంటి సునీత
కర్లపాలెం మండలం మహిళా జనరల్ సెక్రటరీ దేవరంపాటి ఇందిర

ప్రజా సంక్షేమ ధ్యేయంగా ప్రతీ ఒక్కరు పనిచేయాలని అందుకు నా సహాయ సహకారాలు నిరంతరం మీకు అందిస్తానని వర్మ అన్నారు. మహిళా మండలి సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

# ఘనంగా టిడిపి మహానాడు వేడుకలు

## ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు,!!





**పెద్దవడుగూరు, మే 28 క్రైమ్ కౌంటర్ న్యూస్ రాము రిపోర్టర్** తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న మహానాడు-2026 రెండవ రోజు కార్యక్రమాలు మండల కేంద్రంలో ఘనంగా జరిగాయి. పెద్దవడుగూరు, క్లస్టర్-02 పరిధిలోని జెసి ఫంక్షన్ హాల్‌లో గురువారం ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు.తెలుగుదేశం పార్టీ పెద్దవడుగూరు మండల నాయకులు చిన్నవడుగూరు దివాకర్ రెడ్డి ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు, తెదేపా శ్రేణుల సమక్షంలో ఎన్టీఆర్ జయంతి కేక్‌ను కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. అనంతరం పార్టీ శ్రేణులంతా 'మై టిడిపి' యాప్ ద్వారా తమ హాజరును డిజిటల్ పద్ధతిలో నమోదు చేసుకున్నారు. ఆ తర్వాత మహానాడు వర్చువల్ మీటింగ్‌కు పెద్ద ఎత్తున హాజరై అగ్రనాయకత్వం సందేశాలను వీక్షించారు. కార్యక్రమానికి విచ్చేసిన నాయకులకు, కార్యకర్తలకు మరియు అభిమానులకు అందరికీ మండల కమిటీ ఆధ్వర్యంలో భోజన సదుపాయం కల్పించారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో తెలుగు తమ్ముళ్లు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు....

## బాపట్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు ఆధ్వర్యంలో ఘనంగా 'డిజిటల్ మహానాడు'

**ది 28 మే 2026. (బాపట్ల క్రైమ్ కౌంటర్ బ్యూరో చీఫ్ రెడ్డి వర ప్రసాద్)** బాపట్ల నియోజకవర్గంలో డిజిటల్ మహానాడు కార్యక్రమాలు రెండో రోజు కూడా వైభవంగా జరిగాయి. బాపట్ల పట్టణంలోని 'వి కన్వెన్షన్ హాల్' తో పాటు బాపట్ల మండలం వెదుళ్ళపల్లి, కర్లపాలెం మండలం పెద గొల్లపాలెం గ్రామంలోని కళ్యాణ మండపం, మరియు కర్లపాలెం పెద్దింటమ్మ దేవాలయ వద్ద కళ్యాణ మండపంలోఈ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ డిజిటల్ మహానాడు కార్యక్రమాలలో బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ వేగేశన నరేంద్ర వర్మ రాజు, రాష్ట్ర గ్రంథాలయ అభివృద్ధి సంస్థ చైర్మన్, బాపట్ల నియోజకవర్గ పరిశీలకులు గోనుగుంట్ల కోటేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, స్వర్గీయ నందమూరి తారకరామారావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కార్యకర్తలు, నాయకులతో కలిసి మహానాడు ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ప్రతి క్లస్టర్ పరిధిలోని ఐదుగురు చొప్పున తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు.



# అర్తిమళ్ళ రత్తయ్యకి నివాళులు అర్పించిన కొమ్మాలపాటి





క్రైంకౌంటర్ కోటేశ్వరరావు పెద్దకూరపాడు న్యూస్ : సీనియర్ తెలుగుదేశం పార్టీ నేత పెదకూరపాడు మండల తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు అర్తిమల్ల రమేష్ తండ్రి గురువారం స్వర్గస్తులయ్యారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు మరియు పెదకూరపాడు మాజీ శాసనసభ్యులు కొమ్మాలపాటి శ్రీధర్ ఆయన భౌతికయానికి సందర్శించి నివాళు లర్పించి రమేష్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసి రత్తయ్య గారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని కోరుకున్నారు కొమ్మలపాటి. ఆయన వెంట పెదకూరపాడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

# ఐదు లక్షల విరాళం ప్రకటించిన కొమ్మాలపాటి శ్రీధర్



క్రైం కౌంటర్ కోటేశ్వరరావు పల్నాడు జిల్లా : తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమానిధికి రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు , పల్నాడు మాజీ అధ్యక్షులు, మాజీ పెదకూరపాడు నియోజకవర్గ శాసనసభ్యులు కొమ్మలపాటి శ్రీధర్ మహానాడు వేదికగా చంద్రబాబుకి ఐదు లక్షల రూపాయల విరాళంగా చెక్కును అందజేశారు . ఈ సందర్భంగా చంద్రబాబు కార్యకర్తల సంక్షేమ నిధికి విరాళాలు ఇచ్చిన నాయకులను సభలో ప్రకటించారు. ఈ వరుసలోనే కొమ్మాలపాటి శ్రీధర్ పేరును చంద్రబాబు సభలో స్వయంగా చదివారు . పార్టీ పట్ల కార్యకర్తల పట్ల తనకున్న అంకితభావం చాటుకున్నారు శ్రీధర్.

# నీట్ పరీక్ష.. ఎయిర్‌ఫోర్స్ సాయం తీసుకునే యోచనలో కేంద్రం!

ఇంటర్నెట్ డెస్క్: పేపర్ లీక్ నేపథ్యంలో రద్దు చేసిన నీట్ పరీక్షను మరోసారి జూన్ 21న నిర్వహించనున్న కేంద్రం ఈ దిశగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తోంది. ఈసారి ఎలాంటి లోపాలకు తావు లేకుండా ప్రశ్న పత్రాల తరలింపు కోసం ఎయిర్‌ఫోర్స్‌ను వినియోగించే ప్రతిపాదనను కేంద్రం పరిశీలిస్తున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. నీట్ పరీక్ష ఏర్పాట్లకు సంబంధించి గురువారం రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నివాసంలో సమావేశం జరిగినట్టు తెలుస్తోంది. ఈ సమావేశంలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, ఎన్‌టీఏ డైరెక్టర్ జనరల్, విద్యాశాఖలోని ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ప్రధాని కార్యాలయం అధికారులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ప్రశ్నపత్రం రూపకల్పన, ప్రింటింగ్, రవాణా, పంపిణీ.. ఇలా పరీక్షకు సంబంధించి ప్రతి దశపై పటిష్ఠ నిఘా పెట్టే విషయమై ఈ సమావేశంలో చర్చ జరిగినట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారాలను నేరుగా ప్రధాన మంత్రి కార్యాలయం పర్యవేక్షిస్తున్నట్టు సమాచారం. ఈ ఏడాది నీట్ పరీక్షను మే 3న 551 నగరాల్లో నిర్వహించిన విషయం తెలిసిందే. 22 లక్షల పైచిలుకు విద్యార్థులు నీట్‌కు హాజరయ్యారు. ఆ తరువాత పేపర్ లీక్ అయిన విషయం వెలుగులోకి రావడంతో మే 12న ప్రభుత్వం నీట్ పరీక్షను రద్దు చేసింది. అసలేం జరిగిందో తెలుసుకునేందుకు సీబీఐ దర్యాప్తు ప్రారంభించింది. ఈ నేపథ్యంలో జూన్ 21న మరోసారి పరీక్ష నిర్వహించనున్నట్టు ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. ఈసారి దాదాపు 23 లక్షల మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతారని ప్రభుత్వం అంచనా వేస్తోంది.



## బాపట్ల జిల్లా : కర్లపాలెం మండలంలో భార్య పై కత్తి తో దాడి చేసిన భర్త, హుటాహుటిన ఏరియా వైద్యాశాలకు తరలించిన బంధువులు

ది 28 మే 2026. (బాపట్ల క్రైమ్ కౌంటర్ బ్యూరో చీఫ్ రెడ్డి వర ప్రసాద్) బాపట్ల జిల్లా, కర్లపాలెం మండలంలో భార్య మెడపై కత్తి తో భర్త దాడి చేయగా బలమైన గాయం కావటం వలన అది గమనించిన బంధువులు హుటాహుటిన ఏరియా వైద్యాశాలకు తరలించారు. క్షతగాత్రురాలుకు వైద్యశాల వైద్యులు తక్షణమే మెరుగైన వైద్య చికిత్స అందించి మహిళా ప్రాణాలను కాపాడారు. సుమారు 15కు పైగా కుట్లు వేసినట్లు సమాచారం. చిన్న గాయం అయితేనే బాపట్ల ఏరియా వైద్యశాల నుండి గుంటూరుకు తరలిస్తారన్న అపవాదును పక్కనపెట్టి వైద్యులు చికిత్స చేసి క్షతగాత్రురాలి ప్రాణాలు కాపాడి ఏరియా ఆసుపత్రి కు మంచి పేరు తెచ్చారు. ప్రస్తుతం ఐసీయూలో అబ్జర్వేషన్ లో ఉంచామని వైద్యులు తెలియచేశారు. బాధితురాలి బంధువులు వైద్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పూర్తి విషయాలు తెలియవలసి ఉంది.

## స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతిని పురస్కరించుకొని బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు పార్టీకి అందించిన విరాళం రూ 10,000,000 (10 లక్షల రూపాయలు)




ది 28 మే 2026. (బాపట్ల క్రైమ్ కౌంటర్ బ్యూరో చీఫ్ రెడ్డి వర ప్రసాద్) విశ్వవిఖ్యాత నటసార్వభౌమ, నటరత్న, పద్మశ్రీ, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతిని పురస్కరించుకొని, మహానాడు వేదికగా బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు తెలుగుదేశం పార్టీకి ?10,000,000 (10 లక్షల రూపాయలు) విరాళంగా ప్రకటించారు. ఈ సందర్భంగా పార్టీ పట్ల, అయన ఆశయాల పట్ల తమకున్న నిబద్ధతను చాటుకున్నారు.

# ఎన్.టి.రామారావు కు ఘన నివాళి.



క్రైమ్ కౌంటర్ : నరసరావుపేట. (ప్రతినిధి.జి.ఎం.కె.)– ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, మహానటుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి ని పురస్కరించుకొని పల్నాడు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం నందు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా ఎస్పీ. బి.కృష్ణారావు మరియు ఇతర పోలీసు అధికారులు కలిసి ఎన్టీఆర్ చిత్రపటానికి ఘనంగా పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ 1923 మే 28న కృష్ణా జిల్లా నిమ్మకూరు గ్రామంలో ఒక సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన నందమూరి తారక రామారావు గారు అసాధారణ క్రమశిక్షణ,పట్టుదలతో విశ్వవిఖ్యాత నటసార్వభౌముడిగా ఎదిగారన్నారు. కేవలం సినీ రంగంలోనే కాకుండా, రాజకీయాల్లోకి వచ్చిన తొమ్మిది నెలల్లోనే ప్రభంజనం సృష్టించి ముఖ్యమంత్రి అయ్యారని, తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. పేద ప్రజల అభ్యున్నతి కోసం ఆయన తీసుకున్న నిర్ణయాలు నేటికీ ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. క్రమశిక్షణ, సేవాభావం, ప్రజల పట్ల అంకితభావం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం అని పేర్కొన్నారు. ఆయనకు భారత ప్రభుత్వం 'పద్మశ్రీ' పురస్కారాన్ని ప్రదానం చేసిందన్నారు. ఆయన చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతి ఏడాది మే 28 వ తేదీన ఎన్టీఆర్ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. 1996 జనవరి 18న ఆయన భౌతికంగా దూరమైనప్పటికీ నటుడిగా,మహోన్నత నాయకుడిగా తెలుగు ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ పేరు ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచి ఉంటుందన్నారు. ఆయన ఆశయాలు, సమాజం పట్ల ఆయనకున్న నిబద్ధత నేటి తరానికి ఎంతో ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ. జెవి . సంతోష్,ఏ ఆర్. డిఎస్పి.మహాత్మా గాంధీ రెడ్డి,యంటి.ఆర్ ఐ.యువరాజ్,వెల్ఫేర్ ఆర్ఐ.యల్ . గోపీనాథ్,హోంగార్డ్ ఆర్ ఐ.ఎస్.కృష్ణ మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పెదకూరపాడులో ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు

క్రైంకౌంటర్ కోటేశ్వరరావు పెదకూరపాడు న్యూస్ : పెదకూరపాడు నియోజకవర్గ వ్యాప్తంగా దివంగత ఎన్టీఆర్ స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి వేడుకలు గురువారం ఘనంగా తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు జరుపుకున్నారు . నియోజకవర్గ హెడ్ క్వార్టర్ పెదకూరపాడు గ్రామంలో మండల పార్టీ అధ్యక్షులు ఏటుకూరి బ్రహ్మయ్య ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మాజీ ఎంపీపీ గల్లా బాబు, 75 తాళ్లూరు సొసైటీ చైర్పర్సన్ పర్సన్ ఏటుకూరి రత్నకుమార్, సీనియర్ నాయకులు మద్దినేని వెంకట సత్యనారాయణ బెల్లంకొండ గోపాలరావు, నీటి సంఘం అధ్యక్షులు వడ్లమూడి అప్పారావు, హాస్పిటల్ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ అన్నాప్రసాద్, తెలుగు యువత నాయకులు గల్లా శివ నాగరాజు, ఎటుకూరి అరవిందబాబు, షేక్ ముంతాజ్, ఇంకా ముఖ్య నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

## బాపట్లలో ఘనంగా ఎన్టీఆర్ విగ్రహ పునరావిష్కరణ : పాల్గొన్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ



ది 28 మే 2026. (బాపట్ల క్రైమ్ కౌంటర్ బ్యూరో చీఫ్ రెడ్డి వర ప్రసాద్) బాపట్ల పట్టణంలోని గడియార స్తంభం (క్లాక్ టవర్) సెంటర్‌లో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అక్కడ నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు పునరావిష్కరించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ అభివృద్ధి సంస్థ చైర్మన్, బాపట్ల నియోజకవర్గ పరిశీలకులు గోనుగుండ్ల కోటేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు మరియు ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

# ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఫెడరేషన్ గుంటూరు జిల్లా చైర్మన్ గా షేక్ సమీర్



క్రైమ్ కౌంటర్ న్యూస్ : కర్నూలు ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఫెడరేషన్ సంస్థ గుంటూరు జిల్లా చైర్మన్ గా గుంటూరు జిల్లా మంగళగిరి కి చెందిన షేక్ సమీర్ గారు ఎంపికయ్యారని ఐహెచ్ఆర్ఎఫ్ నేషనల్ చైర్మన్ హైకోర్టు ప్రముఖ న్యాయవాది గౌరవ శ్రీ కొంగరి అనిల్ కుమార్ గారు న్యూఢిల్లీలోని ఐ హెచ్ఆర్ఎఫ్ ప్రధాన కార్యాలయం నుండి అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారని నేషనల్ వైస్ చైర్మన్ ఆర్. కంబగిరి స్వామి గారు గురువారం కర్నూలు లోని ఐ హెచ్ ఆర్ ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యాలయం నుండి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు అనంతరం నూతనంగా నియమితులైన షేక్ సమీర్ గారు మాట్లాడుతూ సర్వ మానవ హక్కుల పరిరక్షణ కై కృషి చేస్తామని అవినీతి నియంత్రణ చేసేందుకై తమదైన శైలిలో సంస్థలో విధులు నిర్వహిస్తామని మానవ హక్కుల ఉల్లంఘన భంగం కలగకుండా నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ వారి దృష్టికి తీసుకెళ్లి అందరికీ న్యాయం జరిగేలా విధులు నిర్వహిస్తామని రాజ్యాంగబద్ధంగా ఉన్న చట్టాలను భారత దేశ పౌరులకు అందరికీ అవగాహన కల్పించేలా కృషి చేస్తామని ఆయన తెలిపారు.

# ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఫెడరేషన్ అన్నమయ్య జిల్లా చైర్మన్ గా షేక్ ముస్తాఫల్లి



క్రైమ్ కౌంటర్ న్యూస్ : కర్నూలు ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఫెడరేషన్ సంస్థ అన్నమయ్య జిల్లా చైర్మన్ గా కడప జిల్లాకు చెందిన షేక్ ముస్తాఫల్లి ఎంపికయ్యారని ఐహెచ్ఆర్ఎఫ్ నేషనల్ చైర్మన్ హైకోర్టు ప్రముఖ న్యాయవాది గౌరవ శ్రీ కొంగరి అనిల్ కుమార్ గారు న్యూఢిల్లీలోని ఐ హెచ్ఆర్ఎఫ్ ప్రధాన కార్యాలయం నుండి అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారని నేషనల్ వైస్ చైర్మన్ ఆర్. కంబగిరి స్వామి గారు గురువారం కర్నూలు లోని ఐ హెచ్ ఆర్ ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యాలయం నుండి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు అనంతరం నూతనంగా నియమితులైన షేక్ ముస్తాఫల్లి గారు మాట్లాడుతూ సర్వ మానవ హక్కుల పరిరక్షణ కై కృషి చేస్తామని అవినీతి నియంత్రణ చేసేందుకై తమదైన శైలిలో సంస్థలో విధులు నిర్వహిస్తామని మానవ హక్కుల ఉల్లంఘన భంగం కలగకుండా నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ వారి దృష్టికి తీసుకెళ్లి అందరికీ న్యాయం జరిగేలా విధులు నిర్వహిస్తామని రాజ్యాంగబద్ధంగా ఉన్న చట్టాలను భారత దేశ పౌరులకు అందరికీ అవగాహన కల్పించేలా కృషి చేస్తామని ఆయన తెలిపారు.

# ఎన్టీఆర్ 103వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ




**వేటపాలెం మే 28 (క్రైమ్ కౌంటర్):** బాపట్ల జిల్లా వేటపాలెం మండలం రామన్నపేట పంచాయతీ పరిధిలోని రావూరిపేట గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి, తెలుగు ప్రజల ఆరాధ్య నాయకుడు ఎన్టీ రామారావు విగ్రహం వద్ద 103వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంక్షేమ రాజ్య సృష్టికర్తగా, "సమాజమే దేవాలయం -- పేద ప్రజలే దేవుళ్లు" అనే నినాదంతో ప్రజాసేవ చేసిన మహానేత ఎన్టీఆర్ అని కొనియాడారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిన నాయకుడు ఎన్టీఆర్ అని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీనియర్ నాయకులు పెరుగు భాస్కర్, తెలుగు యువత నియోజకవర్గ నాయకులు వోలుకుల అయ్యప్ప, బూత్ కన్వీనర్ గుత్తి కుమార్ బాబు, రామన్నపేట పంచాయతీ తెలుగుదేశం మాజీ అధ్యక్షులు వోలుకుల కోటయ్య, సజ్జ వెంకట సుబ్బారావు, పింజల సుబ్రహ్మణ్యం, గౌరబాత్తుని ప్రసాద్, వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు జాతి గర్వకారణం ఎన్టీఆర్ : ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య





**చీరాల, మే 28 (క్రైమ్ కౌంటర్):** స్వర్గీయ నటసార్వభౌముడు, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు డాక్టర్ నందమూరి తారకరామారావు జయంతి సందర్భంగా చీరాల పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్టీఆర్ తెలుగు జాతి ఆత్మగౌరవానికి ప్రతీక అని కొనియాడారు. తెలుగు ప్రజల అభ్యున్నతి కోసం పుట్టిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని, పార్టీ స్థాపన నాటి నుంచి ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు.

గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో రాష్ట్ర ప్రతిష్ట దెబ్బతిందని, పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోవడంతో పాటు రాజధాని అంశంపై ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలనే సంకల్పంతో ప్రజలు కూటమి ప్రభుత్వానికి భారీ మెజారిటీతో మద్దతు ఇచ్చారని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రానికి భారీ పెట్టుబడులు వస్తున్నాయని, యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని అన్నారు. గూగుల్, రాయల్ ఎన్ఫీల్డ్ వంటి ప్రముఖ సంస్థలను రాష్ట్రానికి తీసుకురావడం చంద్రబాబు దూరదృష్టికి నిదర్శనమని పేర్కొన్నారు.

ఎన్టీఆర్ మహిళా సాధికారతకు బాటలు వేసిన మహానేత అని, మహిళలకు ఆస్తి హక్కులు కల్పించడం, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేయడం వంటి సంస్కరణలను గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో నారా లోకేష్ మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ అమలు దిశగా కృషి చేస్తున్నారని తెలిపారు.

"కార్యకర్తలే అధినేత" అనే ఎన్టీఆర్ సిద్ధాంతాన్ని టిడిపి నేటికీ కొనసాగిస్తోందని, పార్టీ నాయకులు, కార్యకర్తలకు వివిధ పదవుల్లో అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు.

ఎన్టీఆర్ పేరు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని, తెలుగు జాతి ఉన్నంత వరకు ఆయన పేరు చిరస్థాయిగా నిలుస్తుందని ఎమ్మెల్యే మాలకొండయ్య పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డిజిటల్ మహానాడు ప్రపంచవ్యాప్త రికార్డు.

**మహిళలకు 33 శాతం రిజర్వేషన్– ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు.**



**క్రైమ్ కౌంటర్ : నరసరావుపేట. ప్రతినిధి(జి.ఎం.కె)–** తెలుగుదేశం పార్టీ తన వార్షికోత్సవాన్ని ఈ ఏడాది డిజిటల్ మహానాడుగా నిర్వహించి ప్రపంచవ్యాప్తంగా ఒక కొత్త రికార్డు సృష్టించింది. దాదాపు 20 లక్షల మంది సభ్యులు పాల్గొన్న ఈ భారీ కార్యక్రమం ద్వారా టీడీపీ కేవలం ఒక రాజకీయ పార్టీ కాకుండా ఆధునిక డిజిటల్ సాంకేతికతను ఉపయోగించి జన సందేశాలను అందించే శక్తివంతమైన సంస్థగా తన ముద్ర వేసిందని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. గురువారం స్థానిక నవయుగ కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 1,875 క్లస్టర్ కేంద్రాల్లో హైబ్రిడ్ విధానంలో డిజిటల్ మహానాడు నిర్వహించారు. ఇందులో దాదాపు 20 లక్షల మంది డిజిటల్‌గా ఎన్‌రోల్ చేసుకుని పాల్గొన్నారు. ఇది ఏ ఒక్క రాజకీయ పార్టీ వార్షికోత్సవం కోసం ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు నిర్వహించిన అతి పెద్ద డిజిటల్ కార్యక్రమం అని ఎమ్మెల్యే అరవింద బాబు స్పష్టం చేశారు. నరసరావుపేట నియోజకవర్గంలో మరింత ఉత్సాహవంతంగా ఈ కార్యక్రమం జరిగింది. ఇక్కడ 10 క్లస్టర్లు ఏర్పాటు చేయగా ప్రతి క్లస్టర్‌లో సగటున 30 వేల మంది పాల్గొన్నారన్నారు. అదనంగా 10 కమ్యూనిటీ హాళ్లలో వందలాది మంది డిజిటల్‌గా అనుసంధానం అయ్యారు. రొంపిచర్ల మండలంలో భారీ ద్విచక్ర వాహనాల ర్యాలీలు, వివిధ గ్రామాల్లో ఊరేగింపులు నిర్వహించి సాధారణ కార్యకర్తల నుంచి నాయకుల వరకు అందరినీ ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో భాగమయ్యారన్నారు.

క్లస్టర్ విధానంలో 20 లక్షల మందితో ఒక రాజకీయ పార్టీ వార్షికోత్సవం నిర్వహించడం ప్రపంచంలో ఇదే మొదటిసారి. గత రెండేళ్లు మేము అనేక కష్టాలను ఎదుర్కొన్నా ఆ కష్టాలు వృథా కాలేదు. ఈ డిజిటల్ మహానాడు ద్వారా టీడీపీ కుటుంబం ఒక్కటై ఎంతటి శక్తిని కలిగి ఉందో నిరూపించిందని అన్నారు. మహానాడులో ముఖ్య తీర్మానంగా మహిళలకు 33% రిజర్వేషన్ అమలు చేయాలని నిర్ణయించారు. దేశవ్యాప్తంగా ఇంకా అమలు కానప్పటికీ ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ఈ రిజర్వేషన్‌ను పూర్తిస్థాయిలో అమలు చేసి మహిళా శక్తిని రాజకీయ రంగంలోకి తీసుకురావాలని పార్టీ నిర్ణయించింది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ ఉత్సాహం ఈ సంకల్పంతోనే పని చేసి విజయం సాధించాలని ఎమ్మెల్యే పార్టీ కార్యకర్తలు, కుటుంబ సభ్యులకు పిలుపునిచ్చారు.

ఈ డిజిటల్ మహానాడు విజయవంతం చేసినందుకు రాష్ట్రవ్యాప్తంగా 1,875 క్లస్టర్ ఇన్‌చార్జీలు, నరసరావుపేట నియోజకవర్గంలోని 10 క్లస్టర్ ఇన్‌చార్జీలు, టీడీపీ కుటుంబ సభ్యులు, సీనియర్ నాయకులు, అభిమానులు, ఐటీడీపీ సిబ్బంది అందరికీ ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

గత రెండు సంవత్సరాల కాలంలో నరసరావుపేట నియోజకవర్గంలో అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలను వేగంగా ముందుకు తీసుకెళ్లామని ఇకపై కూడా అదే ఉత్సాహంతో పని చేస్తామని ఆయన వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో 10 క్లస్టర్ల ఇన్చార్జులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పినరయి విజయన్ నివాసంపై ఈడీ దాడులను ఖండిస్తూ చీరాలలో సీపీఐ(ఎం) నిరసన






**చీరాల, మే 28 (క్రైమ్ కౌంటర్):** కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ నివాసంతో పాటు ఆయన కుటుంబ సభ్యులు, సన్నిహితుల ఇండ్లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాడులను ఖండిస్తూ సీపీఐ(ఎం) చీరాల ప్రాంతీయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం చీరాల గడియారం స్తంభం సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు కె. ప్రసన్న కుమార్, జిల్లా నాయకులు టి. కృష్ణమోహన్ మాట్లాడుతూ కేరళలో బీజేపీ--కాంగ్రెస్ అపవిత్ర కలయిక బట్టబయలైందని విమర్శించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో కుమ్మక్కై మాజీ సీఎం పినరయి విజయన్ కుటుంబాన్ని రాజకీయ కక్షసాధింపులో భాగంగా టార్గెట్ చేసిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలోనే సీపీఐ(ఎం)పై ఈడీ దాడులు జరుగుతాయని కాంగ్రెస్, బీజేపీ నేతలు బహిరంగ హెచ్చరికలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. పాత కేసును మళ్లీ తెరపైకి తీసుకువచ్చి, మనీలాండరింగ్ పేరుతో నిరాధార ఆరోపణలు చేస్తూ ఈడీ ద్వారా దాడులు నిర్వహించడం పూర్తిగా రాజకీయ ప్రేరేపిత చర్యేనని ఆరోపించారు. 2017--21 మధ్య కాలంలో సీఎంఆర్ఎల్ సంస్థ నుంచి విజయన్ కుమార్తె వీణకు చెందిన ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ సంస్థకు రూ. 1.72 కోట్లు బదిలీ అయ్యాయన్న ఆరోపణలపై ఇప్పటికే వివరణలు వచ్చాయని, ఈ కేసులో పినరయి విజయన్‌కు ఎలాంటి ప్రత్యక్ష లేదా పరోక్ష సంబంధాలు లేవని న్యాయస్థానాలు స్పష్టం చేసినప్పటికీ, సీపీఐ(ఎం) శ్రేణులను భయభ్రాంతులకు గురిచేయడమే లక్ష్యంగా ఈ దాడులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. కేరళ ప్రజలు ఈ దాడులను తీవ్రంగా ఖండిస్తూ పెద్ద ఎత్తున నిరసనలకు దిగారని, వేలాదిమంది స్వచ్ఛందంగా విజయన్ నివాసానికి చేరుకొని "ఈడీ గో బ్యాక్" అంటూ నినాదాలు చేశారని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే విధంగా కేంద్ర దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించడం దేశానికి ప్రమాదకరమని విమర్శించారు.

చీరాల ప్రాంతీయ కార్యదర్శి ఎన్. బాబురావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు ఎం. వసంతరావు, ఎల్. జయరాజ్, జి. ప్రతాప్ కుమార్, పి. మనోజ్, టి. సుభాషిని, ఎన్. లక్ష్మి, ఐ.వి. ప్రసాద్, డి. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# కమీషనర్ ఆదేశాలతో పారిశుధ్య పనులు.

**చెరువుగా మారిన రోడ్డు.. రంగంలోకి దిగిన పురపాలక సిబ్బంది.**

**20 రోజుల మురుగు సమస్యకు చెక్.. ప్రత్యేక పారిశుధ్య చర్యలు.**

**క్రైమ్ కౌంటర్ : నరసరావుపేట (ప్రతినిధి : జి.ఎం.కె.)–** నరసరావుపేట పట్టణంలోని రామిరెడ్డి పేట ప్రాంతంలో గత 20 రోజులుగా కొనసాగుతున్న మురుగు నీటి సమస్యపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కాలువలు పూర్తిగా మూసుకుపోవడంతో మురుగు నీరు రోడ్లపైకి చేరి చెరువును తలపించే పరిస్థితి ఏర్పడింది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ ఆవేదన వ్యక్తం చేశారు. మురుగు నీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వ్యాపించి ప్రజలు ఇళ్లలో ఉండలేని పరిస్థితి నెలకొంది. చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా దోమల బెడద అధికమై డెంగ్యూ, వైరల్ ఫీవర్స్ వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.

దీంతో నరసరావుపేట మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తన ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు, పారిశుధ్య సిబ్బంది బుధవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి కాలువల శుభ్రపరిచే పనులు చేపట్టారు. మురుగు కాలువల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, మట్టి, చెత్తను కార్మికులు తొలగించారు. కొన్ని ప్రాంతాల్లో కాలువలపై ఉన్న సిమెంట్ స్లాబ్‌లను తొలగించి పూర్తిగా మూసుకుపోయిన డ్రైనేజీ మార్గాలను శుభ్రం చేశారు. భారీగా పేరుకుపోయిన మురుగును తొలగించేందుకు జేసీబీ సహాయంతో ప్రత్యేక చర్యలు చేపట్టారు. రోడ్లపై



నిలిచిపోయిన మురుగు నీటిని బయటకు పంపించి ప్రజలకు ఊరట కలిగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ సిబ్బంది మాట్లాడుతూ డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా పరిశీలించి ఎక్కడైనా అడ్డంకులు ఉంటే వెంటనే తొలగిస్తామని భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యకు వెంటనే స్పందించి చర్యలు తీసుకున్న మున్సిపల్ కమీషనర్ రమ్య కీర్తనకు వార్డు ప్రజలు ధన్యవాదములు తెలిపారు.

Published by katikala Vara Prasad. Owned by katikala Vara Prasad. Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006.published at D.no465 Le out no2 .Dodleru Road.Ysr Jagananna colony.Krosuru. Guntur AP. 522410. Editor. Katikala Vara Prasad.RNI APTEL/25/A2478. Ph:9849707349 . email:kvp6858@gmail.com.

జర్నలిస్టులు కావలెను

క్రైం కౌంటర్ తెలుగు దినపత్రిక గత 15 సంవత్సరాలుగా పత్రికా రంగంలో ప్రత్యేక గుర్తింపు కలిగిన క్రైం కౌంటర్ తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు ఆసక్తి, అనుభవం కలిగిన జర్నలిస్టులు కావలెను.

ప్రకాశం



APTEL/25/A2843

# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 177 శుక్రవారం 29- 05 - 2026 పేజిలు : 4 వెల. 2



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


## అన్న ఎన్టీఆర్ జయంతి ఘన నివాళు లర్పించిన , యువ నాయకుడు షేక్ ఇర్ఫాన్



క్రైమ్ కౌంటర్ న్యూస్.....మార్కాపురం జిల్లా....ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు , జయంతిని పురస్కరించుకుని మార్కాపురం జిల్లా గిద్దలూరు నియోజకవర్గ మైనార్టీ యువ నాయకుడు షేక్ ఇర్ఫాన్ ఆయనకు ఘన నివాళులర్పించారు....

## బుదాల వారి వివాహ మహోత్సవంలో పాల్గొన్న మాజి ఎమ్మెల్యేలు అన్నా,ఉడుముల



క్రైమ్ కౌంటర్ న్యూస్ ....మార్కాపురం జిల్లా....కొనకనమిట్ల మండలం వద్దిమడుగు గ్రామంలో బుదాల జీవయ్య,రూతుమేరీ గార్ల కుమారుడు వివాహా మహోత్సవానికి హాజరుఅయి నూతన వధూవరులు అయిన నవీన్ కుమార్,నిస్సి గార్లను ఆశీర్వదించిన గిద్దలూరు మాజి శాసనసభ్యులు,మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇంచార్జి అన్నా రాంబాబు , మరియు కంభం మాజి శాసనసభ్యులు ఉడుముల శ్రీనివాసరెడ్డి , మరియు తదితరులు పాల్గొన్నారు..

## మోహన్ రెడ్డి ,ని పరామర్శించిన మాజి ఎమ్మెల్యే అన్నా





క్రైమ్ కౌంటర్ న్యూస్... మార్కాపురం జిల్లా....మార్కాపురం పట్టణంలోని శ్రీ ఆరోగ్య హాస్పిటల్ నందు మార్కాపురం పట్టణ ఆంధ్రజ్యోతి విలేకరి డి.మోహన్ రెడ్డి , ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై హాస్పిటల్ నందు చికిత్స పొందుతుండగా విషయం తెలుసుకున్న గిద్దలూరు మాజి శాసనసభ్యులు,మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇంచార్జి అన్నా రాంబాబు మోహన్ రెడ్డి ,ని పరామర్శించడం జరిగింది..

# రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చొరవ: రాచర్ల క్రాస్ రోడ్ల వద్ద సైడ్ మిర్రర్స్ ఏర్పాటు!

క్రైమ్ కౌంటర్ న్యూస్...మార్కాపురం జిల్లా.... రాచర్ల మండల పరిధిలోని ప్రయాణికుల భద్రతే ధ్యేయంగా రాచర్ల పోలీస్ శాఖ మరియునెమలిగుండ్ల రంగస్వామి గుడి చైర్మన్ సిద్ధం పెద్ద నరసింహులు సంయుక్తంగా ఒక మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

రాచర్ల క్రాస్ రోడ్ల వద్ద ఉన్న టర్నింగ్ (మలుపు)వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతూ,ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని అధికారులు గుర్తించారు.

ఈప్రమాదాల నివారణకు తక్షణ చర్యల్లో భాగంగా, నెమలిగుండ్ల రంగస్వామి గుడి చైర్మన్ సిద్ధం పెద్ద నరసింహులు ప్రత్యేకంగా సైడ్ మిర్రర్స్ (రౌండ్ కాన్వెక్స్ మిర్రర్స్) ను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చారు.బి

ఎస్ఐ కి సైడ్ మిర్రర్స్ అందజేత.

ఈమలుపు వద్ద వాహనదారులకు ఇరువైపులా వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేసేందుకు, నెమలిగుండ్ల రంగస్వామి గుడి చైర్మన్ సిద్ధం పెద్ద నరసింహులు , ఈ సైడ్ మిర్రర్స్‌ను రాచర్ల ఎస్సై పి. కోటేశ్వరరావు కి అధికారికంగా అందజేశారు.బి

కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు.

పి. కోటేశ్వరరావు (రాచర్ల సబ్ ఇన్‌స్పెక్టర్ – ౫×)

నెమలిగుండ్ల రంగస్వామి గుడి చైర్మన్ సిద్ధం పెద్ద నరసింహులు.

కొప్పుల వెంకటేశ్వర్లు (అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ –౫౫×)మరియు రాచర్ల పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఈసందర్భంగా ఎస్ఐ కోటేశ్వరరావు మాట్లాడుతూ... ప్రమాదాల నివారణకు



నెమలిగుండ్ల రంగస్వామి గుడి చైర్మన్ సిద్ధం పెద్ద నరసింహులు గారు స్పందించి సైడ్ మిర్రర్స్ అందజేయడం అభినందనీయమన్నారు.బి

ఈమిర్రర్స్ వల్ల మలుపుల్లో ఎదురుగా వచ్చే వాహనాలు ముందుగానే కనిపిస్తాయని, దీనివల్ల ప్రమాదాలు చాలా వరకు తగ్గుతాయని పేర్కొన్నారు.

సకాలంలో స్పందించి ప్రయాణికుల ప్రాణాల రక్షణకు తోడ్పడిన నెమలిగుండ్ల రంగస్వామి గుడి చైర్మన్ సిద్ధం పెద్ద నరసింహులు ,ని, పోలీస్ సిబ్బందిని స్థానిక ప్రజలు మరియు వాహనదారులు ఎంతగానో అభినందిస్తున్నారు.....

# ఎమ్మెల్యే నాగేశ్వరరావుకు అభినందనలు చంద్రన్న



క్రైం కౌంటర్ ప్రతినిధి కంచర్ల మల్లికార్జున రావు నియోజకవర్గ ఇన్చార్జి కందుకూరు,రెండు రోజుల మహానాడు దిగ్విజయంగా ముగిసింది. పసుపు పండుగ నిర్వహణలో.... శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు సారధ్యంలో కందుకూరు నియోజకవర్గం, రికార్డ్ సృష్టించింది. ప్రతిఫలంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు, తెలుగుదేశం పార్టీనుంచి ప్రత్యేక ప్రశంసలు అందుకున్నారు. మహానాడును అద్భుతంగా నిర్వహించావంటూ నాగేశ్వరరావుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అభినందనలు తెలియజేయడం విశేషం. దీంతో నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు.

మొత్తం 12 క్లస్టర్ల పరిధిలో కందుకూరు పట్టణంలో 4, ఉలవపాడులో 3, గుడ్లూరులో 2, లింగసముద్రంలో ఒకచోట హైబ్రిడ్ విధానంలో మహానాడు వేడుకను రెండవ రోజు నిర్వహించారు. తొలిరోజు కంటే రెట్టింపు ఉత్సాహంతో, పార్టీ నేతలు, కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు కార్యక్రమాల్లో పాల్గొనగా పసుపు సైన్యం సందడితో కళ్యాణ మండపాలుకిక్కిరిసిపోయాయి. ప్రతి గ్రామం నుంచి వందలాదిమంది స్వచ్ఛందంగా తరలివచ్చి పార్టీపై అభిమానాన్ని చాటుకున్నారు. అన్నకు ఘనంగా నివాళులర్పించారు. ఆయన 103వ జయంతి సందర్భంగా మదిలో స్మరించుకున్నారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, అన్ని క్లస్టర్ల వద్ద జరిగిన వేడుకల్లో పాల్గొని, పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచారు. ముందుగా పట్టణంలోని స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పార్టీ నేతలతో కలిసి ఆయన పూలమాలలనువేసి నివాళులర్పించారు. తరువాత ప్రత్యేక వేదికల వద్ద అన్నగారికి నివాళులు అర్పించడంతోపాటు కేక్ కటింగ్ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూవర్చువల్ విధానంలో నిర్వహించుకున్న మహానాడును విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలను తెలియజేశారు. స్వర్గీయ ఎన్టీఆర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, యువ నేత నారా లోకేష్ గురించి పదేపదే ప్రస్తావిస్తూ రాష్ట్ర అభివృద్ధికి వారు చేసిన కృషిని వివరించారు కోట్ల మంది సుశిక్షితులైన సైన్యాన్ని తయారు చేయడమే కాకుండా, వారికి అన్ని విధాల అండగా నిలుస్తున్న లోకేష్ నాయకత్వానికి ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాలని ఎమ్మెల్యే కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు.

కందుకూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ రోజురోజుకు బలంగా తయారవుతోందని స్పష్టం చేశారు. 20 ఏళ్ల తర్వాత కందుకూరు చరిత్రను తిరగరాస్తూ సృష్టించిన ప్రభంజనంలో.... ప్రతి కార్యకర్త చెమట చుక్క ఉందని ఆయన గుర్తు చేశారు. వారందరి కష్టాన్ని, త్యాగాన్ని తాను జీవితాంతం మరిచిపోనని అన్నారు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనప్పటికీ, కార్యకర్త సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తానని అన్నారు. నాయకుల మధ్య ఉన్న చిన్న చిన్న విభేదాలు పక్కనపెట్టి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ సత్తా చాటాలనీ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

ఉలవపాడులో జరిగిన మహానాడులో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పసుపు పండుగ మహానాడును చూస్తుంటే కడుపు నిండిపోతోందని, ఇంతమంది కార్యకర్తల ఆశీస్సులు ఉన్న తెలుగుదేశం పార్టీకి ఇక తిరుగేలేదని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పట్టుదల, ముందుచూపుతో రాష్ట్రం అన్ని రంగాలలో దూసుకుపోతోందని అన్నారు.

మహానాడు నిర్వహణలో కందుకూరు రికార్డు

మహానాడుకు సంబంధించి కార్యకర్తల హాజరు నమోదులో కందుకూరు నియోజకవర్గం రికార్డ్ సృష్టించింది. మొత్తం 175 నియోజకవర్గాల్లో, నాలుగవ స్థానంలో నిలిచింది. కందుకూరు పట్టణంలోని 6 వ క్లస్టర్ రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు పార్టీ పెద్దలు ప్రకటించారు. మహానాడు తొలి రోజున ఈ క్లస్టర్ నుంచి 2555 మంది, రెండవ రోజున 3763 మంది కార్యకర్తలు తమ హాజరు నమోదు చేసుకున్నారు. మొత్తంగా 6318 మంది తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవడంతో రాష్ట్రస్థాయిలో రికార్డు సృష్టించినట్లు అయ్యింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ను పార్టీ అధిష్టానం ప్రత్యేకంగా ప్రశంసించింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గ

ఎమ్మెల్యే ను అభినందిస్తూ, మహానాడు ను అత్యద్భుతంగా నిర్వహించారని పొగడ్తలతో ముంచెత్తారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు నియోజకవర్గ నేతలు కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలనుతెలియజేశారు. అనంతరం ఆరవ క్లస్టర్ ఇంచార్జి చిలకపాటి మధును ఎమ్మెల్యే నాగేశ్వరరావు, పలువురు నేతలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో నియోజకవర్గ పరిశీలకురాలు మట్టం శ్రావణి రెడ్డి, పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, మండల పార్టీల అధ్యక్షులు పూరిమిట్ల గురునాథం, జనిగర్ల నాగరాజు, రాచగర్ల సుబ్బారావు, మాదాల లక్ష్మీనరసింహం, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, క్లస్టర్ ఇన్చార్జులు కాకుమాని హర్ష, ఘట్టమనేని లక్ష్మీనరసింహం, వంకాయలపాటి మాల్యాద్రి, వడ్డెళ్ళ రవిచంద్ర, చిలకపాటి మధు, గొంది నరసింగరావు, బొద్దులూరి కొండలరావు, చిత్తారు మల్లికార్జున, ఉమ్మనేని సుబ్బారావు, పోలుబోయిన శ్రీనివాసులు, బెల్లం కృష్ణమోహన్, వాసు, నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు ఉన్నం వీరాస్వామి, పార్టీ సీనియర్ నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు, చల్లా శ్రీనివాసరావు, కంద్రా మాల్యాద్రి, ఉప్పుటూరి శ్రీనివాసరావు, ఏపీఈడబ్ల్యూఐడి కార్పొరేషన్ డైరెక్టర్ పోకూరి రాంబాబు, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్, నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు షేక్ మున్నా, నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు కల్లూరి శైలజ, నియోజకవర్గ తెలుగు ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షురాలు పువ్వాడి మౌనిక, గ్రామ మరియు వార్డు అధ్యక్షులు, యూనిట్ ఇన్చార్జులు, అనుబంధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



# జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణాన్ని ఆధునికీకరించే దిశగా ముందడుగు

## ఖాళీ స్థలాన్ని పరిశీలించిన ఒంగోలు పార్లమెంటు సభ్యులు శ్రీ మాగుంట శ్రీనివాసరెడ్డి మరియు ప్రకాశం జిల్లా ఎస్పీ శ్రీ వి. హర్షవర్ధన్ రాజు, ఐపీఎస్.,



క్రైమ్ కౌంటర్ న్యూస్..... ప్రకాశం జిల్లా....పోలీస్ సిబ్బంది సంక్షేమం కోసం ఆధునిక వసతుల ఏర్పాటుకు ప్రణాళికలు,
పోలీసులు ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్‌లో ఆటలాడుతున్న చిన్నారులను చూసి ఆనందం వ్యక్తం చేసిన ఒంగోలు పార్లమెంటు సభ్యులు శ్రీ మాగుంట శ్రీనివాసరెడ్డి ఎంపీ ,ని చూసిన వెంటనే హాయ్ అంకుల్" అంటూ కేరింతలు కొట్టిన చిన్నారులు, పిల్లల ఆప్యాయ పలకరింపుతో ఆనందం వ్యక్తం చేసిన ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి. ప్రకాశం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో పాత పోలీస్ క్వార్టర్స్‌ను తొలగించి చదును చేసిన ఖాళీ స్థలాన్ని ఒంగోలు పార్లమెంటు సభ్యులు శ్రీ మాగుంట శ్రీనివాసరెడ్డి , మరియు జిల్లా ఎస్పీ శ్రీ వి. హర్షవర్ధన్ రాజు, ఐపీఎస్., , గురువారం పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పిల్లలు సమ్మర్ క్యాంపును పరిశీలించారు.
ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయ పరిసర ప్రాంత అభివృద్ధికి చేపట్టనున్న ప్రణాళికల గురించి జిల్లా ఎస్పీ , ఎంపీ ,కి వివరించారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఆ స్థలాన్ని పోలీస్ సిబ్బంది సంక్షేమం కొరకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేయాలని ప్రతిపాదనలు రూపొందించినట్లు తెలిపారు.
ఆ ప్రదేశంలో టెన్నిస్ కోర్ట్, వాకింగ్ ట్రాక్, షటిల్ కోర్ట్, క్రికెట్ ఆడుకునే మైదానం, విశాలమైన గ్రౌండ్‌తో పాటు అందమైన ఉద్యానవనం ఏర్పాటు చేయుటకు అనుకూలంగా ఉన్నాయన్నారు. పరిసర ప్రాంతాలను పరిశీలించిన ఎంపీ శ్రీ మాగుంట శ్రీనివాసరెడ్డి , ఈ అభివృద్ధి కార్యక్రమాలు పోలీస్ సిబ్బంది ఆరోగ్యం, మానసిక ఉల్లాసం మరియు శారీరక దృఢత్వానికి దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రాంగణంలో నిర్వహిస్తున్న పిల్లల సమ్మర్ క్యాంప్‌ను ఒంగోలు పార్లమెంటు సభ్యులు శ్రీ మాగుంట శ్రీనివాసరెడ్డి , పరిశీలించారు. చిన్నారులకు హాయ్ చెబుతూ ఉత్సాహపరిచారు. పిల్లలు వివిధ క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాల్లో పాల్గొంటున్న తీరును అభినందించారు. విద్యతో పాటు క్రీడలు, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు కూడా పిల్లల భవిష్యత్తుకు ఎంతో అవసరమన్నారు.
పోలీస్ సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఆధునిక వసతులు కల్పించేందుకు అవసరమైన తన వంతు సహకారం అందిస్తామని, పోలీస్ కార్యాలయ ప్రాంగణాన్ని మరింత సుందరంగా, ఉపయోగకరంగా తీర్చిదిద్దేందుకు చేపట్టనున్న కార్యక్రమాలకు పూర్తి సహకారం అందజేస్తామన్నారు.
జిల్లా ఎస్పీ , మాట్లాడుతూ పోలీస్ సిబ్బందికి విధి నిర్వహణతో పాటు శారీరక వ్యాయామం, క్రీడలు మరియు ప్రశాంత వాతావరణం ఎంతో అవసరమని, అందుకు అనుగుణంగా ఈ ప్రాంగణాన్ని అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.
ఈ కార్యక్రమంలో ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, ఆర్ఐ సీతారామరెడ్డి, ఎఆర్ఎస్ఐలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.....

# మొదటి రోజు అందిన విరాళాలు రూ.11.70 కోట్లు

క్రైం కౌంటర్ న్యూస్ మే 28: టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోకేశ్ బాధ్యతలు స్వీకరించాక.., తొలి మహానాడులోనే సంచలన ప్రతిపాదనతో ముందుకు రావడం అందరి దృష్టినీ ఆకర్షించింది. పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదంతో సంబంధం లేకుండా వచ్చే ఎన్నికల్లో పార్టీపరంగా మహిళలకు 33 శాతం కోటా ఇవ్వాలన్న ఆయన ప్రతిపాదన.. స్త్రీశక్తి థీమ్‌తో మహానాడు నిర్వహించాలన్న పార్టీ నిర్ణయానికి సార్థకత చేకూర్చేలా ఉందని టీడీపీ మహిళా నేతలు తబ్బిబ్బవుతున్నారు. లోకేశ్ తన ప్రతిపాదన గురించి బుధవారం ఉదయమే ఎక్స్‌లో.. 'ఈ రోజు మధ్యాహ్నం 12 గంటలకు పెద్ద ప్రకటన కోసం ఎదురుచూడండి' అంటూ ఉత్కంఠ రేపారు. చివరకు అందరినీ ఆకర్షించే పెద్ద ప్రకటన చేసి.. ఉత్కంఠకు న్యాయం చేశారు. జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు తన ప్రసంగంలో క్యాడర్‌కు దిశానిర్దేశం చేస్తూనే.. వైసీపీని పంచ్‌లతో ఆడుకున్నారు. కార్యకర్తల్లో జోష్ నింపారు. తన 43 నిమిషాల ప్రసంగంలో పార్టీ 44 ఏళ్ల ప్రస్థానాన్ని.. ఐడియాలజీని గుర్తు చేశారు. 23 నెలల్లో ప్రభుత్వ విజయాలను.. భవిష్యత్ ఆలోచనలను ఆవిష్కరించారు. గొడ్డలి పార్టీ విధానాలను ప్రశ్నిస్తూ.. ప్రాసతో.. పంచ్‌లతో ఆలోచింపచేసేలా ఆయన ప్రసంగం సాగింది. టీడీపీ కార్యకర్తలు ఎంత క్రమశిక్షణగా మెలగాలో దిశానిర్దేశం చేశారు. కార్యకర్తలు రికార్డు సంఖ్యలో హాజరయ్యారు. 1875 క్లస్టర్లలో 7.28 లక్షల మంది పాల్గొన్నారు. నూజివీడు నియోజకవర్గంలోని 10 క్లస్టర్లలో మహానాడు కార్యక్రమం నిర్వహించగా 9991 మందికిగాను 9991 మంది హాజరయ్యారు. స్త్రీశక్తి, కార్యకర్తే అధినేత, యువగళం, పేదల సేవలో అనే అంశాలపై మహానాడు మొదటి రోజు 4 తీర్మానాలు ఆమోదించగా.. మొత్తం 48 మంది మాట్లాడారు. విరాళాలు వెల్లువెత్తాయి. మొత్తం రూ.11.70 కోట్లు వచ్చాయి. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి దంపతులు కలిసి రూ.5 కోట్లు విరాళంగా ఇచ్చారు. ఎంపీ సానా సతీశ్ రూ.1.5 కోట్లు, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, భాష్యం ప్రవీణ్, మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి రూ.కోటి చొప్పున ఇచ్చారు. ఇంకోవైపు.. హైబ్రిడ్ విధానంలో నిర్వహించుకుంటున్న మహానాడుకు మొదటిరోజు 7 లక్షల మందికిపైగా వర్చువల్‌గా హాజరు కావడం ఓ చరిత్ర అని టీడీపీ అధినేత చంద్రబాబు నేతలతో టెలికాన్ఫరెన్సులో అన్నారు.

# ఎన్టీఆర్ చేసిన సేవలు చిరస్మరణీయం, 34వ డివిజన్ లో ఘనంగా ఎన్టీఆర్ 103వ జయంతి

క్రైమ్ కౌంటర్ న్యూస్...విజయవాడ: పశ్చిమ నియోజకవర్గం 34 డివిజన్ కేదారేశ్వరపేటలో నందమూరి తారక రామారావు 103 వ జయంతి కార్యక్రమము ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం పశ్చిమ నియోజకవర్గం మాజీ మైనార్టీ ప్రెసిడెంట్ షేక్ హబీబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వడ్డెర చైర్మన్ ఈశ్వర్, మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఫతావుల్లా హాజరై చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి అలాగే స్థానికులకు పండ్లు పంపిన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వడ్డెర చైర్మన్ ఈశ్వర్ మాట్లాడుతూ "తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ నందమూరి తారకరామారావు జయంతి సందర్భంగా ఆ మహానుభావుడిని స్మరించుకుంటున్నామని, బడుగు, బలహీన వర్గాలు, బీసీలు, ఎస్సీలు, మైనార్టీలు, మహిళల అభ్యున్నతికి ఎన్టీఆర్ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. దేశంలో మొదటిసారిగా పింఛన్ పథకం, పక్కా ఇళ్లు, రూ.2 కిలో బియ్యం వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారు. మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఫతావుల్లా మాట్లాడుతూ బీసీలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించి, యువతకు అవకాశాలు అందించిన మహానేత ఎన్టీఆర్ అన్నారు. ఆయన ఆశయాలనే ముందుకు తీసుకెళ్తూ నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ పేదలు, మహిళలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోంది. ప్రస్తుతం రూ.4000 పింఛన్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోంది. ఎన్టీఆర్ ఆశయాలకు పునరంకితమవుతూ ప్రజాసేవలో ఎల్లప్పుడూ ముందుంటాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ కొట్టేటి హనుమంతరావు, పరుసు పోగు రాజేష్, డివిజన్ అధ్యక్షుడు కొండ తనువి నాయుడు, 35వ డివిజన్ అధ్యక్షులు భూదాలనందకుమారి, వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ ఖాదర్ హుస్సేన్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు...







# తీర్మానం ప్రవేశపెట్టిన కాలవ శ్రీనివాసులు

క్రైం కౌంటర్ న్యూస్,మే 28: ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, వివిధ వర్గాలకు అందిస్తున్న సంక్షేమంపై 'పేదల సేవలో' తీర్మానాన్ని ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు బుధవారం మహానాడులో ప్రవేశపెట్టారు. పింఛన్ల పంపిణీలో దేశంలోనే రాష్ట్ర ప్రభుత్వం ఆదర్శంగా నిలుస్తున్నదని చెప్పారు. ఇదే అంశంపై పలువురు నాయకులు మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలపై ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ.. దేశమే నివ్వెరపోయేలా ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలను చూసి గొడ్డలి పార్టీ ఓర్వలేక దుష్ప్రచారం చేస్తోందన్నారు. రాష్ట్రంలో ఏ పేదవాడి ఇంటికి వెళ్లినా సూపర్ సిక్స్ పవర్ ఏమిటో తెలుస్తుందన్నారు. దేశంలో మరే రాష్ట్రం ఇవ్వని స్థాయిలో పింఛన్లు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, వంటి పథకాల అమలుతో ప్రభుత్వం ప్రజల మనసులను గెలుచుకుంటోందన్నారు. బీసీ సంక్షేమంపై మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. బీసీల సంక్షేమం కోసమే టీడీపీ పుట్టిందన్నారు. బీసీలకు రాజ్యాధికారం దక్కిందన్నా.. వారికోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నా.. అది టీడీపీ ఘనత అన్నారు. యువగళంలో ఇచ్చిన మాట ప్రకారం టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీ రక్షణ చట్టం తీసుకొచ్చి, మాట నిలబెట్టుకున్న నాయకుడు లోకేశ్ అని తెలిపారు. దళితుల సంక్షేమంపై ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు మాట్లాడుతూ సామాజిక న్యాయానికి కట్టుబడి పనిచేస్తున్న ఏకైక పార్టీ టీడీపీ అన్నారు. దళితుల్లో 59 కులాలకు అంతర్గత సామాజిక న్యాయం జరగాలనే ఆలోచనతో వర్గీకరణకు టీడీపీ మద్దతు ఇచ్చిందన్నారు. దళితుల స్థితిగతులను మెరుగుపర్చేందుకు జస్టిస్ పున్నయ్య కమిటీ వేసి ఆ కమిటీ సూచనలు అమలు చేసిన ఘనత చంద్రబాబుకు దక్కుతుందన్నారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ దళితుల ఆత్మగౌరవం ఢిల్లీలో నిలిపేలా బాలయోగిని స్పీకర్ చేసిన ఘనత చంద్రబాబుదన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్ మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వంలో బ్రాహ్మణులపై ఎన్నడూ లేనంతగా దాడులు జరిగాయని వివరించారు. చంద్రబాబు అభివృద్ధి వికేంద్రీకరణ చేస్తే జగన్ అరాచకాన్ని వికేంద్రీకరించారని ఎద్దేవా చేశారు. మాటల్లో కాకుండా చేతల్లో మహిళా సాధికారత చూపించిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. 'స్త్రీ శక్తి' అంశంపై ఆమె తీర్మానం పెడుతూ సభలో ప్రసంగించారు. 'మహిళ బలపడితే కుటుంబం బలపడుతుందని, తద్వారా సమాజం బలపడుతుందని బలంగా నమ్మే పార్టీ తెలుగుదేశం. అన్న ఎన్టీఆర్ మహిళలకు ఆస్తిలో వాటా కల్పిస్తే... నేడు చంద్రబాబు డ్వాక్రా సంఘాల ద్వారా ఆర్థికంగా బలోపేతం చేశారు. మహిళా విశ్వవిద్యాలయం, మహిళలకు ఆస్తిలో వాటా, వితంతువులకు పింఛన్లు, స్థానిక సంస్థలు, ఉద్యోగాల్లో మహిళలకు రిజర్వేషన్లు తీసుకొచ్చిన పార్టీ టీడీపీ. నాడు కావలి ప్రతిభా భారతిని దేశంలోనే తొలి దళిత మహిళా అసెంబ్లీ స్పీకర్‌గా చేసిన ఘనత తెలుగుదేశానికి చెందుతుంది.

# ఉత్తర కోస్తాలో కొనసాగిన వడగాడ్పులు



క్రైం కౌంటర్ న్యూస్,మే 28: ఉపరితల ద్రోణి, ఆవర్తనం ప్రభావంతో మంగళవారం రాత్రి కోస్తా, రాయలసీమల్లో అనేకచోట్ల వర్షాలు కురవడంతో బుధవారం ఎండ తీవ్రత కాస్త తగ్గింది. దక్షిణ కోస్తాలో వడగాడ్పుల నుంచి కొంతఉపశమనం లభించింది. ఉత్తర కోస్తాలో మాత్రం అక్కడక్కడ వడగాడ్పులు, ఎండ తీవ్రత కొనసాగాయి. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా నలుగురు వడదెబ్బతో మరణించారు. అనంతపురం జిల్లాలో మంగళవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. రూ.2 కోట్ల విలువైన అరటి, బొప్పాయి, మామిడి, కర్బూజ తదితర ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. జిల్లావ్యాప్తంగా 80.50 హెక్టార్లల్లో రూ.2కోట్ల విలువైన ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఏలూరు జిల్లాలో ఈదురుగాలులు, పిడుగులతో భారీవర్షం కురిసింది. కాగా, బిహార్ నుంచి ఉత్తరాంధ్ర వరకు ఉపరితల ద్రోణి, ఉత్తర తమిళనాడు పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడ్డాయి. ఆ ప్రభావంతో బుధవారం రాష్ట్రంలో భిన్నవాతావరణం నెలకొంది. కొన్ని ప్రాంతాల్లో ఎండ తీవ్రత తగ్గగా, మరికొన్ని చోట్ల ఆకాశం మేఘావృతమై, వేడిగాలి, ఉక్కపోతతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. మన్యం జిల్లా సాలూరులో అత్యధికంగా 41.8, ఏలూరు జిల్లా కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం జిల్లా కూనవరంలలో 41.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏలూరు జిల్లా దెందులూరు మండలం సోమవరప్పాడు గ్రామ శివారు వీరభద్రపురంలో వృద్ధ దంపతులు ముక్కెల్లి నాగరాజు(65), పుష్ప(61) వడదెబ్బతో మృతి చెందారు. శ్రీకాకుళం జిల్లాలో మరో ఇద్దరు వడదెబ్బతో చనిపోయారు. గురువారం కోస్తాలో పలుచోట్ల తీవ్ర వడగాడ్పులు, ఎక్కువచోట్ల గాడ్పులు వీస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అక్కడక్కడ ఈదురుగాలులు, పిడుగులతో వర్షాలు కురుస్తాయని పేర్కొంది. శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, పోలవరం, కాకినాడ, కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో 45-46, అల్లూరి, విశాఖ, అనకాపల్లి, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో 43-44, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో 40-42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. బాపట్ల, మార్కాపురం, ప్రకాశం, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది.

# మేం పనిచేసేది భవిష్యత్ తరాల కోసం.. ఎన్నికల కోసం కాదు: చంద్రబాబు

### గొడ్డలి పార్టీకి గోల్ లేదు.. అంతా అడ్డగోలే
### వేట కొడవళ్ల నుంచి గొడ్డలికి మారడమే వారి విధానం



**క్రైం కౌంటర్ న్యూస్ మే 28:** తెలుగుదేశం పార్టీ ఎన్నికల కోసం పనిచేయదు.. భవిష్యత్ తరాల కోసం, వారికి బంగరు భవిత అందించడానికి పనిచేస్తుందని టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. 'ప్రస్తుతం యువతకు కావలసింది ఉద్యోగా లు.. ఉపాధి అవకాశాలే గానీ.. గొడ్డలి పోట్లు కాదు. పేదలకు కావలసింది సంక్షేమం.. గొడ్డలి వేట్లు కాదు. రక్తాభిషేకాలు చేసేవారు స్వర్ణాంధ్ర చరిత్రను లిఖించలేరు.. అందుకే గొడ్డలి పార్టీ నెవర్ అగైన్' అని ప్రజల కు పిలుపిచ్చారు. వేట కొడవళ్ల నుంచి గొడ్డలి పార్టీగా మారడం వారి విధానమైతే.. ఐటీ నుంచి క్వాంటమ్ దిశగా ఎదగడం మన విధానమని.. రెండూ ఒకటి కాదు(బోత్ ఆర్ నాట్ సేమ్) అని స్పష్టం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవా రం జరిగిన మహానాడులో చంద్రబాబు ప్రసంగించా రు. టీడీపీ తొలి నుంచీ మహిళల సాధికారత కోసం, యువత భవిత కోసమే పనిచేస్తూ వస్తోందన్నారు. ఏ పాలసీ అయినా యువత కోసమే చేస్తున్నామని తెలిపారు. 'ఉమ్మడి రాష్ట్రంలో ఐటీ పాలసీతో యువతకు ఉద్యోగాలు వచ్చాయి. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేశ్ యువగళం పాదయాత్రలో యువతకు ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీని నెరవేర్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. జెన్ జీ, జెన్ ఆల్ఫా, టీనేజర్ల ఆలోచనలకు అనుగుణంగా విధానాలు రూ పొందిస్తాం. ఇది నవీన ఆలోచనల సమయం. యువతకు ఉద్యోగాలు. ఉ పాధి అవకాశాల కల్పనలో వారి కంటే ముందే ఆలోచన చేస్తున్నాం. ఏ రంగమైనా.. ఏపీయే చిరునామా' అని తెలిపారు. అగ్రెసివ్‌గా.. ప్రోగ్రెసివ్‌గా ముందుకెళ్తున్నామన్నారు. గొడ్డలి పార్టీకి గోల్ లేదని.. అంతా అడ్డగోలుతనమేనని ధ్వజమెత్తా రు. గత పాలకులు ఐదేళ్లలో రాష్ట్రాన్ని ధ్వంసం చేస్తే.. కూటమి వచ్చిన రెండేళ్లలోనే రాష్ట్రాన్ని గాడిలో పెట్టామన్నారు. చంద్రబాబు ఇంకా ఏం చెప్పారంటే..వర్చువల్ మహానాడు కారణంగా వాహనాల హో రు తగ్గిందేమో గానీ.. కార్యకర్తల్లో జోరు తగ్గలేదు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని క్లస్టర్లను అనుసంధానించి మహానాడును నిర్వహించుకుంటున్నాం. పశ్చిమాసియాలో యుద్ధం వల్ల హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహించుకుంటున్నాం. మీటింగ్ మోడల్ మారిందే తప్ప.. మహా నాడు విధానం మారలేదు. కూడు, గూడు, గుడ్డ నినాదంతో ఆవిర్భవించిన టీడీపీ.. విజన్ పాలిటిక్స్‌కు రూపం ఇచ్చింది. జాతీయ జెండా దేశానికి గౌరవం.. పసుపు జెండా తెలుగువారి గౌరవం.. ఆత్మవిశ్వాసం. నాటికీ నేటికీ పార్టీపై ప్రజాదరణ చెక్కు చెదరలేదు. 45 ఏళ్లుగా ప్రజాసమస్యల కోసం పోరాటం చేస్తూనే ఉంది. నరహంతకులు పీకలు కోస్తున్నా, టీడీపీ కార్యకర్తలు పార్టీ జెండాను వీడలేదు. తనను నరుకుతున్నా చంద్రయ్య జై చంద్రబాబు, జై తెలుగుదేశం అంటూ నినదించి అమరుడయ్యారు. నన్ను కూడా అక్రమంగా జైల్లో పెట్టారు. లోకేశ్ యువగళాన్ని అడ్డుకున్నారు. ఎందరో నేతలను అరెస్టు చేశారు. బాధితులనే నిందితులుగా చేసినా ఏ టీడీపీ నాయకుడూ, కార్యకర్తా వె నుకడుగు వేయలేదు. కొడిగడుతున్న ప్రజాస్వామ్యా న్ని బతికించేందుకు 2024లో బీజేపీ, జనసేనతో కలిసి కూటమిగా ఏర్పడ్డాం. ప్రజలు ఆశీర్వదించారు.

పసుపు పండగను డైవర్ట్ చేసేందుకు..

మహానాడుని డైవర్ట్ చేసేందుకు గొడ్డలి పార్టీ కుట్ర లు చేస్తోంది. ఎన్ని కుట్రలు చేసినా.. ఎన్ని కుయక్తులు పన్నినా టీడీపీని అడ్డుకోలేరు. ఏదైనా పార్టీ ఫస్ట్.. క్యాడరే బెస్ట్. నాయకులను తయారు చేసే విశ్వవిద్యాలయం టీడీపీ. సోషల్ రీ-ఇంజనీరింగే మన విధానం. కార్యకర్తల సంక్షేమం కోసం రూ.160 కోట్లు ఖర్చు చేశాం. స్పెషల్ రివిజన్(సర్)లో భాగంగా ఓట్ల నమోదు విషయంలో నేతలు, కార్యకర్తలు జాగ్రత్తగా ఉండాలి. ఎవరూ ఇగోలకు వెళ్లొద్దు. మహానాడు సాక్షిగా తెలుగుజాతి కోసం పునరంకితమవుదాం.

అభివృద్ధి చేసి సంపద సృష్టించలేని వారికి సంక్షేమం గురించి మాట్లాడే అర్హత లేదు. వైసీపీకి రాజధానిపై ఓ విజన్ అంటూ లేదు. ఆ పార్టీకి విషం కక్కడమే తెలుసు. అధికారంలో ఉన్నప్పుడు మూడు రాజధానులన్నారు.. ఇప్పుడు మావిగన్ అం టున్నారు. వాళ్లకు ఎలాంటి గోల్ లేదు.. అది ఓ అడ్డగోలు బ్యాచ్. వైసీపీది ఓ బ్లఫ్ బ్యాచ్. ఫేక్ న్యూస్ బ్యాచ్. గత పాలకులు రూ.32 వేల కోట్ల విద్యుత్ భారాన్ని ప్రజలపై వేశారు. రూ.1.35 లక్షల కోట్ల మేర డిస్కంలను అప్పుల్లో ముంచారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పాం. తొలిసారి ట్రూ డౌన్ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదే. గత పాలకులు 85 లక్షల టన్నుల చెత్తను వదిలి వెళ్తే దానినీ తొలగించాం. ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేశాం. ఆక్వా ధరలు పడిపోయాయి. ఈ సం క్షోభాన్ని పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నాం.

మహానాడు మహిళలకే అంకితం

మహిళా సాధికారత కోసం, సామాజిక ఆర్థిక రాజకీయ గౌరవం కోసం తమ ప్రభుత్వం పనిచేస్తోంది. ఆస్తి హక్కు నుంచి నేడు తల్లికి వందనం వరకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన ఘనత టీడీపీదే. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు టీడీపీ వారి వెనుక ఉంటుంది. స్త్రీశక్తి ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం. దీపం 2.0 ద్వారా ఏడాదికి 3 ఉచిత సిలిండర్లు ఇస్తున్నాం. గత ఏడా ది లక్ష మంది మహిళలను ఎంట్రప్రెన్యూర్లుగా త యారు చేశాం. 2024 ఎన్నికల్లో కూటమి విజయంలో మహిళలదే కీలక పాత్ర. అందుకే ఈ మహానాడును మహిళా మహానాడుగా ప్రకటిస్తున్నాం.

రాష్ట్రానికి పెట్టుబడుల వెల్లువ..

కూటమి ప్రభుత్వం వచ్చిన 23 నెలల్లో రాష్ట్రానికి రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. తద్వారా 23 లక్షల మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశముంది. ఇప్పటికే 282 ప్రాజెక్టుల ద్వారా రూ.11.27 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపీబీ ద్వారా ఆమోదం తెలిపాం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కాదు.. గేర్ మార్చి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా పరిశ్రమలకు వేగంగా అనుమతులు ఇస్తున్నాం. కేవలం 36 రోజుల్లో నే ఫైటర్ జెట్ తయారీ, టెస్టింగ్ ప్రాజెక్టుకు అనుమతులిచ్చాం. ఆ స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినట?సతోనే తిరుపతిలో రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ ప్రాజెక్టు వచ్చింది. 23 నెలల్లో రూ.63 వేల కోట్లకుపైగా మొత్తాన్ని పింఛన్ల కోసం ఖర్చు పెట్టాం. ఇది సంక్షేమంలోనే రికార్డు. కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకున్న ఆక్వా రైతులకు జూన్ 1 నుంచి యూనిట్ విద్యుత్ రూ.1.50కే ఇవ్వాలని ఆదేశాలిచ్చాం. దివ్యాంగ శక్తి పేరిట ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నాం. ప్రజారోగ్యంలో సంజీవని ప్రాజెక్టుతో వినూత్న మార్పు తీసుకొ చ్చాం. ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా వ్యక్తిగత ఆరోగ్యం, పరిరక్షణ కోసం డిజిటల్ హెల్త్ రికార్డుల కార్యక్రమం 'సంజీవని' అమలు చేస్తాం. మెగా డీఎస్సీ ద్వారా 15,941 మందికి టీచర్ ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదే. 5757 మంది కానిస్టేబుళ్లను రిక్రూట్ చేసిన ప్రభుత్వం మనది. 2026 జాబ్ క్యాలెండర్‌ను కూడా విడుదల చేశాం. విద్యలో రాష్ట్రాన్ని రోల్ మోడల్‌గా నిలుపుతున్నాం. సాగునీటి రంగానికి ప్రాధాన్యమిస్తూ.. 36 ప్రాధాన్య ప్రాజెక్టుల పూర్తికి క్యాలెండర్‌ను కూడా ప్రకటించాం. పోలవరం ప్రాజెక్టును వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల కంటే ముందే పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. గత పాలకుల నిర్లక్ష్యంతో డయాఫ్రం వాల్ ధ్వంసం కావడంతో తిరిగి రూ.1000 కోట్లతో కొత్త వాల్ నిర్మాణం పూర్తి చేశాం.

ఆకాశమే హద్దుగా రాష్ట్ర యువత అవకాశాలను వినియోగించుకోవాలి. 'వన్ ఫ్యామిలి-వన్ ఎంటర్‌ప్రెన్యూర్' ద్వారా అవకాశాలను వాడుకోవాలి.

చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ సాధించే వరకు వారి వెన్నంటే ఉ ంటాం. మహిళల పోరాటాలకు ఈ మహానాడు అంకితం.

రైతులను.. వ్యవసాయాన్ని గత పాలకులు నిర్వీర్యం చేశారు. వారికి ఏడాదికి రూ.7,500 మాత్రమే ఇచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఏటా రూ.14 వేలను అన్నదాతా సుఖీభవ కింద ఇస్తున్నాం.

తీరం మనదే.. బోటు మనదే.. వేటా మనదే అనేలా చర్యలు చేపట్టాం. 200 మెకనైజ్డ్ బోట్లను రూ.240 కోట్ల సబ్సిడీపై ఇస్తాం. - సీఎం చంద్రబాబు




# ప్రభుత్వం న్యాయమైన పరిహారమే చెల్లించింది

**క్రైం కౌంటర్ న్యూస్,మే 28:** ఇళ్లస్థలాల మార్కెట్ విలువను చూపించి వ్యవసాయ భూములకు పరిహారం పెంచాలని కోరలేరని హైకోర్టు స్పష్టం చేసింది. మార్కెట్ విలువకు సంబంధించి అప్పీలుదారులు కోర్టు ముందు ఉంచిన వివరాలు ఇళ్ల స్థలాలకు సంబంధించినవని, వాటి ఆధారంగా వ్యవసాయ భూములకు పరిహారం పెంచాలని కోరడం సరికాదని పేర్కొంది. 2008లో స్వాధీనం చేసుకున్న భూములకు 2010 మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం చెల్లించాలని అప్పీలుదారులు కోరలేరని తెలిపింది. పేదల ఇళ్ల కోసం అప్పీలుదారుల నుంచి సేకరించిన అసైన్డ్ భూములకు అధికారులు రూ.1.50లక్షల మార్కెట్ విలువతోపాటు సొలాటియం (వేదనకు చెల్లించే పరిహారం)కింద 30 శాతం, 12 శాతం అదనపు మార్కెట్ విలువ, వడ్డీలు సైతం చెల్లించారని పేర్కొంది. కడప అవుటర్ రింగ్ రోడ్డు కోసం సేకరించిన భూములకు అధికారులు భూసేకరణ పరిహారం కింద రూ.1.20లక్షల పరిహారం మాత్రమే చెల్లించారని, అప్పీలుదారులకు చెందిన భూములు వాటి సమీపంలోనే ఉన్నాయని గుర్తు చేసింది. పరిహారం చెల్లింపు విషయంలో 2008లో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు అమలు చేయడంతోపాటు ప్రైవేటు భూములకు మించి అధికారులు పరిహారం చెల్లించారని, ఈ నేపథ్యంలో కడప కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పింది. అప్పీల్ సూట్‌లను కొట్టివేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ రవినాథ్ తిల్హరి, జస్టిస్ కుంచం మహేశ్వరరావుతో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది. కడప జిల్లా సీకే దిన్నె మండలంలో సర్వే నం.846/1, 846/2 వేంపల్లి ఖాసిం సాహెబ్, గుండ్లూరు పీరమ్మలకు 2002లో ప్రభుత్వం డీకేటీ పట్టాలు మంజూ రు చేసింది. పేదలకు ఇళ్లస్థలాలు ఇచ్చే నిమిత్తం 2004లో ఈ భూములను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుంది. ఎకరాకు రూ.1.50లక్షల చొప్పున మార్కెట్ విలువ నిర్ణయించగా, దీనిపై వీరు కడప సివిల్ కోర్టును ఆశ్రయించారు. పరిహారం పెంపు కోసం దాఖలు చేసిన పిటిషన్లను కోర్టు కొట్టివేసింది. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఖాసిం సాహెబ్, పీరమ్మ హైకోర్టులో అప్పీల్ చేశారు.

# మహానాడు తొలిరోజు సక్సెస్

**క్రైం కౌంటర్ న్యూస్,మే 28:** టీడీపీ రాష్ట్ర మహానాడు సంబరాల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా క్లస్టర్లలో తెలుగు తమ్ముళ్ల జోష్ నడుమ తొలిరోజు బుధవారం మహానాడు వేడుకలు సక్సెస్ అయ్యాయి. 73 క్లస్టర్ల పరిధిలో కల్యాణ మండపాలు, కార్యాలయాలు, కమ్యూనిటీ హాళ్ల పరిసరాలు పసుపు జెండాల తోరణాల రెపరెపలతో కళకళలాడాయి. మంగళ గిరి నుంచి టీడీపీ అధినేత చంద్రబాబు, యువనేత లోకేశ్, ఇతర ముఖ్య నేతల ప్రసంగాలను ఎల్ఈడీ స్క్రీన్లపై వర్చువల్‌గా తెలు గు తమ్ముళ్లు, మహిళలు, యువత తిలకించారు. జిల్లావ్యాప్తంగా సుమారు 25,000 మంది ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

జిల్లా కేంద్రం ఏలూరుతో సహా ఏడు నియోజకవర్గాల్లోను ముఖ్య నేతలు పార్టీ జెండాలను ఆవిష్కరించి, ఎన్టీ ఆర్‌కు నివాళులర్పించారు. ఉదయం 10 గంటలకు మహానాడు వేడుకలు ప్రారంభం కాగా ఎండ వేడిమి పడకుండా భారీగా టెంట్లు, కుర్చీలు వేశారు. ప్రతిచోట ఏర్పాట్లు పకడ్బందీగా చేశారు. ఉదయం టిఫిన్లు, మధ్యాహ్నం నాన్‌వెజ్‌తో భోజనాలు, కూలింగ్ వాటర్, మజ్జిగ అందజేత తదితర సౌక ర్యాలు ఎమ్మెల్యేలు, ముఖ్య నేతల పర్యవేక్షణలో సాగాయి. ప్రతిచోట 300కు పైబడి నాయకులు, కార్యకర్తలు హాజరు కావడంతో కూలర్లను ఏర్పాటు చేశారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు బడేటి చంటి ఏలూరులోని 11 క్లస్టర్లను కలియదిరగడంతో పాటు, ఉంగుటూరులో గన్ని వీరాంజనేయులు అందు బాటులో లేని కారణంగా అక్కడ ఏర్పాట్లపై భీమడోలు, గుండుగొలనుల్లో బుధవారం సమీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. పోల వరం నియోజకవ ర్గంలో పార్టీ పరిశీలకు కోళ్ల నాగేశ్వరావు, కైకలూరు నియోజవర్గంలో భీమ వరానికి చెందిన సీనియర్ నాయ కుడు ఘంటా త్రిమూర్తులు, రాష్ట్ర నాయ కులు కొత్త నాగేంద్రకుమార్ ఏర్పాట్లను పర్య వేక్షించారు. పోలవరంలో ట్రైకా ర్ చైర్మన్, బొరగం శ్రీనివాస్, చింతలపూడిలో ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్, దెందులూరులో చింతమనేని ప్రభాకర్, నూజివీడులో మంత్రి కొలు సు పార్థసారథి దగ్గరుండి ఏర్పాట్లను చూసుకుని విజయవంతం చేశారు.యువతలో జోష్

స్థానిక సంస్థలకు సన్నద్ధం అవుతున్న తరుణంలో పల్లె, పట్టణం అనే తేడా లేకుండా యువ నాయకత్వం ఈసారి వర్చువల్ మహానాడులో కీలక పాత్రను పోషించారు. కార్యకర్తలకు, నాయకులకు చేదోడు వాదోడుగా ఉంటూ మహానాడు వేదికలపై సందడి చేశారు. చంద్రబాబు, లోకేశ్ ప్రసం గాలకు మహిళలు, యువత, నేతలు సైతం కేరింతలు కొట్టారు. రెండోరోజూ జిల్లా అభివృద్ధికి సంబంధించిన తీర్మానాలను ప్రవేశపెట్టే అవకాశం ఉంది.

కార్యకర్తలకు పెద్దపీట : టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే బడేటి


ఏలూరు టూటౌన్ : ఏలూరులోని జిల్లా టీడీపీ కార్యాలయంలో మహా నాడు నిర్వహించారు. నియోజకవర్గంలోని 11 క్లస్టర్స్‌లో నిర్వహించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే బడేటి చంటి పాల్గొని కార్యకర్తలను ఉత్తేజపరిచారు. తొలుత పార్టీ జెండాను ఆవిష్కరించిన ఆయన అనంతరం మాజీ సీఎం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ కార్యకర్తల పార్టీ అన్నారు. పార్టీ పరిశీలకులు మీరావలి, మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, జిల్లా మీడియా కోఆర్డినేటర్ చల్లా వెంకట సత్యవర ప్రసాదరావు, టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు చోడే వెంకటరత్నం, రెడ్డి నాగ రాజు, సీనియర్ నేతలు ఉప్పాల జగదీశ్‌బాబు, బెల్లకొండ కిషోర్, కార్పొరేటర్లు, క్లస్టర్, డివిజన్ ఇన్‌చార్జ్‌లు, పాల్గొన్నారు.



భావితరాల సంక్షేమ వేదిక మహానాడు : మంత్రి కొలుసు

నూజివీడు/ముసునూరు : నూజివీడు నియోజకవర్గంలో 10 క్లస్టర్లలో మహానాడు కార్యక్రమం నిర్వహించారు. మంత్రి కొలుసు పార్థసారథి నూజి వీడులో పోతిరెడ్డిపల్లి జంక్షన్‌లో గల ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సైకిల్ తొక్కుతూ పైడి అప్పారావు కిరాణా మర్చంట్ అసోసియషన్ హాలులో మహానాడుకు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం వివాన్ ఫంక్షన్ హాల్లో మహా నాడు కార్యక్రమాన్ని పార్టీ జెండా ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ భవిష్యత్ తరాల గురించి టీడీపీ ప్రభుత్వం ఆలోచిస్తుంటే మారీచుడిలా మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అడ్డుకుంటున్నాడని విమర్శించారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు జగదీష్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దుర్గాప్రసాద్, విజయ్, పి.నాగరాజు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొ న్నారు. ముసునూరు మండలంలోని చెక్కపల్లిలో పర్వతనేని బాలగంగాధర్ (బాజ్జి) ఇంటి ప్రాంగణం, కాట్రేనిపాడులో మొక్కజొన్న కంపెనీ ప్రాంగణా ల్లో జరిగిన మహానాడు వేదికల వద్ద మంత్రి పార్థసారథి పాల్గొని ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి పార్టీ జెండాలను ఆవిష్క రించారు. మండల టీడీపీ అధ్యక్షుడు గద్దె రఘుబాబు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు సూర్యదేవర శ్రీనివాసరావు, తల్లిబోయిన సత్యనారాయణ, గ్రామపార్టీల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పార్టీ జండా, అజెండా కార్యకర్తల అభివృద్ధి అని, పార్టీ బలం కార్యకర్తలేనని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దెందులూరు నియోజకవర్గంలోని 11 క్లస్టర్ల పరిధిలో డిజిటల్ వేదికగా జరుగుతున్న మహానాడును ప్రత్యక్షంగా వీక్షించడానికి అనువుగా 11చోట్ల భారీ ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. అన్నిచోట్లకు తిరిగిన ఎమ్మె ల్యే కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. కార్యకర్తలకు అసౌకర్యం కలుగ కుండా పటిష్ఠ ఏర్పాట్లు చేయడంతోపాటు రొయ్యలు, చికెన్‌తో ధమ్ బిర్యానీ లు, చేపల వేంపుడు, క్రీలు, ఎగ్‌బోండాలతో పాటు వెజ్ వంటకాలు, ఆవకాయ పచ్చళ్లు, నోరూరించే నూజివీడు రసాలతో పసందైన విందు భోజనం ఏర్పాటు చేశారు. పెదవేగి మండలం అమ్మపాలెం, విజయరాయి, రాట్నాలకుంట, కూచింపూడి గ్రామాల్లో నాలుగుచోట్ల మహానాడు డిజిటల్ కార్యక్రమాలు నిర్వహించారు. కూచింపూడిలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తల అండదండలే టీడీపీ బలమన్నారు.

# సినిమా



## ఎస్వీ రంగారావు జీవితంలో ఇంత జరిగిందా..!

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో తనదైన ముద్ర వేసిన మహానటుడు ఎస్వీ రంగారావు. ఆయన మరణించి అర్ధ శతాబ్దం గడిచినా, ఆయన చేసిన పాత్రలు, చూపిన నటన నేటికీ సినీ అభిమానుల మదిలో నిలిచి ఉన్నాయి. పాత్రలో జీవించే నటుడిగా పేరుగాంచిన ఎస్వీఆర్, తన కెరీర్‌లో ఎన్నో అద్భుతమైన పాత్రలను పోషించారు. నర్తనశాల చిత్రంలోని కీచకుడి పాత్రకు జకార్తాలో జరిగిన ఆఫ్రో ఏషియన్ సినిమా ప్రదర్శనలో ఉత్తమ నటుడి అంతర్జాతీయ అవార్డును అందుకున్న ఏకైక భారతీయ నటుడిగా పేరు తెచ్చుకున్నారు. ఎస్వీఆర్ కేవలం హీరోలతో సమానమైన ప్రాధాన్యత ఉన్న పాత్రలను మాత్రమే ఎంచుకునేవారు. ఆయన కోసం దర్శకులు ప్రత్యేకంగా పాత్రలను, రచయితలు భారీ డైలాగులను రాసేవారు. షావుకారు సినిమాతో సున్నపు రంగడు పాత్రలో మెప్పించిన ఎస్వీఆర్, ఆ తర్వాత జానపద, పౌరాణిక, సాంఘిక చిత్రాల్లో అద్భుతమైన నటనను ప్రదర్శించారు. 1950ల నుంచి 1970ల వరకు తెలుగు, తమిళ భాషల్లో ఆయన లేని సినిమాను ఊహించడం కష్టంగా ఉండేది. శివాజీ గణేషన్ వంటి నటులు కూడా ఎస్వీఆర్ తో నటించేటప్పుడు అప్రమత్తంగా ఉండేవారంటే ఆయన నటన స్థాయిని అర్థం చేసుకోవచ్చు.అయితే, ఆయన వ్యక్తిగత జీవితం అనేక సవాళ్లతో నిండి ఉండేది. తన మనసుకు నచ్చిన రీతిలో వ్యవహరించే చిన్నపిల్లవాడి మనస్తత్వం ఆయనది. కోపం త్వరగా వచ్చి, అంతే త్వరగా చల్లారే స్వభావం. ఈ పరిస్థితులన్నీ ఇంట్లో ఘర్షణ వాతావరణాన్ని సృష్టించాయి. ఈ వ్యక్తిగత సమస్యలు, అలవాట్లు ఆయన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపాయి. ఒకసారి హైదరాబాద్‌లో షూటింగ్‌లో ఉండగా గుండెపోటు రావడంతో ఉస్మానియా హాస్పిటల్‌లో చికిత్స చేయించుకున్నారు. విశ్రాంతి తీసుకోవాలని, మానసిక ఒత్తిడికి దూరంగా ఉండాలని వైద్యులు సూచించినా, ఎస్వీఆర్ వాటిని పాటించలేదు. తన అలవాట్లను, షూటింగ్‌లను వదులుకోలేదు. ముఖ్యంగా, యశోద కృష్ణ సినిమాలో కంసుడి పాత్రను వదులుకోవడానికి ఆయన అంగీకరించలేదు. అనారోగ్యాన్ని పక్కనపెట్టి, నిర్మాతలను ఒప్పించి మరీ ఆ పాత్రను పోషించారు. సినిమా అయ్యాక అమెరికా వెళ్లి బైపాస్ సర్జరీ చేయించుకోవాలని పిల్లలు ఎంత ఒత్తిడి తెచ్చినా, యశోద కృష్ణ పూర్తయ్యాక వెళ్తానని వారిని ఒప్పించారు.1974 జులై 18వ తేదీన ఆయన ఇంట్లోనే ఉన్నారు. మధ్యాహ్నం భోజనం చేసి విశ్రాంతి తీసుకున్నారు. సాయంత్రం 4:30 గంటల సమయంలో నిద్రలేవగా, ఇంట్లో ఏదో గొడవ.. ఎస్వీ రంగారావు గారు మద్యం సీసాతో బాత్‌రూమ్‌లోకి వెళ్లారు. మద్యం పూర్తిగా సేవించిన తర్వాత తూలుకుంటూ బయటకు వచ్చి దుస్తులు ధరిస్తుండగా తూలి మంచంపై పడిపోయారు. ఆయన మరణవార్త తెలియగానే రామానాయుడు, వి. మధుసూదనరావు వంటి సినీ ప్రముఖులు రంగారావు ఇంటికి చేరుకున్నారు. అయితే, మొదట్లో సతీమణి లీలావతి పార్థివ దేహాన్ని ఎవరినీ చూడనివ్వలేదు. జాతకాలు, పూజలు, వ్రతాలు నమ్మే ఆమె, తన గురువు మరణించిన వ్యక్తిని బతికించగలరని నమ్మింది. గురువు పాండిచ్చేరిలో ఉండటంతో, ఆయన వస్తే తన భర్త బతుకుతాడనే పిచ్చి భ్రమలో ఉండి, కనీసం శవాన్ని చూడటానికి కూడా అనుమతిని ఇవ్వలేదట. చివరికి గురువు ఫోన్‌లో దొరకకపోవడంతో చేసేదేమీ లేక పార్థివ దేహాన్ని మేడపై నుంచి కిందకు తెచ్చి ఇంటి ముందున్న వసారాలో ఉంచడానికి అంగీకరించారట. చెన్నైలోని కన్నిమ్మపేట శ్మశానవాటికలో రంగారావు గారి అంత్యక్రియలు జరిగాయి. తమిళ నటుడు శివాజీ గణేషన్, హీరోయిన్ వాణిశ్రీ వంటి అనేక మంది సినీ ప్రముఖులు ఆయన అంతిమ దర్శనం కోసం బారులు తీరారు.



## పరగడుపున ‘ఈ నీరు’ తాగితే శరీరమంతా ఏసీలా చల్లబడుతుంది!



ఖరీదైన ఎనర్జీ డ్రింక్స్, జ్యూస్‌లతో పనిలేకుండా కేవలం రూ. 10 బడ్జెట్‌తోనే మీ ఆరోగ్యాన్ని కాపాడుకునే సూపర్ సమ్మర్ హ్యాక్ ఇది. సోంపులో ఉండే చలవ చేసే గుణాలు, ఎండుద్రాక్షలో ఉండే ఐరన్, పొటాషియం వంటి పోషకాలు శరీరంలో ఎలక్ట్రోలైట్ సమతుల్యతను కాపాడతాయి. మరి ఈ హెల్తీ డ్రింక్‌ను ఎలా తయారు చేసుకోవాలి? ఎవరెవరు దీనిని తాగకూడదో ఇప్పుడు వివరంగా చూద్దాం... శరీరం చల్లబడి ఎసిడిటీ మాయం వేసవిలో కడుపునొప్పి, గుండెల్లో మంట, ఎసిడిటీ సర్వసాధారణం. సోంపు గింజలలోని సహజసిద్ధమైన చల్లదనం కడుపులోని అధిక ఆమ్లాన్ని తగ్గిస్తుంది. ఎండుద్రాక్ష శరీరానికి తక్షణ శక్తిని ఇస్తుంది. ఈ రెండింటి కలయిక వల్ల గ్యాస్ట్రిక్ సమస్యలు, అల్సర్లు వేగంగా తగ్గుముఖం పడతాయి.

2. మలబద్ధకం నివారణ.. రక్తం శుద్ధి ఎండుద్రాక్షలో పీచుపదార్థం, సోంపులో జీర్ణ ఎంజైమ్‌లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ప్రేగుల కదలికలను సులువుగా మార్చి ఉదయమే కడుపు సాఫీగా అయ్యేలా చేస్తాయి. అంతేకాకుండా, ఇది రక్తంలోని మలినాలను తొలగించి రక్తాన్ని శుద్ధి చేస్తుంది. దీనివల్ల ముఖంపై మొటిమలు, మచ్చలు తగ్గి చర్మం సహజంగా మెరుస్తుంది.

3. డీహైడ్రేషన్ నుండి రక్షణ వేసవిలో విపరీతంగా చెమట పట్టడం వల్ల శరీరం నుండి నీటితో పాటు సోడియం, పొటాషియం వంటి లవణాలు కోల్పోతాము. ఎండుద్రాక్షలో పొటాషియం, ఐరన్ మరియు సోంపులో మెగ్నీషియం ఉండటం వల్ల ఈ నీరు శరీరంలో ఎలక్ట్రోలైట్ సమతుల్యతను పునరుద్ధరిస్తుంది. దీనివల్ల ఎండదెబ్బ తగలకుండా ఉండి.. అలసట, తలనొప్పి, కాలు నొప్పులు రావు.

4. బరువు తగ్గడానికి సహాయపడుతుంది సోంపు గింజలు మీ శరీర జీవక్రియను పెంచుతాయి. ఇది కడుపు నిండిన అనుభూతిని ఇవ్వడం వల్ల పదేపదే జంక్ ఫుడ్ తినాలనే కోరిక తగ్గుతుంది. ఉదయాన్నే పరగడుపున ఈ నీటిని తాగి, ఒక 30 నిమిషాలు వాకింగ్ చేస్తే నెలలో సులభంగా 2 కిలోల వరకు బరువు తగ్గొచ్చు.

తయారు చేసుకునే విధానం

ఒక గ్లాసు ప్యూర్ వాటర్‌లో 10 నుండి 15 నల్ల ఎండుద్రాక్షలను, ఒక టేబుల్ స్పూన్ సోంపు గింజలను వేసి రాత్రంతా నానబెట్టండి.

ఉదయాన్నే నిద్రలేవగానే ఆ నీటిని వడకట్టి పరగడుపున తాగాలి.

నానిన ఎండుద్రాక్షలను, సోంపును పారేయకుండా నమిలి తినేయడం వల్ల పూర్తి ఫైబర్ శరీరానికి అందుతుంది.

గమనిక: ఈ నీటిని ఫ్రిజ్‌లో పెట్టకూడదు, తాజాగా ఉన్నప్పుడే తాగాలి. ఇందులో ఉప్పు లేదా అదనపు చక్కెర కలపకూడదు.

ఎవరు తాగకూడదు? డయాబెటిస్ ఉన్నవారు: రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉన్నవారు దీనిని తాగే ముందు వైద్యులను సంప్రదించాలి. ఎందుకంటే ఎండుద్రాక్షలో సహజ సిద్ధమైన గ్లూకోజ్ ఉంటుంది.

విరేచనాలు ఉంటే: మీకు ఇప్పటికే మోషన్స్ లేదా విరేచనాలు అవుతుంటే.. రెండు రోజుల పాటు ఈ నీటిని తాగడం ఆపేయాలి. రోజుకు ఒక గ్లాసు మాత్రమే తాగాలి, అంతకంటే ఎక్కువ తాగితే కడుపు ఉబ్బరానికి దారితీయవచ్చు.

మార్కెట్లో దొరికే కెమికల్ ఎనర్జీ డ్రింక్స్‌కు బదులుగా, కేవలం పది రూపాయల వంటింటి వస్తువులతో ఈ వేసవిలో మూడు నెలల పాటు ‘కిస్మిస్-సోంపు నీరు’ తాగడం అలవాటు చేసుకోండి. ఇది మీ కడుపును చల్లగా ఉంచడమే కాకుండా పూర్తి ఆరోగ్యాన్ని మీ చేతుల్లో పెడుతుంది.

గమనిక: ఈ కథనంలోని అంశాలు అంతర్జాలంలో అందుబాటులో ఉన్న సమాచారం, ఆయుర్వేద నిపుణుల సలహాల ఆధారంగా కేవలం మీ అవగాహన కోసం అందించబడ్డాయి. ఆరోగ్య సమస్యలు ఉన్నవారు వైద్యుని సంప్రదించడం శ్రేయస్కరం.

## ఎండుద్రాక్ష, పాలు, కేవలం నెలరోజులు ఇలా తినండి.



ఎండుద్రాక్షను నీటిలోనే కాకుండా, రాత్రంతా పాలలో నానబెట్టి ఉదయాన్నే తీసుకోవడం వల్ల అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయని నిపుణులు చెబుతున్నారు. పాలు, ఎండుద్రాక్షల కలయిక వల్ల శరీరానికి కాల్షియం, ప్రోటీన్, ఐరన్, ఫైబర్ పుష్కలంగా అందుతాయి. ఇది ఎముకలను బలోపేతం చేసి మహిళల్లో బోలు ఎముకల వ్యాధిని నివారిస్తుంది. అలాగే, రక్తహీనత, మలబద్ధకం, అధిక రక్తపోటు వంటి సమస్యలను నియంత్రించడంలో సహాయపడుతుంది. పూర్తి ప్రయోజనాలేంటో ఇప్పుడు చూద్దాం..ఎముకల బలానికి అమృతం:

పాలు, ఎండుద్రాక్ష రెండింటిలోనూ కాల్షియం, ప్రోటీన్లు సమృద్ధిగా ఉంటాయి. ఎముకలు బలహీనంగా ఉన్నవారు లేదా కీళ్ల నొప్పులతో బాధపడేవారు ఒక నెల పాటు పాలలో నానబెట్టిన ఎండుద్రాక్షను క్రమం తప్పకుండా తీసుకోవాలి. ఇది మహిళల్లో వచ్చే బోలు ఎముకల వ్యాధి ప్రమాదాన్ని సమర్థవంతంగా నివారిస్తుంది.

రక్తహీనత, రక్తపోటుకు చెక్:

ఎండుద్రాక్షలో ఐరన్, పొటాషియం కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. రాత్రంతా పాలలో నానబెట్టడం వల్ల ఇందులోని పోషకాలను శరీరం త్వరగా గ్రహిస్తుంది. కేవలం నెల రోజుల పాటు దీనిని రోజూ తీసుకోవడం వల్ల శరీరంలో రక్తం పెరిగి రక్తహీనత తగ్గుతుంది. అలాగే, ఇందులోని పొటాషియం రక్తపోటును అదుపులో ఉంచుతుంది.

జీర్ణక్రియ మెరుగుపడుతుంది:

ఎండుద్రాక్షలో డైటరీ ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. పాలలో నానబెట్టడం వల్ల ఇవి మరింత మృదువుగా మారి, పేగులకు అంటుకోకుండా మలబద్ధకం సమస్యను దూరం చేస్తాయి. ప్రతి ఉదయం ఖాళీ కడుపుతో వీటిని తినడం వల్ల పొట్టలోని మంచి బ్యాక్టీరియా (+బ్ ధీుఖ్వీవతీఖు) మెరుగై, జీర్ణక్రియ రేటు పెరుగుతుంది.

గుండె ఆరోగ్యం, అందమైన చర్మం:

ఎండుద్రాక్షలో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. అలాగే, ఇందులోని ముఖ్యమైన నూనెలు చర్మం పొడిబారడం, మొటిమలు, హైపర్ పిగ్మెంటెషన్ వంటి చర్మ సమస్యలను నయం చేసి ముఖాన్ని కాంతివంతంగా మారుస్తాయి. అధిక ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉండే ఈ మిశ్రమం ఎక్కువ సమయం కడుపు నిండుగా ఉంచుతుంది. ఫలితంగా బరువు తగ్గాలనుకునే వారికి కూడా ఇది బాగా పనిచేస్తుంది. కేవలం ఒక నెల పాటు ఈ నియమాన్ని పాటిస్తే మీ ఆరోగ్యంలో ఊహించని మార్పులను గమనించవచ్చు.

## 14 మ్యాచ్‌ల్లో ఒక్కటే హాఫ్ సెంచరీ.. లెక్కేస్తే ఒక్కో రన్‌కు రూ.9 లక్షలు.

ఐపీఎల్ 2026 ముగిసేసరికి లక్నో సూపర్ జాయింట్స్ (ళూ+) ఫ్రాంచైజీకి కోలుకోలేని షాక్ తగిలింది. వరుసగా మూడో సీజన్లోనూ ఆ జట్టు కనీసం ప్లే-ఆఫ్స్‌కు కూడా అర్హత సాధించలేకపోయింది. ఈ 2026 సీజన్ లీగ్ స్టేజ్ ముగిసేసరికి పాయింట్ల పట్టికలో లక్నో ఏకంగా 10వ స్థానంలో నిలిచింది. ఐపీఎల్ 2025 మెగా వేలంలో ఎన్నో ఆశలు పెట్టుకుని రికార్డు స్థాయిలో రూ.27 కోట్ల భారీ ధర వెచ్చించి రిషబ్ పంత్?ను కొనుగోలు చేసిన లక్నో ఓనర్ సంజీవ్ గోయెంకాకు ఈ సీజన్ ఒక పీడకలగా మిగిలిపోయింది. ఈ సీజన్లో లక్నో సూపర్ జాయింట్స్ ఆడిన 14 మ్యాచ్‌లలో కేవలం 4 మ్యాచ్‌లలో మాత్రమే విజయం సాధించి ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. ముంబై ఇండియన్స్‌తో సమానంగా పాయింట్లు ఉన్నప్పటికీ, నెట్ రన్ రేట్ దారుణంగా ఉండటంతో లక్నో టేబుల్‌లో అట్టడుగు స్థానానికి పడిపోయింది.

టాస్ గెలిచినా మ్యాచ్ ఓడిపోయే రేంజ్‌లో సాగిన లక్నో ప్రస్థానంలో రిషబ్ పంత్ సంపాదన మాత్రం హాట్ టాపిక్‌గా మారింది. మెగా వేలం కాంట్రాక్ట్ విలువ రూ.27 కోట్లు కాగా, ఈ సీజన్లో అతను ఆడిన 14 మ్యాచ్‌లకు గానూ మ్యాచ్‌కి రూ.7.5 లక్షల చొప్పున అదనంగా మరో రూ.1.05 కోట్ల మ్యాచ్ ఫీజు అందుకున్నాడు. అంటే ట్యాక్సులు, జరిమానాలు కాకుండా ఈ ఒక్క ఐపీఎల్ 2026 సీజన్ ద్వారానే రిషబ్ పంత్ ఏకంగా రూ.28,05,00,000 (రూ.28.05 కోట్లు) జేబులో వేసుకున్నాడు. దీంతో ఐపీఎల్ హిస్టరీలోనే అత్యధిక ధర పలికిన ప్లేయర్‌గా పంత్ రికార్డు సృష్టించాడు. ఇంత భారీ మొత్తం చెల్లించినందుకు పంత్ బ్యాటింగ్ లేదా కప్ కెప్టెన్సీతో ఏమైనా అద్భుతాలు చేశాడా అంటే అస్సలు లేదు. బ్యాటర్ల హవా నడుస్తున్న మోడ్రన్ టీ20 క్రికెట్లో పంత్ కేవలం 138.05 స్ట్రైక్ రేట్‌తో ఆడి విమర్శల పాలయ్యాడు. టోర్నీ ప్రారంభంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ూ=ు) పై చేసిన 68లి (50 బంతుల్లో) పరుగుల ఇన్నింగ్స్ మినహాయిస్తే, మిగిలిన ఏ మ్యాచ్‌లోనూ పంత్ కనీసం 50 పరుగుల మార్కును కూడా దాటలేకపోయాడు.మొత్తంగా 14 మ్యాచ్‌లలో 13 ఇన్నింగ్స్ ఆడిన పంత్.. 28.36 సగటుతో కేవలం 312 పరుగులు మాత్రమే చేయగలిగాడు. కెప్టెన్‌గా నంబర్ 3, నంబర్ 4, ఓపెనర్‌గా ఇలా రకరకాల పొజిషన్లలో బ్యాటింగ్‌కు వచ్చి జట్టు కాంబినేషన్‌ను పూర్తిగా దెబ్బతీశాడనే విమర్శలు వచ్చాయి. ఇక వికెట్ కీపర్‌గా మాత్రం ఈ సీజన్లో 10 క్యాచ్‌లు అందుకున్నాడు.

రిషబ్ పంత్ అందుకున్న మొత్తం ప్యాకేజీ (రూ.28.05 కోట్లు)ని, అతను ఈ సీజన్లో చేసిన మొత్తం పరుగులతో (312 రన్స్) భాగించి చూస్తే లక్నో మేనేజ్‌మెంట్‌కు దిమ్మతిరిగే లెక్క తేలింది. ఈ సీజన్లో రిషబ్ పంత్ చేసిన ప్రతీ ఒక్క రన్‌కు లక్నో సూపర్ జాయింట్స్ ఏకంగా రూ.8,99,038 (దాదాపు రూ.9 లక్షలు) ఖర్చు చేసింది. ఒక బ్యాటర్ చేసిన సింగిల్ రన్‌కు ఈ స్థాయిలో ఐపీఎల్ చరిత్రలో ఏ ఫ్రాంచైజీ కూడా ఇంత భారీ ధర చెల్లించలేదు.



పంత్ బ్యాటింగ్ సామర్థ్యంపై సంజీవ్ గోయెంకాకు నమ్మకం ఉన్నప్పటికీ, అతని పేలవమైన కెప్టెన్సీ, వ్యూహాత్మక లోపాలపై లక్నో డైరెక్టర్ టామ్ మూడీ ఇప్పటికే అసంతృప్తి వ్యక్తం చేస్తూ జట్టులో రీసెట్ అవసరమని హింట్లు ఇచ్చారు. వచ్చే ఐపీఎల్ 2027 సీజన్ కంటే ముందే పంత్‌ను కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పించి, ఒత్తిడి లేకుండా కేవలం ప్యూర్ బ్యాటర్‌గా మాత్రమే ఆడించేలా లక్నో థింక్ ట్యాంక్ గట్టి ప్లాన్ చేస్తోందని సమాచారం.

Published by katikala Vara Prasad. Owned by katikala Vara Prasad. Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006.published at HNo:1-94 nekunampuram,pokur,Prakasam,andhrapradesh 523113Editor. Katikala Vara Prasad.RNI APTEL/25/A2843. Ph:9849707349 . email:kvp6858@gmail.com.

జర్నలిస్టులు కావలెను

క్రైం కౌంటర్ తెలుగు దినపత్రిక
గత 15 సంవత్సరాలుగా పత్రికా
రంగంలో ప్రత్యేక గుర్తింపు
కలిగిన క్రైం కౌంటర్ తెలుగు దిన
పత్రికలో పనిచేసేందుకు
ఆసక్తి, అనుభవం కలిగిన జర్నలిస్టులు
కావలెను.

APTEL/25/A2844

# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

క్రిష్ణా | సంపుటి : 02 | సంచిక : 182 | శుక్రవారం 29- 05 - 2026 | పేజిలు : 4 | వెల. 2

రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో
- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు
కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు
98497 07349

## ప్రొఫెసర్ కె. నాగేశ్వర్‌పై అక్రమ కేసులు ఎత్తివేయాలి

**లెనిన్ సెంటర్‌లో జర్నలిస్టుల ధర్నా - బెదిరింపులు ఆపాలని డిమాండ్**




**ఏపీ,విజయవాడ,మే 28(క్రైం కౌంటర్ బ్యూరో చీఫ్ సల్మాన్):** సీనియర్ జర్నలిస్ట్, ప్రముఖ రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్‌పై అక్రమ కేసులు ఎత్తివేయాలని, బెదిరింపుల పర్వం ఆపాలని డిమాండ్ చేస్తూ ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్, ఏపీ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడ లెనిన్ సెంటర్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు.

ఈ ధర్నాను ఉద్దేశించి ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.వెంకట్రావు మాట్లాడుతూ, ప్రభుత్వ విధానాలను విశ్లేషిస్తున్న జర్నలిస్టులపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని ఆరోపించారు. భావ ప్రకటనా స్వేచ్ఛను కాపాడాలని, ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకులు షేక్ ఖాజావలి,ఏపీబీజేఏ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఎం. రాఘవులు,ఏపీడబ్ల్యూజేఎఫ్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం. శ్రీనివాస్,ఎం.బేనాథన్,జిల్లా గౌరవ అధ్యక్షులు కే. కలిమిశ్రీ, జిల్లా కోశాధికారి సురేష్ బాబు,జిల్లా నాయకురాలు జ్యోతిర్మయి,జిల్లా నాయకులు విహెచ్. రాజు,పి.నరేష్,కే.మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ మహానాడుతో టీడీపీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం

**ఇబ్రహీంపట్నం క్లస్టర్‌లో ఘనంగా నిర్వహణ**

**భారీగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు**



**ఎన్టీఆర్ జిల్లా,కొండపల్లి మున్సిపాలిటీ,మే 28(క్రైం కౌంటర్ బ్యూరో చీఫ్ సల్మాన్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "మహానాడు" కార్యక్రమాన్ని ఈసారి డిజిటల్ విధానంలో రెండు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించగా. గురువారం ఈ కార్యక్రమం చివరి రోజు సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం క్లస్టర్ పరిధిలోని కొండపల్లి మున్సిపాలిటీలో మహానాడు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ మార్గదర్శకత్వంలో, మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని మహానాడును విజయవంతం చేశారు. డిజిటల్ మహానాడు ద్వారా పార్టీ సిద్ధాంతాలు, భవిష్యత్ అభివృద్ధి లక్ష్యాలు, రాష్ట్ర పురోగతికి చేపట్టనున్న కార్యక్రమాలపై నాయకులు ప్రసంగించారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వాన్ని ప్రశంసిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

మహానాడు కార్యక్రమం విజయవంతం కావడంతో టీడీపీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది.



## రానున్న మూడు గంటల్లో పిడుగులతో వర్షాలు..

**క్రైం కౌంటర్ న్యూస్ మే 28:** ఆంధ్రప్రదేశ్‌లో గాలివానలు బీభత్సం సృష్టిస్తున్నాయి. కొన్ని రోజులుగా విజృంభిస్తూ రాష్ట్ర ప్రజలు, రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. భారీ గాలులకు పెద్దఎత్తున చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలుతున్నాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సామాన్యులు అవస్థలు పడుతున్నారు. అలాగే గాలుల బీభత్సానికి పంటలు నష్టపోవడంతో రైతులు కన్నీటిపర్యంతం అవుతున్నారు. ఈ మేరకు ప్రతిరోజూ వాతావరణ శాఖ, ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. వర్షాల గురించి ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తూ హెచ్చరిస్తున్నారు. తాజాగా నేడు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ నాలుగు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, పిడుగుపాటు హెచ్చరికలు జారీ చేశారు. రానున్న మూడు గంటల్లో కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపారు. ఆ సమయంలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీయనున్నట్లు పేర్కొన్నారు. వర్షాలు కురిసే సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ చెట్ల కింద, విద్యుత్ స్తంభాల వద్ద నిలబడవద్దని ప్రఖర్ జైన్ సూచించారు.

## కార్యకర్తలు, నాయకులకు మనోధైర్యం చంద్రబాబు, లోకేశ్: గోరంట్ల బుచ్చయ్య చౌదరి



**క్రైం కౌంటర్ న్యూస్ మే 28:** రెండో రోజు టీడీపీ మహానాడు కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో 44 ఏళ్ల టీడీపీ ప్రస్థానంపై ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రసంగించారు. 'ఎన్టీఆర్ మాకు, మనకు ఆరాధ్య దైవం. రాజకీయాల్లోకి వద్దామని అనుకుంటున్నా అని ఎన్టీఆర్ హింట్ ఇచ్చేవారు. 1982 మార్చి 28న ఆదర్స్ నగర్‌లో ప్రకటన చేశారు. పెద్ద పెద్ద వాళ్లు ఎవరు రాలేదు. సామాన్యులు మాత్రమే ఎన్టీఆర్‌కి అండగా నిలిచారు. పేదవాడు అంబలి ఇస్తే తాగేవాడు ఎన్టీఆర్. 7 నెలల పాటు తుఫాను, ఎండలు ఉన్నా ఎన్టీఆర్ పాదయాత్ర చేశారు. 9 నెలల్లో అధికారంలోకి వచ్చి చరిత్ర సృష్టించారు' అని తెలిపారు.ఎన్టీఆర్ ఏ చిత్రం తీసినా 300 రోజులు ఆడేవని.. ఆ రోజుల్లోనే రాజకీయాల్లోకి వచ్చారని గోరంట్ల బుచ్చయ్య అన్నారు. సమస్యలు ఎదుర్కొని నీతివంతమైన పరిపాలన సాగించారన్నారు. నెల రోజుల్లో ఇందిరా గాంధీని ఎదిరించి అధికారంలోకి వచ్చిన నాయకుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. శ్రీశైలం ప్రాజెక్ట్‌ను సాగు, తాగునీరు ఇచ్చే విధంగా తెలుగు గంగకు శ్రీకారం చుట్టారన్నారు. మిగులు జలాల పేరుతో తెలుగు గంగను వైఎస్ఆర్ అడ్డుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఎన్టీ రామారావుపై అవినీతి ఆరోపణలు చేసి కోర్టుకు రాకుండా వైఎస్ఆర్ పారిపోయారని వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్ పెట్టిన పథకాలను దేశమే ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగిందని చెప్పుకొచ్చారు.

విజన్ 2020తో రాష్ట్ర గతిని, స్థితిని మార్చిన నాయకుడు చంద్రబాబు అని గోరంట్ల అన్నారు. ఇంత ఎండల్లో మహానాడు సాధ్యమేనా అని అనుమానం కలిగిందని.. వర్చువల్‌గా 7.5 లక్షల మంది కలిసేలా టెక్నాలజీని వినియోగించి చూపించిన నేత లోకేశ్ అని కొనియాడారు. దేశానికే దిక్సూచిగా లోకేశ్ మారే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. పులి కడుపున పులే పుడుతుందని... పెద్ద పులి సాధువు... చిన్న పులి ఉగ్రనరసింహమన్నారు. ఈ ఉగ్రనరసింహం దెబ్బకు గొడ్డలి పార్టీ పరార్ అంటూ వ్యాఖ్యానించారు. తెలుగు జాతి ఐక్యత కోసం, రాష్ట్రాభివృద్ధి కోసం ప్రధాన పాత్ర పోషిస్తున్న నేత లోకేశ్ అని తెలిపారు. మహిళలకు కేంద్రం ఇచ్చినా ఇవ్వకున్నా 33 శాతం రిజర్వేషన్లు ఇస్తామనడం అభినందనీయమన్నారు. కార్యకర్తలకు, నాయకులకు మనోధైర్యం చంద్రబాబు, లోకేశ్ అని చెప్పారు. ఎన్టీఆర్.. కాంగ్రెస్‌ను మట్టి కరిపించారనే అక్కసుతో పద్మభూషణ్, దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు, భారతరత్న ఇవ్వలేదని విమర్శించారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి అన్న ఎన్టీఆర్‌కు భారతరత్న ఇచ్చేలా కృషి చేద్దామని గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు.

## నీటికుంటలో మునిగి ముగ్గురు బాలురు మృతి



**క్రైం కౌంటర్ న్యూస్ మే 28:** ఈత కోసం నీటి కుంటలో దిగిన ముగ్గురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. శ్రీసత్యసాయి జిల్లా రొద్దం మండలం నారనాగేల్లిలో బుధవారం ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చిన్ని, సుదర్శన్ రెడ్డి దంపతుల కుమారుడు రాయల్ సుగుణా రెడ్డి(13).., కల్పన, అజయ్ రెడ్డి దంపతుల కుమారులు దరహాస్ రెడ్డి(12), విష్ణురెడ్డి(10) స్వగ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. తమ పొలంలో నేరేడు పండ్లు ఉన్నాయని, వెళ్లి తిందామని సుగుణా రెడ్డి అనందంతో అన్నదమ్ములు దరహాస్, విష్ణు వెంట వెళ్లారు. మధ్యాహ్నం వరకూ నేరేడు పండ్లు తింటూ సరదాగా గడిపారు. అనంతరం ఈత కొట్టేందుకు సమీపంలో ఉన్న నీటి కుంటలోకి దిగారు. ఈత రాకపోవడం, నీటి లోతు ఎక్కువగా ఉండటంతో మునిగిపోయి మృతిచెందారు. పక్క పొలంలో పనిచేసే పంజాబ్ కూలీలు కాసేపటి తరువాత అటు వచ్చి, చిన్నారుల దుస్తులు నీటి కుంట బయట ఉండటంతో అనుమానంతో నీటిలో దిగి గాలించారు. దీంతో ముగ్గురు బాలుర మృతదేహాలు లభ్యమయ్యాయి. బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఘటనపై విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

## బలమైన గాలులకు పడవ బోల్తా పడి ఇద్దరు మృతి

**క్రైం కౌంటర్ న్యూస్ మే 28:** సముద్రంలో పడవ బోల్తాపడి ఇద్దరు మత్స్యకారులు మరణించారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా బోగోలు మండలం జువ్వలదిన్నె పంచాయతీ అలిచర్ల బంగారుపాలెంలో మంగళవారం రాత్రి జరిగిందీ ఘటన. ఇదే గ్రామంలో జరిగిన మరో ఘటనలో ఇద్దరు మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లి గల్లంతయ్యారు. వారికోసం మెరైన్ పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నారు. ఫిషరీస్ ఏడీఈ ఎస్కే చాన్‌బాషా తెలిపిన వివరాల మేరకు.. అలిచర్ల బంగారుపాలెంకు చెందిన తూపిలి బాలమురళి(48), కుమారి గోవిందు(47) మంగళవారం రాత్రి నాటుపడవలో సముద్రంలో వేటకు వెళ్లారు. బలమైన గాలులకు పడవ బోల్తా పడి ఇద్దరూ నీటమునిగారు. వారు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బుధవారం ఉదయం మెరైన్ పోలీసులకు సమాచారం అందించారు. వారు తీరం వెంబడి గాలించగా పాతపాలెం పరిసరాల్లో ఇరువురి మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతదేహాలను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పరిశీలించారు. సీఎం ఆదేశాల మేరకు మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున రూ. 5లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అలిచర్ల బంగారుపాలెం గ్రామానికే చెందిన అన్నదమ్ములు తులసింగారి రాజు, గణేష్ మంగళవారం రాత్రి సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. వారు తిరిగి ఇంటికి రాకపోవడంతో బుధవారం కుటుంబ సభ్యులు మెరైన్ పోలీసులకు సమాచారం అందించారు. మెరైన్ సిబ్బంది రెండు మోటారు బోట్లతో సముద్రంలో విస్తృతంగా గాలిస్తున్నారు. ఘటనలపై మంత్రి అచ్చెన్నాయుడు ఆరా తీశారు.





## 9,554 గదుల్లో తాత్కాలిక గోడలు అవసరం

**క్రైం కౌంటర్ న్యూస్ మే 28:** ప్రతి తరగతికి ఒక టీచర్ పేరుతో గతేడాది ప్రవేశపెట్టిన మోడల్ ప్రైమరీ స్కూళ్లల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. అందులో భాగంగా ప్రతి తరగతికి ప్రత్యేకంగా ఒక గది ఉండాలని నిర్ణయించింది. రాష్ట్రంలో 9,620 మోడల్ ప్రైమరీ స్కూళ్లు ఉన్నాయి. వాటిలో 38,801 తరగతి గదులు ఉండగా, మరో 981 గదులు నిర్మించనున్నారు. శాశ్వత ప్రతిపదికన కాకపోయినా ఒకే గదిలో 9,554 పార్టిషన్లు (తాత్కాలిక గోడల ఏర్పాటు) అవసరమని పాఠశాల విద్యాశాఖ అంచనా వేసింది. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే ఈ విధానం అమల్లోకి తీసుకురానుంది. అలాగే పాఠశాలల్లో పది ప్రధాన కనీస మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయనుంది. 9,620 మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో 5,989 బడుల్లో కనీస సదుపాయాలు అవసరమని అంచనా వేసింది. దీనికోసం రూ.571.11 కోట్ల నిధుల విడుదలకు పరిపాలనా అనుమతులు మంజూరుచేస్తూ పాఠశాల విద్యాశాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. 1,914 పాఠశాలల్లో మేజర్ అండ్ మైనర్ మరమ్మతులకు రూ.55.56 కోట్లు, 3,171 పాఠశాలల్లో వరండాలను తరగతి గదులుగా మార్చేందుకు రూ.44.69 కోట్లు, 2,569 పాఠశాలల్లో ఫ్యాన్లు, లైట్ల ఏర్పాటుకు రూ.21.06 కోట్లు, 2,050 పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.64.72 కోట్లు, 1,585 పాఠశాలల్లో పార్టిషన్లకు రూ.22.07 కోట్లు, 3,327 బడుల్లో రంగుల కోసం రూ.72.56 కోట్లు, 3,161 బడుల్లో తాగునీటికి రూ.64.22కోట్లు, 3,371 బడుల్లో గ్రీన్ చాక్ బోర్డులకు రూ.19.56 కోట్లు, 2,808 బడుల్లో డ్యూయెల్ డెస్కులకు రూ.62.95 కోట్లు, 457 బడుల్లో అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.143.72 కోట్లు కేటాయించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇప్పటికే ప్రాథమిక అంచనాలు రూపొందించి నిధుల విడుదలకు అనుమతులు మంజూరు చేయగా ఇప్పుడు సవివరమైన అవసరాల అంచనా కోసం కమిటీల నియామకానికి స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విభాగం ఉత్తర్వులు జారీ చేసింది. మండల, జిల్లా స్థాయిలో ఈ కమిటీలను నియమించేందుకు అనుమతి ఇచ్చింది. ప్రాథమిక అంచనాల ప్రకారం తాగునీటికి ఆర్వో సిస్టమ్, డ్యూయెల్ డెస్కులు, గ్రీన్ చాక్ బోర్డులు ఇతర అవసరాలపై సవివరమైన అంచనాలను ఈ కమిటీలు తయారుచేస్తాయి. తాజాగా మంజూరు చేసిన నిధులను ఆ పనులకు ఉ పయోగిస్తారు.

తరగతి గదులు ఇలా...

మోడల్ ప్రైమరీ స్కూళ్లలో కనీసం 60 మంది విద్యార్థులు ఉండాలనే నిబంధన ఉంది. అయితే కొన్నిచోట్ల 45 మంది ఉన్నా మోడల్ ప్రైమరీ పాఠశాలగా గుర్తించారు. అయితే వాటిల్లోనూ కనీసం 60 మంది ఉండాలనే లక్ష్యాన్ని నిర్దేశించారు. 60 నుంచి 90 మంది విద్యార్థులున్న పాఠశాలల్లో మొత్తం 5 తరగతి గదులు ఉండాలి. సగటున 18 మందికి ఒక గది ఉంటుంది. 91 నుంచి 120 మంది విద్యార్థులుంటే సగటున 24 మందికి ఒక గది, 121 నుంచి 150 మంది విద్యార్థులుంటే సగటున ప్రతి 30 మందికి ఒక గది ఉండాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. 150 మంది దాటితే ప్రతి 30 మంది విద్యార్థులకు ఒక అదనపు తరగతి గది నిర్మించేందుకు చర్యలు ప్రారంభించింది.

## ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమంలో 'కృష్ణవేణి నదీ నవహారతులు' పునఃప్రారంభం

### జూన్ 5 నుంచి వైభవంగా నిర్వహణకు దేవస్థానం సిద్ధం

### విస్తృత ఏర్పాట్లపై ఈవో శీనా నాయక్ అధికారులకు కీలక ఆదేశాలు

**ఏపీ,విజయవాడ.మే 28(క్రైం కౌంటర్ బ్యూరో చీఫ్ సల్మాన్):** విజయవాడ ఇంద్రకీలాద్రి క్షేత్రంలోని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం (ఫెర్రీ ఘాట్) వద్ద నిర్వహించే "కృష్ణవేణి నదీ నవహారతులు'' కార్యక్రమాన్ని పునఃప్రారంభించేందుకు దేవస్థానం సర్వసన్నద్ధమవుతోంది. సనాతన హిందూ ధర్మ ప్రచారం మరియు టెంపుల్ టూరిజం అభివృద్ధిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించనున్నారు.వచ్చే నెల 05-06-2026 తేదీ నుంచి నవహారతుల కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా, నిరంతరాయంగా నిర్వహించేందుకు దేవస్థానం తగు చర్యలు చేపట్టింది. పవిత్ర సంగమం వద్ద నవహారతులను శాస్త్రోక్తంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అవసరమైన సూచనలు, మార్గదర్శకాలను లిఖితపూర్వకంగా సమర్పించవలసిందిగా ఆలయ స్థానాచార్యులు మరియు వైదిక కమిటీ సభ్యులకు దేవస్థానం ఈవో శీనా నాయక్ ఆదేశాలు జారీ చేశారు.

క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలననవహారతుల నిర్వహణకు అవసరమైన వసతులు, భద్రతా ఏర్పాట్లు, విద్యుత్ అలంకరణలు, భక్తుల సౌకర్యాలు తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేపట్టాలని ఈవో శీనా నాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు.దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, సహాయ కమిషనర్, పౌర సంబంధాల అధికారి, వైదిక కమిటీ సభ్యులతో కలిసి ఉమ్మడిగా పరిశీలన నిర్వహించి, అన్ని ఏర్పాట్లపై పూర్తి స్థాయి సమగ్ర నివేదికను 02-06-2026 లోపు సమర్పించవలసిందిగా స్పష్టమైన గడువు విధించారు.

పవిత్ర కృష్ణమ్మ తల్లికి అర్పించే ఈ నవహారతుల కార్యక్రమం భక్తులను, పర్యాటకులను విశేషంగా ఆకట్టుకునేలా ఎటువంటి లోటుపాట్లు లేకుండా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని ఈవో అధికారులకు సూచించారు.




## నాణ్యతతో.. ప్రణాళికాబద్ధంగా, నిర్ణీత వ్యవధిలో పనులు: విదేశీ నిపుణులు



**క్రైం కౌంటర్ న్యూస్ మే 28:** పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులపై విదేశీ నిపుణుల బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. ప్రాజెక్టు నిర్మాణాన్ని పరిశీలించి, సూచనలు సలహాలు ఇవ్వడానికి నియమించిన అంతర్జాతీయ నిపుణుల బృంద సభ్యులైన కెనడాకు చెందిన సీన్ హించ్‌బెర్గర్, రిచర్డ్ డొనెల్లీ బుధవారం పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటించారు. జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ వారికి స్వాగతం పలికారు. ప్రాజెక్టులో ఈసీఆర్ఎఫ్ డ్యాం, డయాఫ్రంవాల్ ప్రాంతాలను పరిశీలించిన విదేశీ బృందం.. నాణ్యతా లోపం లేకుండా, ప్రణాళికాబద్ధంగా, నిర్ణీత కాల వ్యవధిలో పనులు జరుగుతున్నాయని పేర్కొంది. అనంతరం అధికారులతో సమీక్షించింది. ఎస్ఈ రామచంద్రరావు డయాఫ్రంవాల్ పనులు, ఇతర పనుల తీరుపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. గతంలో తామిచ్చిన సూచనలు సలహాల మేరకు పనులు వేగవంతంగా, సంతృప్తికరంగా చేయడం గొప్ప విషయమని నిపుణుల బృందం చెప్పింది. ఈ బృందం మరో రెండు రోజులు ప్రాజెక్టులో పర్యటించనుంది.

రెండో రోజూ రాతి, మట్టి నాణ్యత పరీక్షలు

పోలవరం ప్రాజెక్టులో సీఎ?సఎంఆర్ఎస్ పరీక్షలు రెండోరోజైన బుధవారం కూడా కొనసాగాయి. ఈ సంస్థ నిపుణు ల బృందం బుధవారం గ్యాప్-2 ప్రాంతంలో వాడిన మట్టిలో తేమ పటుత్వ శాతాన్ని పరీక్షించింది. ప్రాజెక్టు నిర్మాణంలో భవిష్యత్ అవసరాల కోసం వినియోగించే మట్టి నాణ్యతపై పరీక్షలు నిర్వహించారు.

## ఇంత భారీగా ఆస్తులెలా కొన్నారు?

**క్రైం కౌంటర్ న్యూస్ మే 28:** జగన్ హయాంలో జరిగిన భారీ మద్యం స్కాం కేసులో రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) బుధవారం విచారించింది. హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయంలో సుదీర్ఘంగా ప్రశ్నించి కీలక విషయాలు రాబట్టింది. బేవరేజెస్ కార్పొరేషన్లో ఆయన అడుగుపెట్టడం మొదలుకొని.. మద్యం సరఫరా సంస్థలకు ఇచ్చిన ఆర్డర్లు, భారీ మొత్తంలో జరిగిన లావాదేవీలు, లిక్కర్ ఆర్డర్లు మాన్యువల్‌గా మార్చడం వెనకున్న కారణాలు, ముడుపుల ఆరోపణలు, ఆయన భారీగా కొనుగోలు చేసిన ఆస్తులు, బావమరిది తదితర బంధువులను బినామీలుగా పెట్టుకుని పోగేసుకున్న ఆస్తుల చిట్టాపై నిలదీసినట్లు తెలిసింది. ఎండీగా ఆయన తీసుకున్న నిర్ణయాలు, మద్యం ధరల పెంపు, సరఫరా సంస్థల ఎంపిక, అనుమతుల జారీ, చెల్లింపుల ప్రక్రియపైనా అడిగినట్లు సమాచారం. ప్రభుత్వ ఖజానాకు వాటిల్లిన నష్టం, బేవరేజెస్ కార్పొరేషన్ ఆర్థిక లావాదేవీలు, వాసుదేవరెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యులు, బంధువుల బ్యాంకు ఖాతాల లావాదేవీలను పరిశీలించిన ఈడీ అధికారులు.. వాటిపై ప్రశ్నలు సంధించినట్లు సమాచారం. మద్యం వ్యాపారుల ఖాతాల నుంచి వాసుదేవరెడ్డి బంధువులకు చేరిన సొమ్ము గురించి అడిగారు. అప్పట్లో ఆయనతో పాటు ఎక్సైజ్ శాఖలో కీలకంగా వ్యవహరించిన అధికారుల పాత్రపైనా ప్రశ్నించినట్లు తెలిసింది. ఆయన భార్య కల్పనారెడ్డి, బంధువుల పేరుతో కొనుగోలు చేసిన రూ.96 కోట్ల విలువైన ఆస్తులకు డబ్బులు ఎలా వచ్చాయని ప్రశ్నించిన ఈడీ అధికారులు.. బ్లాక్‌లో చెల్లించిన పెద్ద మొత్తం తాలూకు వివరాలు రాబట్టినట్లు సమాచారం. వైసీపీ హయాంలో బీ9 బేవరేజట?సకు ఏడాది పాటు మద్యం ఆర్డర్ ఇవ్వకుండా.. ఒక్కో కేసు మద్యంపై తనకు రూ.65 నుంచి రూ.78 వరకూ లంచం ఇచ్చిన తర్వాతే వాసుదేవరెడ్డి దానికి ఆర్డర్లు ఇచ్చిన వ్యవహారంలో ఈడీ అధికారులు ఆధారాలు సంపాదించారు. వాటిని ముందుపెట్టి ఆయన్ను ప్రశ్నించినట్లు సమాచారం.భార్య సోదరుడు విజయ నరసింహారెడ్డికి చెందిన రణదీప్ ఎంటర్‌ప్రైజెస్, ఆసీఫా మార్కెటింగ్ సర్వీసెస్, వెంకటేశ్వర ఎంటర్‌ప్రైజెస్, వీఎన్ఆర్ గ్లోబల్ వంటి సంస్థల్లోకి బీ 9 బేవరేజెస్ నుంచి కోట్లాది రూపాయలు వచ్చాయని.. ఆ మొత్తాన్ని దఫదఫాలుగా వాసుదేవరెడ్డి భార్య పేరుతో ఆస్తుల కొనుగోలుకు మళ్లించడంపైనా గుచ్చిగుచ్చి ప్రశ్నించినట్లు తెలిసింది. పెరల్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి తీసుకున్న రూ.20 కోట్ల లంచం, మద్యం డిపోల నుంచి లిక్కర్ షాపులకు సరుకు సరఫరా చేసే రవాణా కాంట్రాక్టు సిగ్మా అనే సంస్థకు ఎక్కువ ధరకు కట్టబెట్టి ప్రభుత్వ ఖజానాకు నష్టం చేకూర్చి లబ్ధి పొందడంపైనా ఈడీ ప్రశ్నించింది. వాసుదేవరెడ్డి, ఆయన భార్య కల్పనారెడ్డి, బావమరిది విజయనరసింహారెడ్డి, మామ పుల్లారెడ్డి, వారికి సంబంధించిన వీఎన్ఆర్ డెయిరీ ప్రొడక్ట్స్, వీఎన్ఆర్ గ్లోబల్, శ్రీ లక్ష్మీనరసింహస్వామి మిల్క్ చిల్లింగ్ పాయింట్ వంటి సంస్థల వ్యాపార ఖాతాల్లోకి ముడుపుల సొమ్ము మళ్లించి.. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం గౌరవరంలో కొనుగోలు చేసిన రూ.49 కోట్ల విలువైన వ్యవసాయ భూమి లావాదేవీలపై ఆరా తీసినట్లు తెలిసింది. తెలంగాణలోని వికారాబాద్ జిల్లాలో కొన్న రూ.35 కోట్ల విలువైన ఆస్తి, హైదరాబాద్ సమీపంలోని గండిపేట ప్రాంతంలో వెన్నా బ్రీజ్‌లో కొనుగోలు చేసిన విల్లా, మరికొన్ని ఆస్తులకు ఎక్కడి నుంచి డబ్బులు వచ్చాయని ఈడీ అధికారులు అడిగారు. ఆయనిచ్చిన అత్యంత విలువైన సమాచారంతో గత ప్రభుత్వంలోని మరికొందరు అధికారులకు నోటీసులు ఇవ్వనున్నట్లు సమాచారం.

కేఎన్ఆర్‌కు నోటీసులు

ఈ మద్యం స్కాంలో గురువారం విచారణకు రావాలని జగన్ పీఏ కేఎన్ఆర్‌కు ఈడీ నోటీసులు ఇచ్చినట్లు తెలిసింది. అయితే ఇదే కేసులో సిట్ విచారణ ఉన్నందున జూన్ మొదటి వారంలో వస్తానని ఆయన బదులిచ్చినట్లు సమాచారం. కేఎన్ఆర్ రూ.వందల కోట్లు ఎలా కూడబెట్టారో ఈడీ అధికారులు సమాచారం సేకరించారు. ఆస్తుల కొనుగోలు పత్రాలు, బ్యాంకు ఖాతాలు, 2019 నుంచి వరుసగా ఆదాయ పన్ను రిటర్న్‌లు తీసుకుని రావాలని ఆయనకు ఇచ్చిన నోటీసుల్లో పేర్కొన్నట్లు తెలిసింది. ఈడీ.. మరికొందరికి నోటీసులు జారీచేయనున్నట్లు తెలిసింది.



## జైపూర్‌లలో ఏకకాలంలో అధికారుల సోదాలు

**క్రైం కౌంటర్ న్యూస్ మే 28:** ఆంధ్రప్రదేశ్ నదుల్లోని ఇసుక రాజస్థాన్ వరకూ చేరింది.. ఇక్కడి మైనింగ్ నాలుగు రాష్ట్రాలకు వెళ్లింది.. జగన్ హయాంలో జరిగిన కుంభకోణం ఏపీతోపాటు తమిళనాడు, తెలంగాణ, రాజస్థాన్ వరకు వ్యాపించింది. ఏసీబీ, ఈడీ వంటి సంస్థలు తవ్వే కొద్దీ అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. రూ.2500 కోట్ల కుంభకోణంలో అవినీతిని రాష్ట్ర ఏసీబీ అధికారులు తవ్వితీస్తే.. ఖండాంతరాలు దాటిని ఆ సొమ్ము గుట్టుమట్లను ఈడీ రాబట్టే ప్రయత్నం చేస్తోంది. దీనిలో భాగంగా బుధవారం ఏకకాలంలో నాలుగు రాష్ట్రాల్లోని 4 ప్రధాన నగరాల్లో సోదాలు చేపట్టింది. విజయవాడ, హైదరాబాద్, కోయంబతూరు, జైపూర్‌లలో.. వైసీపీ ప్రభుత్వంలో ఇసుక, మైనింగ్ చేసిన కంపెనీల్లో తనిఖీలు నిర్వహించి కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకుంది. జేపీవీఎల్, జీసీకేసీ, ప్రతిమా ఇన్‌ఫ్రా వంటి సంస్థల కార్యాలయాల్లో డిజిటల్ రికార్డులు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పత్రాలను ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. మైనింగ్ ద్వారా వెనకేసుకున్న సొమ్ము బదిలీ మార్గాలు, అనుబంధ వ్యాపారాలు, పెట్టుబడులను గుర్తించే పనిలో నిమగ్నమైనట్టు సమాచారం.

ఏం జరిగింది?

2021లో జగన్ ప్రభుత్వం ఇసుక తవ్వకాలకు అడ్డగోలు అనుమతులు ఇచ్చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఇసుక రీచ్‌లను ప్రాంతాల వారీగా విభజించి జేపీవీఎస్, జీసీకేసీ, ప్రతిమా ఇన్‌ఫ్రా వంటి సంస్థలకు అప్పగించింది. అప్పటి గనుల శాఖ డైరెక్టర్ వెంకటరెడ్డి అడ్డగోలుగా వ్యవహరించి ప్రభుత్వానికి రూ.2,566 కోట్ల నష్టాలు తెచ్చిపెట్టినట్లు విజిలెన్స్ నిగ్గుతేల్చింది. ఒక్క జేపీవీఎల్‌కే రూ.800 కోట్లు లబ్ధి చేకూర్చారని, బ్యాంకు గ్యారెంటీ రూ.120 కోట్లకు సంబంధించి తప్పుడు నిర్ణయం తీసుకున్నట్లు అందులో పేర్కొంది. విజిలెన్స్ నివేదిక ఆధారంగా ఏపీ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏసీబీ 2024, సెప్టెంబరు 11న కేసు నమోదు చేసింది. అనంతరం.. వెంకటరెడ్డిని అరెస్టు చేసి జైలుకు పంపింది. మైనింగ్ లీజులు, రాయల్టీ లెక్కింపు, పెనాల్టీల మినహాయింపు, అక్రమ తవ్వకాల అనుమతుల్లో భారీ అవకతవకలు జరిగినట్లు ఏసీబీ దర్యాప్తులో బయటపడినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఏసీబీ విచారణలో బయటపడ్డ సమాచారం ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ నిరోధక చట్టం(పీఎంఎల్ఏ) కింద దర్యాప్తు చేపట్టింది.సొమ్ము మళ్లింపుపై ఆరా..

ఏపీలో అక్రమ మైనింగ్ ద్వారా దోచుకున్న సొమ్మును ఏ దారుల్లో ఎక్కడికి మళ్లించారో సమాచారం సేకరించిన ఈడీ అధికారులు.. దీనికనుగుణంగా బుధవారం సోదాలు చేపట్టారు. జేపీవీఎల్, జీసీకేసీ, ప్రతిమా ఇన్‌ఫ్రా సంస్థలకు సంబంధించిన కార్యాలయాల్లో తనిఖీలు చేసి పలు డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకుంది. అక్రమంగా సంపాదించిన సొమ్ము ఎటు వెళ్లింది..?. షెల్ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టారా..?. నిర్మాణ సంస్థల్లోకి మళ్లించారా..?. లేక, దేశం దాటించారా..?. అనే కోణంలో ఇప్పటికే సేకరించిన సమాచారం ఆధారంగా బ్యాంకు ఖాతాల వివరాలు, ఆర్థిక లావాదేవీలు, డైరెక్టర్ల వివరాలు, ఆస్తుల కొనుగోళ్లు, అనుబంధ సంస్థల మధ్య నిధుల బదిలీ, తదితర వివరాలను ఈడీ బృందాలు సేకరించాయి. విజయవాడలో ఒకచోట, హైదరాబాద్‌లో మూడు చోట్ల, కొయంబత్తూరు, జైపూర్‌లో రెండు చోట్ల బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సోదాలు చేపట్టారు. ఈ సోదాల్లో కంప్యూటర్ హార్డ్ డిస్కులు, ఒప్పంద పత్రాలు, బ్యాంకు స్టేట్‌మెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

కేసీఆర్ బంధువు సంతోష్ పేరు?

ఈడీ సోదాల్లో లభించిన పత్రాల విశ్లేషణలో ప్రతిమా ఇన్‌ఫ్రాకు సంబంధించిన లావాదేవీల్లో తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ సమీప బంధువు బోయినపల్లి సంతోష్ పేరు వినిపించింది. తెలంగాణకు చెందిన ఈ కంపెనీ ఎదుగుదలకు బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఆయన చేయూత అందించారనే ఆరోపణలు ఉన్నాయి. ఇదే కోణంలో ప్రతిమా ఇన్‌ఫ్రా లావాదేవీలపై ఈడీ అధికారులు విశ్లేషిస్తున్నట్లు సమాచారం. ఈ కుంభకోణంలో ఈడీ అధికారులు మరింత ముందుకెళ్తే తెలుగు రాష్ట్రాల్లోని మరికొందరు నేతలకు కూడా నోటీసులు ఇచ్చే అవకాశం ఉంది.

## టీడీపీ మహానాడులో ట్రాన్స్‌జెండర్ వర్షిణి వ్యాఖ్యలు



**క్రైం కౌంటర్ న్యూస్ మే 28:** సమాజంలో అవమానాలు, కష్టాలు, కన్నీళ్లతో చీకట్లో మగ్గిపోతున్న ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక గుర్తింపు కల్పించి, వారి జీవితాల్లో వెలుగులు నింపిన నాయకుడు సీఎం చంద్రబాబు అని ట్రాన్స్‌జెండర్ వర్షిణి అన్నారు. బాగా చదువుకున్నా కూడా సమాజంలో ముందుకు వెళ్లలేకపోతున్నామని బాధపడుతున్న తరుణంలో... ట్రాన్స్‌జెండర్లను కూడా సమాజంలో భాగంగా భావించి 'అదర్స్' కేటగిరీగా గుర్తించి ప్రభుత్వ పథకాలు వర్తింపజేస్తున్నారన్నారు. సొంత ఇళ్లు, పింఛన్లు మంజూరు చేస్తూ ట్రాన్స్‌జెండర్లకు ఆర్థిక భరోసా కల్పించారని ఆనందం వ్యక్తం చేశారు. మహానాడు కార్యక్రమంలో వర్షిణి మాట్లాడుతూ.. టీడీపీ ప్రభుత్వంలోనే తమ జీవితాలు మెరుగుపడ్డాయని చెప్పారు. స్టేట్ వెల్ఫేర్ ట్రాన్స్‌జెండర్ బోర్డును ఏర్పాటు చేసి.. అందులో ట్రాన్స్‌జెండర్‌కి అవకాశం కల్పించిన ఘనత సీఎం చంద్రబాబు ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ట్రాన్స్‌జెండర్ల జీవితాల్లో గత ప్రభుత్వం మళ్లీ చీకట్లు నింపాలని చూసిందని, అయితే 2024లో రాష్ట్ర ప్రజలిచ్చిన గొప్ప తీర్పుతో తమ జీవితాల్లో మళ్లీ మార్పు మొదలైందని వివరించారు.



## స్టాలిన్, మమత ఇలాగే ఓడారు: జగన్

**క్రైం కౌంటర్ న్యూస్ మే 28:** రాష్ట్రంలో ఎన్నికల కమిషన్ చేపడుతున్న 'సర్' ప్రక్రియతో పార్టీ సానుభూతిపరుల ఓట్లను తొలగించేస్తే ఎన్నికల్లో ఓడిపోతామని వైసీపీ అధ్యక్షుడు జగన్ ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై అప్రమత్తంగా ఉండాలని.. వైసీపీ ఓట్లు తొలగించకుండా చూడాలని పార్టీ అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జులను, సమన్వయకర్తలను ఆదేశించారు. 'సర్'పై అనేక రాష్ట్రాలు అనేక సందేహాలు, భయాలు, ఆందోళనలు వ్యక్తం చేశాయన్నారు. పశ్చిమబెంగాల్లో 11.9 శాతం.. అంటే 91 లక్షల ఓట్లను తొలగించారని.. తమిళనాడులో 11.6శాతం.. 74 లక్షల ఓట్లు తొలగించారని చెప్పారు. మమతా బెనర్జీ పోటీ చేసిన భవానీపూర్‌లో 44,900 ఓట్లను తొలగించడంతో ఆమె 15105 ఓట్ల తేడాతో ఓడిపోయారని.. స్టాలిన్ పోటీచేసిన కొళత్తూరులో 71,133 ఓట్లను తీసివేయడంతో ఆయన 8,000 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారని అన్నారు. 'సర్'పై అప్రమత్తంగా ఉండాలన్నారు. బుధవారం తాడేపల్లి ప్యాలట?సలో వైసీపీ విస్తృత స్థాయి సమావేశంలో జగన్ మాట్లాడారు. చంద్రబాబుకు కుప్పంలో 22 వేలదొంగ ఓట్లు ఉన్నాయని జగన్ ఆరోపించారు. సీఎం చంద్రబాబు రెండేళ్ల పాలనకు నిరసనగా వచ్చే నెల 4 నుంచి 12 దాకా 'వెన్నుపోటుకు రెండేళ్లు' పేరిట ప్రతి నియోజకవర్గంలో నిరసనలు, ఆందోళనలు నిర్వహించాలని ఆదేశించారు. చంద్రబాబు రాక్షసపాలనపై చర్చ జరపాలన్నారు. ఈ సందర్భంగా 'వెన్నుపోటుకు రెండేళ్లు' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ప్రజలందరికీ అందించి చంద్రబాబు అరాచక పాలన, హామీల బుట్టదాఖలుపై వివరించాలన్నారు. నాన్న తర్వాత తన పాలనలోనే సంక్షేమం జరిగిందని.. మంచి చేశానని చెప్పి కాలర్ ఎగరేశానని తెలిపారు. స్థానిక ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని, చంద్రబాబు కుట్రలను ఎదుర్కొని విజయం సాధించాలని.. పోటీచేసే అభ్యర్థులకు సంపూర్ణ సహకారం అందించాలని అసెంబ్లీ ఇన్‌చార్జులకు స్పష్టంచేశారు. ఇప్పుడు వారికి సహకరిస్తే.. వారు అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానికి పనిచేస్తారన్నారు. స్థానిక ఎన్నికల్లో ఓటమిని అసెంబ్లీ ఇన్‌చార్జి వైఫల్యంగానే పరిగణిస్తానని హెచ్చరించారు. 'నిద్రలో మావిగన్ అనే మాట వినిపిస్తే చంద్రబాబు గుండె ఆగి చనిపోయేలా ఉన్నాడు. ప్రజలను పిచ్చోళ్లనుకుంటున్నాడు' అని వ్యాఖ్యానించారు.

గత ఎన్నికల్లో తనను దారుణంగా ఓడించింది.. భారీ మెజారిటీతో కూటమిని గద్దెనెక్కించింది ప్రజలన్న సంగతి జగన్ మరచిపోయినట్లు కనబడుతోందని రాజకీయ వర్గాలు అంటున్నాయి. ప్రజాతీర్పు వెలువడిన జూన్ 4నుంచి 'వెన్నుపోటుకు రెండేళ్లు' పేరిట నిరసనలకు పిలుపివ్వడాన్ని వైసీపీ ముఖ్య నేతలు తప్పుబడుతున్నారు.

## ఐదేళ్లలో కేఎన్‌ఆర్ వందల కోట్ల అక్రమార్జన.. లిక్కర్ ముఠాకు.. వైసీపీ అధినేతకు మధ్య వారధి

**క్రైం కౌంటర్ న్యూస్ మే 28:** అక్రమార్జనలో జగన్ పీఏ కె.నాగేశ్వర రెడ్డి(కేఎన్‌ఆర్) 'ఘనత' ఇదీ. గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భారీ లిక్కర్ స్కామ్‌లో నిందితుడైన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి సంబంధించిన లావాదేవీల్లో కేఎన్‌ఆర్ ఆస్తులు వెలుగులోకి వచ్చాయి. వాటి ఆధారంగా విచారణకు పిలిపించి సిట్ అధికారులు ప్రశ్నించారు. దిమ్మతిరిగే ఆస్తుల చిట్టా బయట పడింది. ఏపీ, తెలంగాణ, కర్ణాటకలో కేఎన్‌ఆర్‌కు వందల కోట్ల విలువైన ఇళ్లు, వ్యాపారాలు, స్థిరాస్తులు.. భార్య బ్యాంకు ఖాతాలో సుమారు 20 కోట్ల రూపాయల వరకూ లావాదేవీలు బయట పడ్డాయి. ఈ సొమ్ము పలువురి ఖాతాల నుంచి బదిలీ కావడంతో పాటు పలు ప్రాంతాల నుంచి నగదు డిపాజిట్ చేసినట్లు సిట్ తేల్చింది. జగన్‌కు ఎక్కడెక్కడ ప్యాలట?సలు ఉన్నాయో అక్కడంతా ఇళ్లున్న కేఎన్‌ఆర్‌కు తిరుపతిలో అదనంగా ఉంది.ఏది అడిగినా దాటవేత ధోరణి

గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన 3,500 కోట్ల లిక్కర్ స్కామ్‌ను సిట్ విచారిస్తున్న సంగతి తెలిసిందే. వైసీపీ కీలక నేత చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ముడుపుల సొమ్ము కోట్లాది రూపాయలు తరలించినట్లు తేల్చింది. ఆయన ఆస్తుల వివరాలు పరిశీలించగా.. తిరుపతి జిల్లా కేవీబీ పురం మండలంలో ఒల్లూరు వద్ద కేవీఆర్ ఇన్‌ఫ్రా పేరుతో వేసిన 47ఎకరాల లే అవుట్ వివరాలు బయట పడ్డాయి. అందులో నుంచి ఆస్తులు కొనుగోలు చేసిన వారిలో జగన్ వద్ద వ్యక్తిగత సహాయకుడిగా పనిచేస్తున్న కేఎన్‌ఆర్ పేరిట పదెకరాలు 2021లో రిజిస్టర్ అయినట్లు తేలింది. ఎకరా రూ. 8 లక్షల చొప్పున పదెకరాల ఆస్తిని కేఎన్‌ఆర్ రూ. 81 లక్షలకు కొనుగోలు చేసినట్లు గుర్తించారు. దీంతో ఆయనకు సిట్ అధికారులు నోటీసులిచ్చి విచారణకు పిలిచారు. విజయవాడలోని పోలీస్ కమిషనరేట్ ప్రాంగణంలో ఉన్న సిట్ ఆఫీసుకు బుధవారం ఉదయం పది గంటలకు న్యాయవాదులతో కలిసి వచ్చిన కేఎన్‌ఆర్‌ను సాయంత్రం 7.30 వరకూ సిట్ అధికారులు ప్రశ్నించారు. చెవిరెడ్డి కుటుంబానికి చెందిన కేవీఆర్ ఇన్‌ఫ్రాలో పదెకరాల భూమి కొనుగోలు చేయడానికి రూ. 81 లక్షల డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందని సిట్ అధికారులు ప్రశ్నించారు. తనకు గుర్తులేదని, ఆడిటర్ చూసుకుంటారని కేఎన్‌ఆర్ బదులిచ్చారు. అధికారులు ఏది అడిగినా దాటవేత ధోరణితో వ్యవహరించారు. అయితే ఒక్కో ఆస్తి చిట్టా బయట పెడుతూ.. ఈ డబ్బులన్నీ లిక్కర్ స్కామ్‌లో ముడుపుల ద్వారా వచ్చినవేనా? అని అధికారులు ప్రశ్నించారు. దీంతో అవాక్కైన కేఎన్‌ఆర్ పొంతనలేని సమాధానాలు చెప్పినట్లు సమాచారం. 'చిన్న టిఫిన్ సెంటర్ ఏర్పాటు చేసుకుని జీవించే కుటుంబానికి చెందిన మీరు జగన్ పంచన చేరక ముందు వరకూ అతి సామాన్యుడు.. కానీ ఇప్పుడు వందల కోట్ల రూపాయల ఆస్తులు ఎలా వచ్చాయి? అని అధికారులు ప్రశ్నించారు. తనకు విజయవాడలో కార్ల షోరూమ్‌లో భాగస్వామ్యం ఉందని, బామ్మర్ది రఘునాథ్ రెడ్డి పేరుతో ఉన్న ఐటీ కంపెనీలో భార్య శశికళకు వాటా ఉందని వెల్లడించినట్లు తెలిసింది. పెట్టుబడి పెట్టడానికి సొమ్ము ఎక్కడి నుంచి వచ్చింది? బ్యాంకు లోను తీసుకున్నారా? అప్పు చేశారా? అంటూ సిట్ అధికారులు ప్రశ్నించగా.. ఆడిటర్ చూసుకుంటారని కేఎన్‌ఆర్ బదులిచ్చారు. చాలా ప్రశ్నలకు ఇదే సమాధానమిచ్చినట్లు తెలిసింది.

కాల్ డేటా సేకరణ



లిక్కర్ స్కామ్‌లో ముఠా సభ్యులకు ముఖ్యమంత్రి జగన్‌కు మధ్య వారధిగా కేఎన్‌ఆర్ వ్యవహరించినట్లు తెలిసింది. లిక్కర్ పాలసీ రూపకల్పన నుంచి ప్రతి వారం మద్యం ముడుపులు సక్రమంగా అందుతున్నాయా.. వాటిని ఎక్కడ నిల్వ చేస్తున్నారు.. ఎన్నికల కోసం ఎలా ఖర్చు చేయాలి.. తదితర విషయాలు చర్చించే ప్రతి సమయంలోనూ లిక్క ర్ గ్యాంగ్‌కు జగన్‌తో సమావేశం ఏర్పాటు చేసింది కేఎన్‌ఆర్ అని సిట్ గుర్తించింది. గత వైసీపీ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి జగన్‌తో మాట్లాడాలంటే కేఎన్‌ఆర్‌కు ఫోన్ చేయా లి. లిక్కర్ స్కామ్‌లో కీలక నిందితులందరితోనూ కేఎన్‌ఆర్ నిరంతరం ఫోన్‌లో మాట్లాడినట్లు సిట్ కాల్ డేటా సేకరించింది. జగన్‌తో వాళ్లు ఏమి మాట్లాడారు.. మీరు అక్కడ ఉండి ఏమి విన్నారు.. మీకు అందిన కమీషన్ ఎంత.. తదితర ప్రశ్నలు అడగ్గా అ న్నింటికీ సమాధానాలు దాటవేసినట్లు తెలిసింది.నేడూ విచారణ

మొదట్లో కడప జిల్లాలో ఓ పత్రికలో పనిచేసిన కేఎన్‌ఆర్.. వైఎ?సఆర్ ముఖ్యమంత్రి అయ్యాక తనయుడు జగన్ స్థాపించిన సాక్షి పత్రికలో చేరారు. అనంతరం జగన్ వద్ద వ్యక్తిగత సహాయకుడిగా చేరారు. జగన్ ముఖ్యమంత్రి అయ్యే వరకూ ఆయనది సాదాసీదా జీవితమే. జగన్ సీఎం అయ్యాక 2019-2024 మధ్య ఆయన జీవితం అనూహ్యంగా మారిపోయింది. జగన్ పీఏగా ప్రస్తుతం రూపాయి జీతం కూడా లేకుండా పనిచేస్తున్న కేఎన్‌ఆర్‌కు 2019 నుంచి 2024 మధ్యలో ఇన్ని వందల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయనే దానిపై సిట్ అధికారులు కూపీ లాగుతున్నారు. బుధవారం సుదీర్ఘంగా విచారించిన సిట్ అధికారులు గురువారం మరోమారు ప్రశ్నించి మరిన్ని కీలక విషయాలు వెలికితీసే అవకాశం ఉంది.

ఇదీ కేఎన్‌ఆర్ ఆస్తుల చిట్టా

బెంగళూరులో రెండు ఫ్లాట్లు, తిరుపతిలో మరో రెండు .

హైదరాబాద్, కడప, విజయవాడలో ఇళ్ల నిర్మాణం చేపట్టారు.

బెజవాడలో కార్ల షోరూమ్, హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ కంపెనీలో వాటా.

జగ్గయ్యపేట ప్రాంతంలో 40 ఎకరాల వ్యవసాయ భూమి, ప్రకాశం జిల్లా దర్శిలో పదెకరాలు, భోగాపురం విమానాశ్రయం వద్ద భారీగా భూములు .

భార్యకు రెండు కిలోలకు పైగా బంగారం.

## ఐటీ నుంచి క్వాంటమ్‌కు ఎదగడం మన విధానం

### గొడ్డలి పార్టీకి గోల్ లేదు.. అంతా అడ్డగోలే
### వేట కొడవళ్ల నుంచి గొడ్డలికి మారడమే వారి విధానం

**క్రైం కౌంటర్ న్యూస్ మే 28:** తెలుగుదేశం పార్టీ ఎన్నికల కోసం పనిచేయదు.. భవిష్యత్ తరాల కోసం, వారికి బంగరు భవిత అందించడానికి పనిచేస్తుందని టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. 'ప్రస్తుతం యువతకు కావలసింది ఉద్యోగా లు.. ఉపాధి అవకాశాలే గానీ.. గొడ్డలి పోట్లు కాదు. పేదలకు కావలసింది సంక్షేమం.. గొడ్డలి వేట్లు కాదు. రక్తాభిషేకాలు చేసేవారు స్వర్ణాంధ్ర చరిత్రను లిఖించలేరు.. అందుకే గొడ్డలి పార్టీ నెవర్ అగైన్' అని ప్రజల కు పిలుపిచ్చారు. వేట కొడవళ్ల నుంచి గొడ్డలి పార్టీగా మారడం వారి విధానమైతే.. ఐటీ నుంచి క్వాంటమ్ దిశగా ఎదగడం మన విధానమని.. రెండూ ఒకటి కాదు(బోత్ ఆర్ నాట్ సేమ్) అని స్పష్టం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవా రం జరిగిన మహానాడులో చంద్రబాబు ప్రసంగించా రు. టీడీపీ తొలి నుంచీ మహిళల సాధికారత కోసం, యువత భవిత కోసమే పనిచేస్తూ వస్తోందన్నారు. ఏ పాలసీ అయినా యువత కోసమే చేస్తున్నామని తెలిపారు. 'ఉమ్మడి రాష్ట్రంలో ఐటీ పాలసీతో యువతకు ఉద్యోగాలు వచ్చాయి. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేశ్ యువగళం పాదయాత్రలో యువతకు ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీని నెరవేర్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. జెన్ జీ, జెన్ ఆల్ఫా, టీనేజర్ల ఆలోచనలకు అనుగుణంగా విధానాలు రూ పొందిస్తాం. ఇది నవీన ఆలోచనల సమయం. యువతకు ఉద్యోగాలు. ఉపాధి అవకాశాల కల్పనలో వారి కంటే ముందే ఆలోచన చేస్తున్నాం. ఏ రంగమైనా.. ఏపీయే చిరునామా' అని తెలిపారు. అగ్రెసివ్‌గా.. ప్రోగ్రెసివ్‌గా ముందుకెళ్తున్నామన్నారు. గొడ్డలి పార్టీకి గోల్ లేదని.. అంతా అడ్డగోలుతనమేనని ధ్వజమెత్తా రు. గత పాలకులు ఐదేళ్లలో రాష్ట్రాన్ని ధ్వంసం చేస్తే.. కూటమి వచ్చిన రెండేళ్లలోనే రాష్ట్రాన్ని గాడిలో పెట్టామన్నారు. చంద్రబాబు ఇంకా ఏం చెప్పారంటే..వర్చువల్ మహానాడు కారణంగా వాహనాల హో రు తగ్గిందేమో గానీ.. కార్యకర్తల్లో జోరు తగ్గలేదు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని క్లస్టర్లను అనుసంధానించి మహానాడును నిర్వహించుకుంటున్నాం. పశ్చిమాసియాలో యుద్ధం వల్ల హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహించుకుంటున్నాం. మీటింగ్ మోడల్ మారిందే తప్ప.. మహా నాడు విధానం మారలేదు. కూడు, గూడు, గుడ్డ నినాదంతో ఆవిర్భవించిన టీడీపీ.. విజన్ పాలిటిక్స్‌కు రూపం ఇచ్చింది. జాతీయ జెండా దేశానికి గౌరవం.. పసుపు జెండా తెలుగువారి గౌరవం.. ఆత్మవిశ్వాసం. నాటికీ నేటికీ పార్టీపై ప్రజాదరణ చెక్కు చెదరలేదు. 45 ఏళ్లుగా ప్రజాసమస్యల కోసం పోరాటం చేస్తూనే ఉంది. నరహంతకులు పీకలు కోస్తున్నా, టీడీపీ కార్యకర్తలు పార్టీ జెండాను వీడలేదు. తనను నరుకుతున్నా చంద్రయ్య జై చంద్రబాబు, జై



తెలుగుదేశం అంటూ నినదించి అమరుడయ్యారు. నన్ను కూడా అక్రమంగా జైల్లో పెట్టారు. లోకేశ్ యువగళాన్ని అడ్డుకున్నారు. ఎందరో నేతలను అరెస్టు చేశారు. బాధితులనే నిందితులుగా చేసినా ఏ టీడీపీ నాయకుడూ, కార్యకర్తా వె నుకడుగు వేయలేదు. కొడిగడుతున్న ప్రజాస్వామ్యా న్ని బతికించేందుకు 2024లో బీజేపీ, జనసేనతో కలిసి కూటమిగా ఏర్పడ్డాం. ప్రజలు ఆశీర్వదించారు.

పసుపు పండగను డైవర్ట్ చేసేందుకు..

మహానాడుని డైవర్ట్ చేసేందుకు గొడ్డలి పార్టీ కుట్ర లు చేస్తోంది. ఎన్ని కుట్రలు చేసినా.. ఎన్ని కుయక్తులు పన్నినా టీడీపీని అడ్డుకోలేరు. ఏదైనా పార్టీ ఫస్ట్.. క్యాడరే బెస్ట్. నాయకులను తయారు చేసే విశ్వవిద్యాలయం టీడీపీ. సోషల్ రీ-ఇంజనీరింగే మన విధానం. కార్యకర్తల సంక్షేమం కోసం రూ. 160 కోట్లు ఖర్చు చేశాం. స్పెషల్ రివిజన్(సర్)లో భాగంగా ఓట్ల నమోదు విషయంలో నేతలు, కార్యకర్తలు జాగ్రత్తగా ఉండాలి. ఎవరూ ఇగోలకు వెళ్లొద్దు. మహానాడు సాక్షిగా తెలుగుజాతి కోసం పునరంకితమవుదాం.

అభివృద్ధి చేసి సంపద సృష్టించలేని వారికి సంక్షేమం గురించి మాట్లాడే అర్హత లేదు. వైసీపీకి రాజధానిపై ఓ విజన్ అంటూ లేదు. ఆ పార్టీకి విషం కక్కడమే తెలుసు. అధికారంలో ఉన్నప్పుడు మూడు రాజధానులన్నారు.. ఇప్పుడు మావిగన్ అం టున్నారు. వాళ్లకు ఎలాంటి గోల్ లేదు.. అది ఓ అడ్డగోలు బ్యాచ్. వైసీపీది ఓ బ్లఫ్ బ్యాచ్. ఫేక్ న్యూస్ బ్యాచ్. గత పాలకులు రూ. 32 వేల కోట్ల విద్యుత్ భారాన్ని ప్రజలపై వేశారు. రూ. 1.35 లక్షల కోట్ల మేర డిస్కంలను అప్పుల్లో ముంచారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పాం. తొలిసారి ట్రూ డౌన్ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదే. గత పాలకులు 85 లక్షల టన్నుల చెత్తను వదిలి వెళ్తే దానినీ తొలగించాం. ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేశాం. ఆక్వా ధరలు పడిపోయాయి. ఈ సం క్షోభాన్ని పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నాం.

మహానాడు మహిళలకే అంకితం

మహిళా సాధికారత కోసం, సామాజిక ఆర్థిక రాజకీయ గౌరవం కోసం తమ ప్రభుత్వం పనిచేస్తోంది. ఆస్తి హక్కు నుంచి నేడు తల్లికి వందనం వరకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన ఘనత టీడీపీదే. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు టీడీపీ వారి వెనుక ఉంటుంది. స్త్రీశక్తి ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం. దీపం 2.0 ద్వారా ఏడాదికి 3 ఉచిత సిలిండర్లు ఇస్తున్నాం. గత ఏడా ది లక్ష మంది మహిళలను ఎంట్రప్రెన్యూర్లుగా త యారు చేశాం. 2024 ఎన్నికల్లో కూటమి విజయంలో మహిళలదే కీలక పాత్ర. అందుకే ఈ మహానాడును మహిళా మహానాడుగా ప్రకటిస్తున్నాం.

రాష్ట్రానికి పెట్టుబడుల వెల్లువ..

కూటమి ప్రభుత్వం వచ్చిన 23 నెలల్లో రాష్ట్రానికి రూ. 23 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. తద్వారా 23 లక్షల మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశముంది. ఇప్పటికే 282 ప్రాజెక్టుల ద్వారా రూ. 11.27 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపీబీ ద్వారా ఆమోదం తెలిపాం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కాదు.. గేర్ మార్చి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా పరిశ్రమలకు వేగంగా అనుమతులు ఇస్తున్నాం. కేవలం 36 రోజుల్లో నే ఫైటర్ జెట్ తయారీ, టెస్టింగ్ ప్రాజెక్టుకు అనుమతులిచ్చాం. ఆ స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినట?సతోనే తిరుపతిలో రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ ప్రాజెక్టు వచ్చింది. 23 నెలల్లో రూ. 63 వేల కోట్లకుపైగా మొత్తాన్ని పింఛన్ల కోసం ఖర్చు పెట్టాం. ఇది సంక్షేమంలోనే రికార్డు. కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకున్న ఆక్వా రైతులకు జూన్ 1 నుంచి యూనిట్ విద్యుత్ రూ. 1.50కే ఇవ్వాలని ఆదేశాలిచ్చాం. దివ్యాంగ శక్తి పేరిట ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నాం. ప్రజారోగ్యంలో సంజీవని ప్రాజెక్టుతో వినూత్న మార్పు తీసుకొ చ్చాం. ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా వ్యక్తిగత ఆరోగ్యం, పరిరక్షణ కోసం డిజిటల్ హెల్త్ రికార్డుల కార్యక్రమం 'సంజీవని' అమలు చేస్తాం. మెగా డీఎస్సీ ద్వారా 15,941 మందికి టీచర్ ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదే. 5757 మంది కానిస్టేబుళ్లను రిక్రూట్ చేసిన ప్రభుత్వం మనది. 2026 జాబ్ క్యాలెండర్‌ను కూడా విడుదల చేశాం. విద్యలో రాష్ట్రాన్ని రోల్ మోడల్‌గా నిలుపుతున్నాం. సాగునీటి రంగానికి ప్రాధాన్యమిస్తూ.. 36 ప్రాధాన్య ప్రాజెక్టుల పూర్తికి క్యాలెండర్‌ను కూడా ప్రకటించాం. పోలవరం ప్రాజెక్టును వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల కంటే ముందే పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. గత పాలకుల నిర్లక్ష్యంతో డయాఫ్రం వాల్ ధ్వంసం కావడంతో తిరిగి రూ. 1000 కోట్లతో కొత్త వాల్ నిర్మాణం పూర్తి చేశాం.


ఆకాశమే హద్దుగా రాష్ట్ర యువత అవకాశాలను వినియోగించుకోవాలి. 'వన్ ఫ్యామిలి-వన్ ఎంటర్‌ప్రెన్యూర్' ద్వారా అవకాశాలను వాడుకోవాలి.

చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ సాధించే వరకు వారి వెన్నంటే ఉంటాం. మహిళల పోరాటాలకు ఈ మహానాడు అంకితం.

రైతులను.. వ్యవసాయాన్ని గత పాలకులు నిర్వీర్యం చేశారు. వారికి ఏడాదికి రూ. 7,500 మాత్రమే ఇచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఏటా రూ. 14 వేలను అన్నదాతా సుఖీభవ కింద ఇస్తున్నాం.

తీరం మనదే.. బోటు మనదే.. వేటా మనదే అనేలా చర్యలు చేపట్టాం. 200 మెకనైజ్డ్ బోట్లను రూ. 240 కోట్ల సబ్సిడీపై ఇస్తాం. - సీఎం చంద్రబాబు

# సినిమా



## ఎస్వీ రంగారావు జీవితంలో ఇంత జరిగిందా..!

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో తనదైన ముద్ర వేసిన మహానటుడు ఎస్వీ రంగారావు. ఆయన మరణించి అర్ధ శతాబ్దం గడిచినా, ఆయన చేసిన పాత్రలు, చూపిన నటన నేటికీ సినీ అభిమానుల మదిలో నిలిచి ఉన్నాయి. పాత్రలో జీవించే నటుడిగా పేరుగాంచిన ఎస్వీఆర్, తన కెరీర్‌లో ఎన్నో అద్భుతమైన పాత్రలను పోషించారు. నర్తనశాల చిత్రంలోని కీచకుడి పాత్రకు జకార్తాలో జరిగిన ఆఫ్రో ఏషియన్ సినిమా ప్రదర్శనలో ఉత్తమ నటుడి అంతర్జాతీయ అవార్డును అందుకున్న ఏకైక భారతీయ నటుడిగా పేరు తెచ్చుకున్నారు. ఎస్వీఆర్ కేవలం హీరోలతో సమానమైన ప్రాధాన్యత ఉన్న పాత్రలను మాత్రమే ఎంచుకునేవారు. ఆయన కోసం దర్శకులు ప్రత్యేకంగా పాత్రలను, రచయితలు భారీ డైలాగులను రాసేవారు. షావుకారు సినిమాతో సున్నపు రంగడు పాత్రలో మెప్పించిన ఎస్వీఆర్, ఆ తర్వాత జానపద, పౌరాణిక, సాంఘిక చిత్రాల్లో అద్భుతమైన నటనను ప్రదర్శించారు. 1950ల నుంచి 1970ల వరకు తెలుగు, తమిళ భాషల్లో ఆయన లేని సినిమాను ఊహించడం కష్టంగా ఉండేది. శివాజీ గణేషన్ వంటి నటులు కూడా ఎస్వీఆర్ తో నటించేటప్పుడు అప్రమత్తంగా ఉండేవారంటే ఆయన నటన స్థాయిని అర్థం చేసుకోవచ్చు.అయితే, ఆయన వ్యక్తిగత జీవితం అనేక సవాళ్లతో నిండి ఉండేది. తన మనసుకు నచ్చిన రీతిలో వ్యవహరించే చిన్నపిల్లవాడి మనస్తత్వం ఆయనది. కోపం త్వరగా వచ్చి, అంతే త్వరగా చల్లారే స్వభావం. ఈ పరిస్థితులన్నీ ఇంట్లో ఘర్షణ వాతావరణాన్ని సృష్టించాయి. ఈ వ్యక్తిగత సమస్యలు, అలవాట్లు ఆయన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపాయి. ఒకసారి హైదరాబాద్‌లో షూటింగ్‌లో ఉండగా గుండెపోటు రావడంతో ఉస్మానియా హాస్పిటల్‌లో చికిత్స చేయించుకున్నారు. విశ్రాంతి తీసుకోవాలని, మానసిక ఒత్తిడికి దూరంగా ఉండాలని వైద్యులు సూచించినా, ఎస్వీఆర్ వాటిని పాటించలేదు. తన అలవాట్లను, షూటింగ్‌లను వదులుకోలేదు. ముఖ్యంగా, యశోద కృష్ణ సినిమాలో కంసుడి పాత్రను వదులుకోవడానికి ఆయన అంగీకరించలేదు. అనారోగ్యాన్ని పక్కనపెట్టి, నిర్మాతలను ఒప్పించి మరీ ఆ పాత్రను పోషించారు. సినిమా అయ్యాక అమెరికా వెళ్లి బైపాస్ సర్జరీ చేయించుకోవాలని పిల్లలు ఎంత ఒత్తిడి తెచ్చినా, యశోద కృష్ణ పూర్తయ్యాక వెళ్తానని వారిని ఒప్పించారు. 1974 జులై 18వ తేదీన ఆయన ఇంట్లోనే ఉన్నారు. మధ్యాహ్నం భోజనం చేసి విశ్రాంతి తీసుకున్నారు. సాయంత్రం 4:30 గంటల సమయంలో నిద్రలేవగా, ఇంట్లో ఎదో గొడవ.. ఎస్వీ రంగారావు గారు మద్యం సీసాతో బాత్‌రూమ్‌లోకి వెళ్లారు. మద్యం పూర్తిగా సేవించిన తర్వాత తూలుకుంటూ బయటకు వచ్చి దుస్తులు ధరిస్తుండగా తూలి మంచంపై పడిపోయారు. ఆయన మరణవార్త తెలియగానే రామానాయుడు, వి. మధుసూదనరావు వంటి సినీ ప్రముఖులు రంగారావు ఇంటికి చేరుకున్నారు. అయితే, మొదట్లో సతీమణి లీలావతి పార్థివ దేహాన్ని ఎవరినీ చూడనివ్వలేదు. జాతకాలు, పూజలు, వ్రతాలు నమ్మే ఆమె, తన గురువు మరణించిన వ్యక్తిని బతికించగలరని నమ్మింది. గురువు పాండిచ్చేరిలో ఉండటంతో, ఆయన వస్తే తన భర్త బతుకుతాడనే పిచ్చి భ్రమలో ఉండి, కనీసం శవాన్ని చూడటానికి కూడా అనుమతిని ఇవ్వలేదట. చివరికి గురువు ఫోన్‌లో దొరకకపోవడంతో చేసేదేమీ లేక పార్థివ దేహాన్ని మేడపై నుంచి కిందకు తెచ్చి ఇంటి ముందున్న వసారాలో ఉంచడానికి అంగీకరించారట. చెన్నైలోని కన్నిమ్మపేట శ్మశానవాటికలో రంగారావు గారి అంత్యక్రియలు జరిగాయి. తమిళ నటుడు శివాజీ గణేషన్, హీరోయిన్ వాణిశ్రీ వంటి అనేక మంది సినీ ప్రముఖులు ఆయన అంతిమ దర్శనం కోసం బారులు తీరారు.



## పరగడుపున 'ఈ నీరు' తాగితే శరీరమంతా ఏసీలా చల్లబడుతుంది!



ఖరీదైన ఎనర్జీ డ్రింక్స్, జ్యూస్‌లతో పనిలేకుండా కేవలం రూ. 10 బడ్జెట్‌తోనే మీ ఆరోగ్యాన్ని కాపాడుకునే సూపర్ సమ్మర్ హ్యాక్ ఇది. సోంపులో ఉండే చలవ చేసే గుణాలు, ఎండుద్రాక్షలో ఉండే ఐరన్, పొటాషియం వంటి పోషకాలు శరీరంలో ఎలక్ట్రోలైట్ సమతుల్యతను కాపాడతాయి. మరి ఈ హెల్తీ డ్రింక్‌ను ఎలా తయారు చేసుకోవాలి? ఎవరెవరు దీనిని తాగకూడదో ఇప్పుడు వివరంగా చూద్దాం... శరీరం చల్లబడి ఎసిడిటీ మాయం వేసవిలో కడుపునొప్పి, గుండెల్లో మంట, ఎసిడిటీ సర్వసాధారణం. సోంపు గింజలలోని సహజసిద్ధమైన చల్లదనం కడుపులోని అధిక ఆమ్లాన్ని తగ్గిస్తుంది. ఎండుద్రాక్ష శరీరానికి తక్షణ శక్తిని ఇస్తుంది. ఈ రెండింటి కలయిక వల్ల గ్యాస్ట్రిక్ సమస్యలు, అల్సర్లు వేగంగా తగ్గుముఖం పడతాయి.

2. మలబద్ధకం నివారణ.. రక్తం శుద్ధి ఎండుద్రాక్షలో పీచుపదార్థం, సోంపులో జీర్ణ ఎంజైమ్‌లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ప్రేగుల కదలికలను సులువుగా మార్చి ఉదయమే కడుపు సాఫీగా అయ్యేలా చేస్తాయి. అంతేకాకుండా, ఇది రక్తంలోని మలినాలను తొలగించి రక్తాన్ని శుద్ధి చేస్తుంది. దీనివల్ల ముఖంపై మొటిమలు, మచ్చలు తగ్గి చర్మం సహజంగా మెరుస్తుంది.

3. డీహైడ్రేషన్ నుండి రక్షణ వేసవిలో విపరీతంగా చెమట పట్టడం వల్ల శరీరం నుండి నీటితో పాటు సోడియం, పొటాషియం వంటి లవణాలు కోల్పోతాము. ఎండుద్రాక్షలో పొటాషియం, ఐరన్ మరియు సోంపులో మెగ్నీషియం ఉండటం వల్ల ఈ నీరు శరీరంలో ఎలక్ట్రోలైట్ సమతుల్యతను పునరుద్ధరిస్తుంది. దీనివల్ల ఎండదెబ్బ తగలకుండా ఉండి.. అలసట, తలనొప్పి, కాలు నొప్పులు రావు.

4. బరువు తగ్గడానికి సహాయపడుతుంది సోంపు గింజలు మీ శరీర జీవక్రియను పెంచుతాయి. ఇది కడుపు నిండిన అనుభూతిని ఇవ్వడం వల్ల పదేపదే జంక్ ఫుడ్ తినాలనే కోరిక తగ్గుతుంది. ఉదయాన్నే పరగడుపున ఈ నీటిని తాగి, ఒక 30 నిమిషాలు వాకింగ్ చేస్తే నెలలో సులభంగా 2 కిలోల వరకు బరువు తగ్గొచ్చు.

తయారు చేసుకునే విధానం

ఒక గ్లాసు ప్యూర్ వాటర్‌లో 10 నుండి 15 నల్ల ఎండుద్రాక్షలను, ఒక టేబుల్ స్పూన్ సోంపు గింజలను వేసి రాత్రంతా నానబెట్టండి.

ఉదయాన్నే నిద్రలేవగానే ఆ నీటిని వడకట్టి పరగడుపున తాగాలి.

నానిన ఎండుద్రాక్షలను, సోంపును పారేయకుండా నమిలి తినేయడం వల్ల పూర్తి ఫైబర్ శరీరానికి అందుతుంది.

గమనిక: ఈ నీటిని ఫ్రిజ్‌లో పెట్టకూడదు, తాజాగా ఉన్నప్పుడే తాగాలి. ఇందులో ఉప్పు లేదా అదనపు చక్కెర కలపకూడదు.

ఎవరు తాగకూడదు? డయాబెటిస్ ఉన్నవారు: రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉన్నవారు దీనిని తాగే ముందు వైద్యులను సంప్రదించాలి. ఎందుకంటే ఎండుద్రాక్షలో సహజ సిద్ధమైన గ్లూకోజ్ ఉంటుంది.

విరేచనాలు ఉంటే: మీకు ఇప్పటికే మోషన్స్ లేదా విరేచనాలు అవుతుంటే.. రెండు రోజుల పాటు ఈ నీటిని తాగడం ఆపేయాలి. రోజుకు ఒక గ్లాసు మాత్రమే తాగాలి, అంతకంటే ఎక్కువ తాగితే కడుపు ఉబ్బరానికి దారితీయవచ్చు.

మార్కెట్లో దొరికే కెమికల్ ఎనర్జీ డ్రింక్స్‌కు బదులుగా, కేవలం పది రూపాయల వంటింటి వస్తువులతో ఈ వేసవిలో మూడు నెలల పాటు 'కిస్మిస్-సోంపు నీరు' తాగడం అలవాటు చేసుకోండి. ఇది మీ కడుపును చల్లగా ఉంచడమే కాకుండా పూర్తి ఆరోగ్యాన్ని మీ చేతుల్లో పెడుతుంది.

గమనిక: ఈ కథనంలోని అంశాలు అంతర్జాలంలో అందుబాటులో ఉన్న సమాచారం, ఆయుర్వేద నిపుణుల సలహాల ఆధారంగా కేవలం మీ అవగాహన కోసం అందించబడ్డాయి. ఆరోగ్య సమస్యలు ఉన్నవారు వైద్యుని సంప్రదించడం శ్రేయస్కరం.

## ఎండుద్రాక్ష, పాలు, కేవలం నెలరోజులు ఇలా తినండి.



ఎండుద్రాక్షను నీటిలోనే కాకుండా, రాత్రంతా పాలలో నానబెట్టి ఉదయాన్నే తీసుకోవడం వల్ల అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయని నిపుణులు చెబుతున్నారు. పాలు, ఎండుద్రాక్షల కలయిక వల్ల శరీరానికి కాల్షియం, ప్రోటీన్, ఐరన్, ఫైబర్ పుష్కలంగా అందుతాయి. ఇది ఎముకలను బలోపేతం చేసి మహిళల్లో బోలు ఎముకల వ్యాధిని నివారిస్తుంది. అలాగే, రక్తహీనత, మలబద్ధకం, అధిక రక్తపోటు వంటి సమస్యలను నియంత్రించడంలో సహాయపడుతుంది. పూర్తి ప్రయోజనాలేంటో ఇప్పుడు చూద్దాం..ఎముకల బలానికి అమృతం:

పాలు, ఎండుద్రాక్ష రెండింటిలోనూ కాల్షియం, ప్రోటీన్లు సమృద్ధిగా ఉంటాయి. ఎముకలు బలహీనంగా ఉన్నవారు లేదా కీళ్ల నొప్పులతో బాధపడేవారు ఒక నెల పాటు పాలలో నానబెట్టిన ఎండుద్రాక్షను క్రమం తప్పకుండా తీసుకోవాలి. ఇది మహిళల్లో వచ్చే బోలు ఎముకల వ్యాధి ప్రమాదాన్ని సమర్థవంతంగా నివారిస్తుంది.

రక్తహీనత, రక్తపోటుకు చెక్:

ఎండుద్రాక్షలో ఐరన్, పొటాషియం కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. రాత్రంతా పాలలో నానబెట్టడం వల్ల ఇందులోని పోషకాలను శరీరం త్వరగా గ్రహిస్తుంది. కేవలం నెల రోజుల పాటు దీనిని రోజూ తీసుకోవడం వల్ల శరీరంలో రక్తం పెరిగి రక్తహీనత తగ్గుతుంది. అలాగే, ఇందులోని పొటాషియం రక్తపోటును అదుపులో ఉంచుతుంది.

జీర్ణక్రియ మెరుగుపడుతుంది:

ఎండుద్రాక్షలో డైటరీ ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. పాలలో నానబెట్టడం వల్ల ఇవి మరింత మృదువుగా మారి, పేగులకు అంటుకోకుండా మలబద్ధకం సమస్యను దూరం చేస్తాయి. ప్రతి ఉదయం ఖాళీ కడుపుతో వీటిని తినడం వల్ల పొట్టలోని మంచి బ్యాక్టీరియా (+బ్ ధ్రుఖ్వీవతీఖు) మెరుగై, జీర్ణక్రియ రేటు పెరుగుతుంది.

గుండె ఆరోగ్యం, అందమైన చర్మం:

ఎండుద్రాక్షలో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. అలాగే, ఇందులోని ముఖ్యమైన నూనెలు చర్మం పొడిబారడం, మొటిమలు, హైపర్ పిగ్మెంటెషన్ వంటి చర్మ సమస్యలను నయం చేసి ముఖాన్ని కాంతివంతంగా మారుస్తాయి. అధిక ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉండే ఈ మిశ్రమం ఎక్కువ సమయం కడుపు నిండుగా ఉంచుతుంది. ఫలితంగా బరువు తగ్గాలనుకునే వారికి కూడా ఇది బాగా పనిచేస్తుంది. కేవలం ఒక నెల పాటు ఈ నియమాన్ని పాటిస్తే మీ ఆరోగ్యంలో ఊహించని మార్పులను గమనించవచ్చు.

## 14 మ్యాచ్‌ల్లో ఒక్కటే హాఫ్ సెంచరీ.. లెక్కేస్తే ఒక్కో రన్‌కు రూ.9 లక్షలు.

ఐపీఎల్ 2026 ముగిసేసరికి లక్నో సూపర్ జాయింట్స్ (ూా+) ఫ్రాంచైజీకి కోలుకోలేని షాక్ తగిలింది. వరుసగా మూడో సీజన్లోనూ ఆ జట్టు కనీసం ప్లే-ఆఫ్స్‌కు కూడా అర్హత సాధించలేకపోయింది. ఈ 2026 సీజన్ లీగ్ స్టేజ్ ముగిసేసరికి పాయింట్ల పట్టికలో లక్నో ఏకంగా 10వ స్థానంలో నిలిచింది. ఐపీఎల్ 2025 మెగా వేలంలో ఎన్నో ఆశలు పెట్టుకుని రికార్డు స్థాయిలో రూ.27 కోట్ల భారీ ధర వెచ్చించి రిషబ్ పంత్?ను కొనుగోలు చేసిన లక్నో ఓనర్ సంజీవ్ గోయెంకాకు ఈ సీజన్ ఒక పీడకలగా మిగిలిపోయింది. ఈ సీజన్లో లక్నో సూపర్ జాయింట్స్ ఆడిన 14 మ్యాచ్‌లలో కేవలం 4 మ్యాచ్‌లలో మాత్రమే విజయం సాధించి ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. ముంబై ఇండియన్స్‌తో సమానంగా పాయింట్లు ఉన్నప్పటికీ, నెట్ రన్ రేట్ దారుణంగా ఉండటంతో లక్నో టేబుల్‌లో అట్టడుగు స్థానానికి పడిపోయింది.



టాస్ గెలిచినా మ్యాచ్ ఓడిపోయే రేంజ్‌లో సాగిన లక్నో ప్రస్థానంలో రిషబ్ పంత్ సంపాదన మాత్రం హాట్ టాపిక్‌గా మారింది. మెగా వేలం కాంట్రాక్ట్ విలువ రూ.27 కోట్లు కాగా, ఈ సీజన్లో అతను ఆడిన 14 మ్యాచ్‌లకు గానూ మ్యాచ్‌కి రూ.7.5 లక్షల చొప్పున అదనంగా మరో రూ.1.05 కోట్ల మ్యాచ్ ఫీజు అందుకున్నాడు. అంటే ట్యాక్సులు, జరిమానాలు కాకుండా ఈ ఒక్క ఐపీఎల్ 2026 సీజన్ ద్వారానే రిషబ్ పంత్ ఏకంగా రూ.28,05,00,000 (రూ.28.05 కోట్లు) జేబులో వేసుకున్నాడు. దీంతో ఐపీఎల్ హిస్టరీలోనే అత్యధిక ధర పలికిన ప్లేయర్‌గా పంత్ రికార్డు సృష్టించాడు. ఇంత భారీ మొత్తం చెల్లించినందుకు పంత్ బ్యాటింగ్ లేదా కప్ కెప్టెన్సీతో ఏమైనా అద్భుతాలు చేశాడా అంటే అస్సలు లేదు. బ్యాటర్ల హవా నడుస్తున్న మోడ్రన్ టీ20 క్రికెట్లో పంత్ కేవలం 138.05 స్ట్రైక్ రేట్‌తో ఆడి విమర్శల పాలయ్యాడు. టోర్నీ ప్రారంభంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ూ=ఎ) పై చేసిన 68లి (50 బంతుల్లో) పరుగుల ఇన్నింగ్స్ మినహాయిస్తే, మిగిలిన ఏ మ్యాచ్‌లోనూ పంత్ కనీసం 50 పరుగుల మార్కును కూడా దాటలేకపోయాడు.మొత్తంగా 14 మ్యాచ్‌లలో 13 ఇన్నింగ్స్ ఆడిన పంత్.. 28.36 సగటుతో కేవలం 312 పరుగులు మాత్రమే చేయగలిగాడు. కెప్టెన్‌గా నంబర్ 3, నంబర్ 4, ఓపెనర్‌గా ఇలా రకరకాల పొజిషన్లలో బ్యాటింగ్‌కు వచ్చి జట్టు కాంబినేషన్‌ను పూర్తిగా దెబ్బతీశాడనే విమర్శలు వచ్చాయి. ఇక వికెట్ కీపర్‌గా మాత్రం ఈ సీజన్లో 10 క్యాచ్‌లు అందుకున్నాడు.

రిషబ్ పంత్ అందుకున్న మొత్తం ప్యాకేజీ (రూ.28.05 కోట్లు)ని, అతను ఈ సీజన్లో చేసిన మొత్తం పరుగులతో (312 రన్స్) భాగించి చూస్తే లక్నో మేనేజ్‌మెంట్‌కు దిమ్మతిరిగే లెక్క తేలింది. ఈ సీజన్లో రిషబ్ పంత్ చేసిన ప్రతీ ఒక్క రన్‌కు లక్నో సూపర్ జాయింట్స్ ఏకంగా రూ.8,99,038 (దాదాపు రూ.9 లక్షలు) ఖర్చు చేసింది. ఒక బ్యాటర్ చేసిన సింగిల్ రన్‌కు ఈ స్థాయిలో ఐపీఎల్ చరిత్రలో ఏ ఫ్రాంచైజీ కూడా ఇంత భారీ ధర చెల్లించలేదు.

పంత్ బ్యాటింగ్ సామర్థ్యంపై సంజీవ్ గోయెంకాకు నమ్మకం ఉన్నప్పటికీ, అతని పేలవమైన కెప్టెన్సీ, వ్యూహాత్మక లోపాలపై లక్నో డైరెక్టర్ టామ్ మూడీ ఇప్పటికే అసంతృప్తి వ్యక్తం చేస్తూ జట్టులో రీసెట్ అవసరమని హింట్లు ఇచ్చారు. వచ్చే ఐపీఎల్ 2027 సీజన్ కంటే ముందే పంత్‌ను కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పించి, ఒత్తిడి లేకుండా కేవలం ప్యూర్ బ్యాటర్‌గా మాత్రమే ఆడించేలా లక్నో థింక్ ట్యాంక్ గట్టి ప్లాన్ చేస్తోందని సమాచారం.

Published by katikala Vara Prasad. Owned by katikala Vara Prasad. Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006.published at HNo:21-119 west ibrahimpatnam,krishna andhrapradesh 521456Editor. Katikala Vara Prasad.RNI APTEL/25/A2844. Ph:9849707349 . email:kvp6858@gmail.com.